RNI NO.APTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 12.06.2025 | సంపుటి : 11 సంచిక : 324 | పేజీలు : 12 వెల: రూ. 4/-

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






## కాళేశ్వరం పత్రాలను బయటపెడతా..

### స్థానిక ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు



తాను ఉన్నంత వరకు కాంగ్రెస్‌లోకి కెసిఆర్‌ను రానివ్వను

తెలంగాణకు ప్రథమ శత్రువు కెసిఆర్ కుటుంబమే

- తెలంగాణ అభివృద్ధికి కిషన్ రెడ్డి ప్రధాన అడ్డంకి
- హైదరాబాద్‌కు వచ్చాక మంత్రులకు శాఖల కేటాయింపు
- మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి

*తెలంగాణ మంత్రివర్గ విస్తరణ మరియు శాఖల కేటాయింపుపై ఢిల్లీలో ఎలాంటి చర్చలు జరగలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ తిరిగి వచ్చాక అందరితో సంప్రదించి శాఖలను నిర్ణయించామని తెలిపారు. కర్ణాటక కులగణనపై మాత్రమే అధిష్ఠానంతో చర్చలు జరిగినట్లు వెల్లడించారు. రెండు రోజుల్లో కాళేశ్వరం ప్రాజెక్టుపై మీడియా సమావేశం నిర్వహించి, అన్ని డాక్యుమెంట్లను బహిర్గతం చేస్తానని రేవంత్ ప్రకటించారు.*

న్యూఢిల్లీ, జూన్ 11 (జనంసాక్షి) : తాను ఉన్నంత వరకు కాంగ్రెస్‌లో మాజీ సీఎం కేసీఆర్ కుటుంబానికి ఎంట్రీ లేదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ కుటుంబమే రాష్ట్రానికి ప్రధాన శత్రువని ఢిల్లీలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మండిపడ్డారు. మంత్రివర్గ విస్తరణ, శాఖల కేటాయింపుపై ఢిల్లీలో ఎలాంటి చర్చ జరగలేదని, హైదరాబాద్‌కు తిరిగి వచ్చాక అందరితో సంప్రదించి శాఖలను నిర్ణయించామని రేవంత్ తెలిపారు. కర్ణాటక కుల గణనపై మాత్రమే అధిష్ఠానంతో చర్చలు జరిగాయని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రెండు రోజుల్లో మీడియా సమావేశం నిర్వహించి, అన్ని డాక్యుమెంట్లను బహిర్గతం చేస్తానని ఆయన ప్రకటించారు.
కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై రేవంత్ తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణకు సంబంధించి కేంద్రంలో అన్ని అంశాలకూ కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నారని, రాష్ట్రానికి ఒక్క ప్రాజెక్టు కోసం కూడా నిధులు సాధించలేదని ఆరోపించారు. కిషన్ రెడ్డి తెలంగాణ అభివృద్ధి కోసం ముందుకొస్తే తాను సహకరించడానికి సిద్ధంగా ఉన్నానని, మిగతా 2లో..

### ఎంతటి వారున్నా వదిలిపెట్టం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



ములుగు, (జనంసాక్షి) : గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం, ధరణి, మరియు మిషన్ భగీరథ పథకాలు భారీ స్కామ్‌లుగా ఉన్నాయని తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ములుగులో మీడియాతో జరిగిన ఇష్టాగోష్ఠిలో ఆయన మాట్లాడుతూ, మిగతా 2లో..



## అన్ని అనుమతులతోనే కాళేశ్వరం నిర్మాణం

### క్యాబినెట్, ప్రభుత్వ ఆమోదం ఉంది

- త్వరగా నిర్మించేందుకు కమిషన్ ఏర్పాటు
- ప్రాజెక్టుపై అన్ని అంశాలతో కూడిన బుక్ అందచేత
- 50 నిమిషాల పాటు కెసిఆర్‌ను విచారించిన కమిషన్

వ్యాప్కోస్ సిఫారసులతో కాళేశ్వరం నిర్మాణం

విచారణకు కమిషన్ ముందు హాజరైన కేసీఆర్

హైదరాబాద్, జూన్ 11 (జనంసాక్షి) : కాళేశ్వరం ప్రాజెక్టు ఆనకట్టల నిర్మాణం కేబినెట్, ప్రభుత్వ ఆమోదంతో జరిగిందని మాజీ ముఖ్యమంత్రి, భారాస అధినేత కేసీఆర్ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు స్పష్టం చేశారు. వ్యాప్కోస్ సిఫార్సుల ఆధారం గా స్థల మార్పు చేసి, అన్ని అనుమతులతో నిర్మాణం పూర్తయిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబ ంధించిన అన్ని వివరాలతో కూడిన పుస్తకాన్ని కమిషన్ కు అందజేశారు. బీఆర్కే భవన్‌లో జరిగిన కాళేశ్వరం కమిషన్ విచారణలో కేసీఆర్‌ను సుమారు 50 నిమిషా ల పాటు విచారించారు. కమిషన్ 18 ప్రశ్నలను సంధించగా, కేసీఆర్ సుదీర్ఘంగా వివరణ ఇచ్చారు. ఆనకట్టల నిర్మాణ నిర్ణయం, కేబినెట్ ఆమోదం, కాళే శ్వరం కార్పొరేషన్ ఏర్పాటు, రీ-ఇంజనీరింగ్ వంటి అంశాలపై కమిషన్ ఆరా తీసింది. కొత్త రాష్ట్రంలో నిధుల సమీకరణ కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లు, ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేసీఆర్ వివరించారు. బ్యారేజీల్లో నీటి నిల్వ విషయంలో మిగతా 2లో..

**పల్లాని పరామర్శించిన కేసీఆర్ :** జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని భారాస అధినేత కేసీఆర్ పరామర్శించారు. కాలు జారి పడటంతో తుంటి ఎముక గాయంతో సోమాజీగూడలోని యశోదా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పల్లాను కేసీఆర్ సందర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని డాక్టర్ల నుంచి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కాళేశ్వరం కమిషన్ విచారణ ముగిసిన వెంటనే కేసీఆర్ నేరుగా యశోదా ఆసుపత్రికి బయలుదేరారు. ఆయనతో పాటు మాజీ మంత్రులు హరీశ్ రావు, ప్రశాంత్ రెడ్డి, పలువురు భారాస నేతలు కూడా పల్లాను పరామర్శించారు.



## ఆయుధ కొనుగోళ్లపై పాక్ దృష్టి

### రక్షణ బడ్జెట్ 20% పెంపు



చైనాతో జే-35 జెట్‌ల ఒప్పందం

- పర్యావరణ బడ్జెట్‌లో కోత
- ఆర్థిక సంక్షోభంలో నిర్ణయం

ఇస్లామాబాద్, (జనంసాక్షి) : భారత్ నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ దెబ్బతో పాకిస్థాన్ ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ రక్షణ బడ్జెట్‌ను 20 శాతం పెంచింది. ఈ నిర్ణయం ఆపరేషన్ సింధూర్ దాడుల తర్వాత కేవలం వారాల వ్యవధిలోనే తీసుకోవడం గమనార్హం. ఆయుధ కొనుగోళ్లపై దృష్టి సారించిన పాకిస్థాన్, రక్షణ శాఖకు 9 బిలియన్ డాలర్లు కేటాయించింది, ఇది గత ఏడాదితో పోలిస్తే 20% అధికం. అయితే, ప్రభుత్వ ఖర్చులను 7% తగ్గించడంతో పాటు, పర్యావరణ బడ్జెట్‌లో భారీ కోత విధించింది.
పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలోని ప్రభుత్వం, సైన్యాధ్యక్షుడు జనరల్ అసిమ్ మునీర్ డిమాండ్లను సంతృప్తిపరచడానికి ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సింధూర్ దాడుల్లో పాక్ సైన్యం గణనీయమైన నష్టం చవిచూసింది. ముఖ్యంగా, రావల్పిండి సమీపంలోని నూర్‌ఖాన్ వైమానిక స్థావరంతో సహా పలు సైనిక కేంద్రాలు దెబ్బతిన్నాయి. హెచ్‌క్యూ-9 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ మరియు బైరక్తర్ టీబీ2 డ్రోన్‌లు ఆశించిన సామర్థ్యాన్ని చూపలేకపోయాయి, దీంతో ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలో లోపాలను సవరించేందుకు పాక్ చర్యలు తీసుకుంటోంది.
పాకిస్థాన్‌లో పర్యావరణ విపత్తులు తీవ్ర సమస్యగా ఉన్నాయి. ప్రపంచంలో పర్యావరణ విపత్తులను ఎదుర్కొనే దేశాల జాబితాలో పాక్ ఎనిమిదో స్థానంలో ఉంది. 2022లో వరదల వల్ల 3.3 కోట్ల మంది ప్రభావితమై, 15 బిలియన్ మిగతా 2లో..

## కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు



వివేక్‌కు కార్మిక, మైనింగ్ శాఖలు.. అడ్లూరికి సంక్షేమం... శ్రీహరికి క్రీడలు, యువజనం

హైదరాబాద్, జూన్ 11 (జనంసాక్షి) : తెలంగాణలో కొత్త మంత్రులకు శాఖల కేటాయించారు. ఇటీవల ప్రమాణం చేసిన ముగ్గురు మంత్రులకు శాఖలు కేటాయించారు. సిఎం రేవంత్ ఢిల్లీ నుంచి హైదరాబాద్ చేరుకున్న తరవాత ఈ కేటాయింపు జరిగింది. గడ్డం వివేక్‌కు కార్మిక, మైనింగ్ శాఖలు.. అలాగే వాకాటి శ్రీహరికి పశుసంవర్థక, క్రీడలు, యువజన శాఖలు, అడ్లూరు లక్ష్మణ్‌కు ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖను కేటాయించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనుందని సమాచారం. ఈ ఉత్తర్వులు జారీ చేసే ముందు సీఎం రేవంత్ రెడ్డితో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రుల శాఖ కేటాయింపుపై వీరిద్దరు చర్చించినట్లు- తెలుస్తోంది. ఒక్కో మంత్రికి రెండేసి శాఖలు చొప్పున కేటాయించాలనే ప్రతిపాదనను సీఎస్‌కు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చేసినట్లు- సమాచారం. జూన్ 8వ తేదీ ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి.. తన కేబినెట్‌ను పునర్వ్యవస్థీకరించారు. ఈ సందర్భంగా కేబినెట్‌లోకి కొత్తగా ముగ్గురు ఎమ్మెల్యేలు గడ్డం వివేక్ (చెన్నూరు), మిగతా 2లో..



## రక్షణ శాఖ సహకారంతో ఎస్ఎల్బీసీ సొరంగం

### ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ సహాయంతో సొరంగం పనుల పునరుద్ధరణ

- ప్రత్యేక కార్యదర్శికల్నల్ పరీక్షిత్ మెహరా, సలహాదారుగా జనరల్ హర్పాల్ సింగ్
- డెన్మార్క్ నుంచి ఎలక్ట్రోమాగ్నెటిక్ పరికరాలు, లైడార్‌తో హెలికాప్టర్ సర్వే.
- 9 కి.మీ. సొరంగం రెండేళ్లలో పూర్తిగా ఇరుక్కుపోయిన టీబీఎంను దాటి కొత్త తవ్వకం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, (జనంసాక్షి) : శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్బీసీ) సొరంగం పనుల పునరుద్ధరణకు తెలంగాణ ప్రభుత్వం సన్నద్ధమవుతోందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మిగిలిన 9 కిలో మీటర్ల సొరంగం నిర్మాణాన్ని రాబోయే రెండేళ్లలో పూర్తి చేయడానికి చర్యలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. రక్షణ మంత్రిత్వ శాఖతో జరిగిన సమావేశంలో ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ సహకారం కోరగా, వారు అంగీకరించినట్లు ఆయన వెల్లడించారు. శ్రీశైలం పులుల సంరక్షణ కేంద్రంగా ఉన్నందున, హెలికాప్టర్ సర్వే ద్వారా పనులు ప్రారంభించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.
కేంద్రం నుంచి ఆర్మీ కల్నల్ పరీక్షిత్ మెహరాను ప్రత్యేక కార్యదర్శిగా, సరిహద్దు రోడ్ల సంస్థ మాజీ డీజీ జనరల్ హర్పాల్ సింగ్‌ను గౌరవ సలహాదారుగా డిప్యూటేషన్‌పై తెలంగాణకు పంపేందుకు అంగీకారం లభించిందని మంత్రి తెలిపారు. వీరి సహకారంతో రాష్ట్రంలోని సీతారామ, దేవాదుల సహా పెండింగ్‌లో ఉన్న అన్ని సొరంగ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. డెన్మార్క్ నుంచి అత్యాధునిక ఎలక్ట్రోమాగ్నెటిక్ సర్వే పరికరాలను తీసుకొస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ పరికరాలతో 44 కి.మీ. సొరంగం యొక్క భూగర్భ పరిస్థితులను ఒక కిలో మీటరు లోతు వరకు అంచనా వేయనున్నారు. హెలికాప్టర్‌లకు లైడార్ సాంకేతికతను ఏర్పాటు చేసి సర్వే నిర్వహిస్తామని, వైమానిక దళం మరియు పవన్ హన్స్ మిగతా 2లో..



## గాలికి ఊరట

- నాంపల్లికోర్టు తీర్పును సస్పెండ్ చేసిన హైకోర్టు
- అక్రమ మైనింగ్ కేసులో గాలి జనార్దన్‌రెడ్డితో సహా నలుగురికి బెయిల్

2

## తెలంగాణ గ్రూప్-1 నియామకాలపై స్టే కొనసాగుతోంది

హైకోర్టులో విచారణ జూన్ 30కి వాయిదా

## ఎలాన్ మస్క్ పశ్చాత్తాపం



- ట్రంప్‌పై పోస్టులు దూరం వెళ్లాయని వ్యాఖ్య
- బిగ్ బ్యూటిఫుల్ బిల్' వివాదం: విభేదాలకు మూలం
- 'ద అమెరికా పార్టీ' మస్క్ కొత్త పార్టీగా ప్రచారం

అమెరికా, జూన్ 11 (జనంసాక్షి) : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మధ్య విభేదాలు తలెత్తిన విషయం తెలిసిందే. గతంలో సన్నిహితంగా ఉన్న ఈ ఇద్దరూ ఇప్పుడు సామాజిక మాధ్యమాల వేదికగా మాటల యుద్ధం చేస్తున్నారు. ట్రంప్‌పై తీవ్ర విమర్శలు చేసిన మస్క్, తాజాగా తాను చేసిన కొన్ని పోస్టులు చాలా దూరం వెళ్లాయని, అందుకు పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నట్లు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "గత వారం అధ్యక్షుడు డొనాల్డ్ మిగతా 2లో..

## ఇంజనీర్ నూనె శ్రీధర్ ఆస్తులు వందకోట్ల మాటే

- రూ.కోట్లలో అక్రమాస్తులు కూడబెట్టిన శ్రీధర్
- ఎసిబి సోదాల్లో భారీగా బయటపడ్డ ఆస్తులు

*నీటిపారుదల శాఖ ఈఈ నూనె శ్రీధర్ నివాసం, కార్యాలయం, బంధువుల ఇళ్లలో ఏసీబీ సోదాల్లో వందల కోట్ల విలువైన అక్రమాస్తులు గుర్తించారు. తెల్లాపూర్‌లో విల్లా, షేక్‌పేటలో ఫ్లాట్, కరీంనగర్, వరంగల్‌లో భవనాలు, 19 ప్లాట్లు, 16 ఎకరాల భూమి, కార్లు, బంగారం, బ్యాంకు నిల్వలు బయటపడ్డాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో కీలక పాత్ర పోషించిన శ్రీధర్‌ను అరెస్టు చేసి నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు.*



12

## కాళేశ్వరం ద్వారా తెలంగాణకు శాశ్వత పరిష్కారం

- తెలంగాణ సాధించిన నేతగా.. సస్యశ్యామలం చేసిన నేతగా గుర్తింపు
- కెసిఆర్‌ను దార్శనికతను అర్థం చేసుకోవడం కాంగ్రెస్‌కు అసాధ్యం : కేటీఆర్

హైదరాబాద్, (జనంసాక్షి) : కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తెలంగాణలో కరువు మరియు నీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం చూపించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ బలం మరియు జీవన దృక్పథాన్ని కాంగ్రెస్ నాయకులు జీవితకాలం వెచ్చించినా మిగతా 2లో..



# మంగ్లీ బర్త్‌డే పార్టీలో విదేశీ మద్యం, గంజాయి

## రిసార్ట్‌పై పోలీసు దాడి, గాయనిపై కేసు



**రంగారెడ్డి, (జనంసాక్షి) :** గాయని మంగ్లీ బర్త్‌డే పార్టీలో విదేశీ మద్యం, గంజాయి లభ్యమైన ఘటన రంగారెడ్డి జిల్లాలో చోటుచేసుకుంది. మంగళవారం రాత్రి చేవెళ్ల మండలం ఈర్లపల్లి శివారులోని త్రిపుర రిసార్ట్‌లో మంగ్లీ తన పుట్టినరోజు సందర్భంగా స్నేహితులు, కుటుంబ సభ్యుల కోసం పార్టీ నిర్వహించారు. ఈ వేడుకకు సుమారు 50 మంది, వీరిలో చిత్ర పరిశ్రమకు చెందిన సెలెబ్రిటీలు కూడా హాజరైన ట్లు తెలుస్తోంది. రాత్రి 2 గంటల సమయంలో ఎస్‌వోటీ పోలీసులు రిసార్ట్‌పై ఆకస్మిక దాడులు నిర్వహించారు. పార్టీకి వచ్చిన 48 మందికి గంజాయి పరీక్షలు చేయగా, 9 మందికి పాజిటివ్ ఫలితం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో వారిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. అనుమతి లేకుండా బర్త్‌డే పార్టీ నిర్వహించినందుకు మంగ్లీతో పాటు రిసార్ట్ జనరల్ మేనేజర్ శివరామకృష్ణపై కేసు నమోదు చేశారు. పార్టీలో దివి, కాసర్ల శ్యామ్, రచ్చ రవి, సింగర్ ఇంద్రావతి వంటి చిత్ర పరిశ్రమ వ్యక్తులు పాల్గొన్నారు. దామోదర్ అనే వ్యక్తి గంజాయి సేవిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు, అతడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు విదేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు, అనుమతి లేకుండా డీజే ప్లే చేసినందుకు డీజే సామగ్రిని సీజ్ చేశారు.

# ట్యాపింగ్ కేసులో ముగిసిన ప్రభాకర్ రావు విచారణ

- దాదాపు 9 గంటల పాటు అధికారుల ప్రశ్నలు
- తెలియదు...జ్ఞాపకం లేదంటూ సమాధానం
- 14న మరోమారు విచారణకు రావాలని ఆదేశం



**హైదరాబాద్, జూన్ 11 (జనంసాక్షి) :** తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు విచారణ ముగిసింది. ప్రభాకర్ రావును 9 గంటల పాటు సిట్ అధికారులు విచారించారు. జూన్ 14న మరోసారి విచారణకు రావాలని సిట్ అధికారులు ఆదేశించారు. నేడు సుదీర్ఘంగా ప్రభాకర్ రావుని సిట్ ప్రశ్నించింది. చాలా ప్రశ్నలకు ఎస్ఐబీ మాజీ చీఫ్ సమాధానాలను దాటవేశారు. కొన్ని ప్రశ్నలకు అధికారికం, వ్యక్తిగతం అంటూ సమాధానాలు ఇచ్చారు. ఇంకొన్ని వాటికి అయితే తెలీదు, గుర్తులేదు అంటూ ప్రభాకర్ రావు సమాధానం ఇచ్చారు. కొంత సమాచారాన్ని ధ్రువీకరించలేను అంటూ సిట్ అధికారులతో చెప్పారు. తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో జూన్ 14న ప్రభాకర్ రావు, ప్రణీత్ రావులను కలిపి సిట్ విచారించనునట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ప్రభాకర్ రావు నుంచి సిట్ స్వాధీనం చేసుకోలేదు. అయితే కొన్నింటికి రాత పూర్వకంగా సమాధానాలు తీసుకుంది. జూన్ 9న ప్రభాకర్ రావు సిట్ ముందు హాజరైన విషయం తెలిసిందే. సిట్ అధికారులు ఆయనను దాదాపు 8 గంటల పాటు- విచారించారు. ఈ కేసులో ఇప్పటివరకు సేకరించిన ఆధారాలను ముందు ఉంచి ప్రశ్నించారు. 2023 అసెంబ్లీ ఎన్నికలు, అంతకు ముందు జరిగిన ఉప ఎన్నికల సమయంలో ఆయన వాడిన అధికారిక, అనధికారిక సెల్‌ఫోన్లను తమకు అప్పగించాలని సిట్ అధికారులు మొదటిరోజు ఆదేశించారు. సెల్‌ఫోన్లతో పాటు- ల్యాప్‌టాప్, మ్యాక్ నోట్‌బుక్‌లను సైతం తీసుకురావాలని సూచించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావుపై పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో ఏ1గా ఉన్నారు. కేసు నమోదైన సమయంలోనే ప్రభాకర్ రావు అమెరికా వెళ్లిపోయారు. ఆయన తిరిగి రాకపోవడంతో పోలీసులు పాస్‌పోర్టు రద్దు చేయించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు విచారణకు సహకరించేందుకు ఎమర్జెన్సీ ట్రావెల్ డాక్యుమెంట్‌తో జూన్ 8న రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు. ఇప్పటికే ప్రణీత్ రావు, రాధాకిషన్ రావు, భుజంగ రావు, తిరుపతన్నను సిట్ అధికారులు అరెస్టు చేశారు. వారు ఇచ్చిన సమాచారం ఆధారంగా ప్రభాకర్ రావును ప్రశ్నించినట్లు- తెలుస్తోంది.




# కారును ఢీకొన్న బస్సు

## ముగ్గురు వ్యక్తుల మృతి

**రంగారెడ్డి, జూన్ 11 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని మాల్ వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. నాగార్జునసాగర్ రహదారిపై కారును బస్సు ఢీకొట్టిన ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతులను మహబూబ్‌నగర్‌కు చెందిన సాయితేజ, పవన్, రాఘవేంద్రగా గుర్తించారు. వీరంతా ఉద్యోగాలు చేస్తూ హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. మంగళవారం ఏడుగురు స్నేహితులు నాగార్జునసాగర్ పరిధిలోని వైజాగ్ కాలనీకి విహారానికి వెళ్లారు. అర్ధరాత్రి తిరుగు ప్రయాణంలో మాల్ వద్ద వీరి కారును బస్సు ఢీకొంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పసిడి పతకాలు పట్టిన అమ్మాయిలు

**హైదరాబాద్, జూన్ 11 (జనంసాక్షి) :** హైదరాబాద్ జేఎన్‌టీ-యూ కాన్వకేషన్‌లో ఇద్దరు విద్యార్థినులు బంగారు పతకాలు సాధించారు. సంగారెడ్డికి చెందిన నవ్య కంప్యూటర్ సైన్స్‌లో, మంచిర్యాలకు చెందిన సుప్రియ సివిల్ ఇంజినీరింగ్‌లో ప్రతిభ చూపి 8 పసిడి పతకాలను కైవసం చేసుకున్నారు. ఒకరు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా.. మరొకరు ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగాలు సాధించారు. ఎంచుకున్న రంగాల్లో ముందుకు సాగుతామని ఈ యువ ఇంజినీర్స్ తెలిపారు.

# గాలికి ఊరట

**హైదరాబాద్, జూన్ 11 (జనంసాక్షి) :** ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో తెలంగాణ హైకోర్టు గాలి జనార్దన్‌రెడ్డితో పాటు నలుగురు నిందితులకు బెయిల్ మంజూరు చేసింది. గాలి జనార్దన్‌రెడ్డి, ఆయన పీఏ మెహఫజ్ అలీఖాన్, బీవీ శ్రీనివాస్‌రెడ్డి, మరియు వీడీ రాజగోపాల్‌లకు బెయిల్ లభించింది. నాంపల్లి సీబీఐ కోర్టు విధించిన ఏడేళ్ల జైలు శిక్షను హైకోర్టు సస్పెండ్ చేసింది. దేశం విడిచి వెళ్లకూడదని మరియు రూ.10 లక్షల సొంత పూచీకత్తు సమర్పించాలని షరతులు విధించింది. 15 సంవత్సరాల పాటు సాగిన ఈ కేసులో, మే 6న నాంపల్లి సీబీఐ కోర్టు తీర్పు వెలువరించింది. ప్రధాన నిందితులైన బీవీ శ్రీనివాస్‌రెడ్డి, గాలి జనార్దన్‌రెడ్డి, వీడీ రాజగోపాల్, మరియు మెహఫజ్ అలీఖాన్‌లకు ఒక్కొక్కరికి ఏడేళ్ల జైలు శిక్ష మరియు రూ.20 వేల జరిమానా విధించింది. ప్రభుత్వ ఉద్యోగి అయిన రాజగోపాల్‌కు అదనంగా 4 సంవత్సరాల జైలు శిక్ష మరియు రూ.2 వేల జరిమానా విధించారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ నిందితులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, తాజా తీర్పుతో వారికి ఊరట లభించింది. ఓఎంసీ కేసులో మరో నిందితురాలైన ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి పిటిషన్‌పై విచారణను హైకోర్టు జూన్ 19కి వాయిదా వేసింది. సీబీఐ కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది.

# తెలంగాణ గ్రూప్-1 నియామకాలపై స్టే కొనసాగుతుంది

**హైదరాబాద్, జూన్ 11 (జనంసాక్షి) :** తెలంగాణలో గ్రూప్-1 నియామకాలపై విధించిన స్టేను ఎత్తివేయాలని కోరుతూ దాఖలైన నాలుగు పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. టీజీపీఎస్సీ (తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్) తరఫు న్యాయవాది కౌంటర్ దాఖలు చేయడానికి సమయం కోరడంతో కోర్టు విచారణను జూన్ 30కి వాయిదా వేసింది. గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష కేంద్రాల కేటాయింపు, మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ గతంలో అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై గత నెలలో జరిగిన వాదనల సందర్భంగా, పిటిషనర్ల తరఫు న్యాయవాదులు పునర్‌మూల్యాంకనం లేదా మరోసారి మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని కోరారు.
అయితే, టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది, అభ్యర్థులు అపోహల్లో ఉన్నారని, నిపుణులతో పారదర్శకంగా మూల్యాంకనం జరిగిందని కోర్టుకు తెలిపారు. నియామకాలు ఆలస్యమైతే ఎంపికైన అభ్యర్థులు నష్టపోతారని వాదించారు. ఈ వాదనలను పరిగణించిన హైకోర్టు, గతంలో గ్రూప్-1 నియామకాలపై స్టే విధించింది, అయితే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పూర్తి చేయడానికి అనుమతించింది. స్టే ఎత్తివేయాలని కోరుతూ ఎంపికైన నలుగురు అభ్యర్థులు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ఈ రోజు వాదనలు జరిగాయి. టీజీపీఎస్సీ న్యాయవాది కౌంటర్ దాఖలు చేయడానికి సమయం కావాలని కోరడంతో, కోర్టు విచారణను జూన్ 30కి వాయిదా వేసింది. విచారణను ఆలస్యం చేయవద్దని, ఇది ఎంపికైన అభ్యర్థులకు ఇబ్బందికరంగా ఉంటుందని హైకోర్టు వ్యాఖ్యానించింది. టీజీపీఎస్సీ ఒకే వాదనలను పదేపదే పునరావృతం చేయవద్దని సూచించింది. జూన్ 30న పూర్తిస్థాయి వాదనలను వినిపించాలని నిర్దేశించింది.

# అన్ని అనుమతులతోనే కాళేశ్వరం నిర్మాణం

ఇంజనీర్లు నిర్ణయం తీసుకుంటారని, తాను ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని కేసీఆర్ తెలిపారు. స్థల ఎంపిక మరియు మార్పు సాంకేతిక అంశమని, నీటి లభ్యత ఆధారంగా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టినట్లు వెల్లడించారు. జీవో నంబర్ 45, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ బుక్‌తో పాటు ఇతర పత్రాలను కమిషన్‌కు సమర్పించారు. కాళేశ్వరం లైఫ్‌లైన్ పుస్తకంలో ప్రాజెక్టు ఉద్దేశాలను వివరించారు.
విచారణకు ముందు కేసీఆర్ దైవసాక్షిగా వాస్తవాలు చెప్పేందుకు ప్రమాణం చేశారు. సీడబ్ల్యూసీ తుమ్మిడి హట్టి వద్ద నీటి లభ్యత లేదని తెలపడం, వ్యాప్కోస్ సర్వే నివేదిక ఇవ్వడం, మహారాష్ట్ర అంగీకారం లేకపోవడం వల్ల స్థల మార్పు జరిగినట్లు కేసీఆర్ వివరించారు. టెక్నికల్ టీమ్ సిఫార్సు మేరకు మూడు బ్యారేజీలు నిర్మించినట్లు తెలిపారు. అన్ని నిర్ణయాలు కేబినెట్ ఆమోదంతోనే జరిగాయని ఆయన స్పష్టం చేశారు.
కేసీఆర్ ఆరోగ్యం సరిగా లేనందున ఓపెన్ కోర్టు విచారణను రద్దు చేసి, ఇండోర్‌లో ముఖాముఖిగా విచారణ జరిపారు. ఇప్పటివరకు కమిషన్ 114 మందిని విచారించగా, కేసీఆర్ 115వ సాక్షిగా హాజరయ్యారు. విచారణ అనంతరం కేసీఆర్ అభిమానులు, కార్యకర్తలకు అభివాదం చేస్తూ హరీశ్ రావుతో కలిసి బీఆర్కే భవనం నుంచి బయలుదేరారు.

# ఉగ్రవాదులకు చోటు లేకుంటే లాడెన్ ఎలా ఉన్నాడు

## పాక్‌కు విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రశ్న



**బ్రస్సెల్స్, జూన్ 11 (జనంసాక్షి) :** యూరోపియన్ యూనియన్ నేతలతో చర్చల కోసం విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ బ్రస్సెల్స్‌లో ఉన్నారు. ఈ పర్యటనలో పాకిస్తాన్ తీరును మరోసారి ఆయన ఎండగట్టారు. కాశ్మీర్‌లో ఉగ్రదాడి తర్వాత భారత్-పాకిస్తాన్ మధ్య ఘర్షణను ఉగ్రవాదంపై భారత్ తీసుకుంటున్న చర్యలుగా చూడాలని, కేవలం ఇరు దేశాల మధ్య సరిహద్దు సమస్యగా చూడొద్దని వెస్టర్న్ దేశాలకు పిలుపునిచ్చారు. యూరోపియన్ న్యూస్ వెబ్‌సైట్ యూరాక్టివ్‌తో మాట్లాడుతూ, యూరప్‌లో మారుతున్న భౌగోళిక రాజకీయాలు, భవిష్యత్తులో మెరుగైన ఈయూ-భారత్ సంబంధాలపై ఆయన మాట్లాడారు. రష్యా-చైనా మధ్య పెరుగుతున్న సంబంధాల మధ్య, భారత్ ఈయూ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం గురించి చర్చలు జరుగుతున్నాయి. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ కింద భారత్ తీసుకున్న చర్యలను రెండు అణ్వాయుధ దేశాల మధ్య సంఘర్షణగా వెస్టర్న్ మీడియా చిత్రీకరించడాన్ని విమర్శించారు. ఒసామా బిన్ లాడెన్ పాకిస్తాన్ సైనిక పట్టణంఅబోటాబాద్‌లో ఎలా సురక్షితంగా ఉన్నాడు..? అని ప్రశ్నించారు. ఇది కేవలం భారత్ పాకిస్తాన్ సమస్య కాదని, ఉగ్రవాదం గురించి అని, ఉగ్రవాదం చివరకు మిమ్మల్ని కూడా వెంటాడుతుందని హెచ్చరించారు. ఉక్రెయిన్ యుద్ధంలో పాశ్చాత్య దేశాలు విధించిన ఆంక్షలకు భారత్ ఎందుకు మద్దతు తెలపలేదని ప్రశ్నించిన నేపథ్యంలో.. భారత్ ఉక్రెయిన్, రష్యాలతో మంచి సంబంధాలు కలిగి ఉందని చెప్పారు. భారత్‌పై పాకిస్తాన్ దాడులు చేసిన సమయంలో వెస్టర్న్ దేశాలు పాకిస్తాన్‌కి మద్దతు తెలిపిన విషయాన్ని జైశంకర్ గుర్తు చేశారు. స్వాతంత్య్రం అనంతరం పాకిస్తాన్ జమ్మూ కాశ్మీర్‌లోకి ఆక్రమణదారుల్ని పంపిన సమయంలో ఈ వెస్టర్న్ దేశాలు పాకిస్తాన్‌కి మద్దతు తెలిపాయని అన్నారు.

# కుంభమేళాలో తొక్కిసలాట జరగలేదా..?

## యోగి రాజీనామా చేశారా..? : బెంగళూరు ఘటనపై ఖర్గే



**న్యూఢిల్లీ (జనం సాక్షి) :** ఆర్‌సీబీ విజయోత్సవ కార్యక్రమంలో జరిగిన తొక్కిసలాట ఘటన యావత్తు దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. గత బుధవారం చిన్నస్వామి స్టేడియం వెలుపల జరిగిన ఈ తొక్కిసలాటలో 11 మంది మరణించగా.. అనేక మంది గాయపడ్డారు. ఈ ఘటన నేపథ్యంలో అధికార కాంగ్రెస్‌పై బీజేపీ నేతలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘటన చోటు చేసుకుందంటూ ఆరోపిస్తున్నారు. ఈ మేరకు ఘటనకు బాధ్యత వహిస్తూ.. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, హోంమంత్రి జి పరమేశ్వర రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తొక్కిసలాట ఘటనపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తాజాగా స్పందించారు. ఇది కేవలం ప్రమాదమేనని, ఉద్దేశపూర్వకంగా జరిగింది కాదని పేర్కొన్నారు. ఇంతకు ముందు ఇలాంటి ఘటనలు అనేకం చోటుచేసుకున్నాయని చెప్పారు. 'కుంభమేళా సమయంలో జరిగిన తొక్కిసలాటకు ఎవరైనా రాజీనామా చేశారా..? అక్కడ లక్షలాది మంది పుణ్య స్నానాలు చేశారు. మృతదేహాలు తేలడం చూశాం. అంతేకాదు, కొవిడ్ సమయంలో కూడా చాలా మంది మరణించారు. వీటికి బాధ్యత వహిస్తూ యోగి (యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను ఉద్దేశిస్తూ) రాజీనామా చేశారా..?' అని ఖర్గే ప్రశ్నించారు. ఘటన ఉద్దేశపూర్వకంగా జరిగి ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. కానీ ఇది ప్రమాదవశాత్తూ జరిగిందని, ఈ ఘటనపై తమ నాయకులు ఇప్పటికే క్షమాపణలు కూడా చెప్పారని ఖర్గే చెప్పుకొచ్చారు. కాగా, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా ఇటీవలే ఇదే తరహా వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. 'ఇలాంటి ఘటనలు చాలా జరిగాయి. ఇంతకంటే దారుణమైనవి చోటుచేసుకున్నాయి. కుంభమేళాలోనూ తొక్కిసలాట జరిగింది. 50-60 మంది చనిపోయారు. నేను ఘటనను సమర్థించడం లేదు. జరిగిందంతే' అని మీడియా సమావేశంలో వ్యాఖ్యానించారు.

# ఎలాన్ మస్క్ పశ్చాత్తాపం

ట్రంప్ గురించి నేను చేసిన పోస్టులు చాలా దూరం వెళ్లాయి. అందుకు నేను చింతిస్తున్నాను," అని ఆయన పేర్కొన్నారు. ఈ పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది.
ట్రంప్ యంత్రాంగం తీసుకొచ్చిన 'బిగ్ బ్యూటిఫుల్ బిల్'ను మస్క్ వ్యతిరేకించడంతో ఇద్దరి మధ్య విభేదాలు మొదలయ్యాయి. ఈ బిల్లు విషయంలో మస్క్ ట్రంప్‌పై నేరుగా విమర్శలు గుప్పించారు. ట్రంప్‌ను అభిశంసించి, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌ను అధ్యక్షుడిగా చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాక, సెక్స్ కుంభకోణంలో నిందితుడైన జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ట్రంప్‌కు సంబంధాలున్నాయని, ఎప్‌స్టీన్ ఫైళ్లలో ట్రంప్ పేరు ఉందని, అందుకే ఆయన వాటిని బహిర్గతం చేయడం లేదని సంచలన ఆరోపణలు చేశారు.
మస్క్ తీరుతో విసిగిపోయానని ట్రంప్ వ్యాఖ్యానించారు. "మా బడ్జెట్‌లో బిలియన్ల డాలర్లు ఆదా చేయడానికి సులభమైన మార్గం ఎలాన్ మస్క్‌కు ఇచ్చిన ప్రభుత్వ సబ్సిడీలు, కాంట్రాక్టులను రద్దు చేయడమే," అని ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలతో టెస్లా షేర్లు 14.3% నష్టపోయి, 150 బిలియన్ డాలర్ల సంపద ఆవిరైంది, ఇది టెస్లా చరిత్రలో ఒకే రోజు అత్యధిక నష్టం. దీని తర్వాత, ట్రంప్‌ను అధ్యక్ష పదవి నుంచి అభిశంసించాలని మస్క్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.
'ద అమెరికా పార్టీ' ప్రారంభిస్తారా?
ట్రంప్, మస్క్ మధ్య విభేదాలు తీవ్రమవడంతో, మస్క్ కొత్త రాజకీయ పార్టీ 'ద అమెరికా పార్టీ' ప్రారంభించే అవకాశం ఉందని ప్రచారం జోరందుకుంది. ఈ విషయాన్ని మస్క్ ఎక్స్‌లో సూచనాత్మకంగా ప్రస్తావించారు. ఈ పార్టీ గురించి అభిప్రాయ సేకరణ కూడా సామాజిక మాధ్యమాల్లో నిర్వహించారు, దీంతో మస్క్ కొత్త పార్టీ పెట్టడం ఖాయమనే చర్చ ఊపందుకుంది.

# ఆపరేషన్ సింధూర్ దెబ్బ

డాలర్ల ఆస్తి నష్టం జరిగింది. ప్రకృతి విపత్తులు జీడీపీలో 18-20% నష్టాన్ని కలిగించే ప్రమాదం ఉందని ప్రపంచ బ్యాంక్ హెచ్చరించినప్పటికీ, పాక్ ప్రభుత్వం ఆయుధ కొనుగోళ్లకు ప్రాధాన్యత ఇచ్చింది. పెరిగిన బడ్జెట్‌తో, ఆపరేషన్ సింధూర్‌లో దెబ్బతిన్న టెర్రర్ క్యాంప్‌లను పునరుద్ధరించే అవకాశం ఉంది. అలాగే, ఈ ఏడాది ఆగస్టులో చైనా నుంచి 50% డిస్కౌంట్‌తో జే-35 స్టెల్త్ జెట్‌లను కొనుగోలు చేయనుంది. ఇందులో 400 కిలోమీటర్ల రేంజ్ ఉన్న పీఎల్-17 క్షిపణులు, టైప్ 039బీ జలాంతర్గామి, మరియు జిన్నా శ్రేణి ఫ్రిగెట్‌లు కూడా ఉన్నాయి.
పాక్ సైన్యం వ్యూహాత్మక మార్పులను ప్రారంభించింది, ముఖ్యంగా భారత దాడుల తర్వాత సైనిక సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ చర్యలు తీసుకుంటోంది. ఈ నిర్ణయాలు ఆ దేశ ఆర్థిక స్థితిని మరింత దిగజార్చే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# కాంగ్రెస్ లేకుంటే తెలంగాణ లేదు

- తెలంగాణ లేకుంటే కెసిఆర్ కుటుంబమే లేదు
- ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఘాటు విమర్శలు



**హైదరాబాద్, జూన్ 11 (జనంసాక్షి) :** అసలు కాంగ్రెస్ పార్టీ లేకపోతే కెసిఆర్ ఫ్యామిలీకి పుట్టుగతులు కూడా లేవని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఆరోపించారు. తెలంగాణ ఇచ్చిన సోనియాను అవమానించడమే గాకుండా రాష్ట్రాన్ని సొంత జాగీరులాగా వాడుకున్నారని మండిపడ్డారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆంకాంక్షను నెరవేరుస్తూ ఎన్నో ఆటుపోట్లను తట్టుకొని సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిందన్నారు. అసలు బిఆర్ఎస్ పార్టీకి భవిష్యత్‌ను ఇచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని ఆయన అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఇస్తే నాడు కాంగ్రెస్‌లో బిఆర్ఎస్‌ను విలీనం చేస్తామని చెప్పి దొంగ ప్రకటనలు చేశారని ఆయన ఆరోపించారు. లిక్కర్ స్కాంలో కవిత, ఫార్ములా ఈ రేసు కేసులో కెటిఆర్, కాళేశ్వరం ఉచ్చులో చిక్కుకొని కెసిఆర్ కొట్టు-మిట్టాడుతున్నాని ఆయన ఎద్దేవా చేశారు. కల్వకుంట్ల కుటు-ంబం పూర్తిగా అవినీతిమయం అయ్యిందని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ గురించి ఇష్టమొచ్చినట్లు-గా మాట్లాడితే ప్రజలు అంత ఆలోచన లేకుండా లేరని సరైన సమయంలో బిఆర్ఎస్ పార్టీకి బుద్ధి చెబుతారని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ హెచ్చరించారు.

# ఓయూలో పరిపాలనా పరమైన పదవుల నియామకం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఉస్మానియా యూనివర్సిటీలో పలు పరిపాలనపరమైన పదవుల నియామకం చేపట్టారు. ఈ మేరకు ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ నియామక పత్రాలు అందజేశారు. ఉస్మానియా యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అకాడమిక్ ఆడిట్ డైరెక్టర్‌గా మ్యాథమేటిక్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఎన్.కిషన్, పీజీఆర్ఆర్ సీడీఈ డైరెక్టర్‌గా స్టాటిస్టిక్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ భట్టాచార్యులు, సెంట్రల్ ఫెసిలిటీస్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (సీఎఫ్ఆర్డీ) డైరెక్టర్, ఓయూ అలుమ్నీ అసోసియేషన్ స్పెషల్ ఆఫీసర్ గా బోటనీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ సుజాత, బషీర్‌బాగ్ పీజీ లా కళాశాల ప్రిన్సిపల్‌గా లా విభాగానికి చెందిన డాక్టర్ అపర్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారిని పలువురు అధికారులు, అధ్యాపకులు అభినందించారు.

# మోదీ ఇచ్చిన హామీల పరిష్కారానికి డేట్ చెప్పాలి

## తమ్మినేని వీరభద్రం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఆపరేషన్ కగార్ పేరుతో చేస్తున్న హత్యాకాండను తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆపరేషన్ కగార్ నిలిపివేయాలంటూ శాంతిచర్చల కమిటీ హైదరాబాద్ మీడియా సమావేశం నిర్వహించింది. కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ... దేశంలో పేదరికాన్ని తొలగిస్తే వామపక్ష ఉగ్రవాదం ఉండదన్నారు. "మావోయిస్టులను 2026 మార్చి 31 నాటికి అంతం చేస్తామని ప్రకటిస్తున్నారు. నరేంద్రమోదీ ఇచ్చిన హామీల పరిష్కారానికి డేట్ చెప్పాలి. శాంతి చర్చల కమిటీ 17న చేపట్టే మహాధర్నాను పార్టీలకు అతీతంగా విజయవంతం చేయాలి" అని కోరారు.

# కాళేశ్వరం పత్రాలను బయటపెడతా..

రాష్ట్ర ప్రాజెక్టులపై చర్చలకు ఎప్పుడైనా సిద్ధమని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీకి తెలంగాణ ప్రాజెక్టులపై కిషన్ రెడ్డి ఎప్పుడైనా నివేదిక ఇచ్చారా లేదా ఒక్క ప్రాజెక్టు కోసం డిమాండ్ చేశారా అని నిలదీశారు. నిర్మలా సీతారామన్ చెన్నైకి, ప్రహ్లాద్ జోషి కర్ణాటకకు మెట్రో ప్రాజెక్టులు తీసుకెళ్లగా, కిషన్ రెడ్డి తెలంగాణ కోసం ఏమీ చేయలేదని విమర్శించారు.
కొత్త మంత్రులకు శాఖల కేటాయింపుపై సీఎం స్పష్టత ఇచ్చారు. తన వద్ద ఉన్న శాఖలను కొత్త మంత్రులకు అప్పగిస్తానని, కేసీఆర్ హయాంలో నెలల తరబడి మంత్రి పదవులు, శాఖలు కేటాయించకపోగా, తాను రెండు-మూడు రోజుల్లోనే శాఖలను కేటాయించినట్లు తెలిపారు. కులగణన సందర్భంగా కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు, కిషన్ రెడ్డి నివాసాలకు ప్రత్యేకంగా వెళ్లి వివరాలు సేకరించాలని హైదరాబాద్ కలెక్టర్‌కు సూచించినట్లు చెప్పారు. వీరు కులగణన సర్వేలో వివరాలు పంచుకోలేదని ఆరోపించారు.
మంత్రివర్గ విస్తరణలో సామాజిక న్యాయం పాటించామని, 55% పదవులను ఇప్పటికే కేటాయించామని రేవంత్ పేర్కొన్నారు. నక్సలిజం సామాజిక అసమానతలు ఉన్నంత వరకు కొనసాగుతుందని, దానికి అంతం లేదని అభిప్రాయపడ్డారు.

# కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు

వాకాటి శ్రీహరి (మక్తల్), అడ్లూరి లక్ష్మణ్ (ధర్మపురి) మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే వారికి శాఖలు కేటాయించలేదు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే ఢిల్లీ పర్యటనలో భాగంగా మంత్రులకు శాఖ కేటాయింపుపై పార్టీ అధిష్టానంతో చర్చించారు. అలాగే రేవంత్ రెడ్డి కేబినెట్‌లోని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సైతం మంగళవారం న్యూఢిల్లీ వెళ్లారు. ఈ పర్యటనలో భాగంగా మంత్రి పదవుల కేటాయింపుపై పార్టీ అగ్రనేతలతో ఉత్తమ్ సైతం చర్చించినట్లు తెలుస్తుంది. అనంతరం కొత్త మంత్రుల శాఖల కేటాయింపు అంశం ఒక కొలిక్కి వచ్చినట్లు సమాచారం. హెలికాప్టర్ల సాయం కూడా తీసుకుంటామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఎన్‌టీఆర్ఐ నిపుణులు, ప్రొఫెసర్ తివారీ, ధన్బాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్ సహకారంతో జులై 12 నుంచి సర్వే ప్రారంభించి వారంలో పూర్తి చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.
44 కి.మీ. ఎస్ఎల్బీసీ సొరంగం నిర్మాణం గాలి చొరబడని విధంగా జరిగినప్పటికీ, ఇరుక్కుపోయిన టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం) తొలగించడం సాధ్యం కానందున, పక్క నుంచి కొత్త సొరంగం తవ్వకం చేపడతామని మంత్రి పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి సీతారామ, దేవాదుల వంటి పెండింగ్ ప్రాజెక్టులను కూడా వేగంగా పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# కాళేశ్వరం ద్వారా తెలంగాణకు శాశ్వత పరిష్కారం

అర్థం చేసుకోలేరని, వంద జన్మలు ఎత్తినా కేసీఆర్ సాధించిన విజయాల్లో స్వల్ప భాగాన్ని కూడా సాధించలేరని కేటీఆర్ విమర్శించారు.
సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి కేసీఆర్ వెంట్రుకను కూడా పీకలేడని, కేసీఆర్ విచారణకు హాజరైన సందర్భంగా బీఆర్‌కే భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆయన ఘాటుగా విమర్శించారు. కేసీఆర్ ఒక చరిత్ర అని, ఇరిగేషన్ విషయంలో ఆయనకు సమకాలీన రాజకీయ నాయకుల్లో ఎవరికీ లేనంత అవగాహన ఉందని కొనియాడారు. కేసీఆర్‌ను విచారణకు పిలవడం హనుమంతుడి ముందు కుప్పిగంతులు వేయడం లాంటిదని పేర్కొన్నారు.
కేసీఆర్ తెలంగాణను సాధించి, సస్యశ్యామలం చేసిన నాయకుడిగా చరిత్రలో నిలిచిపోతారని, గత ప్రభుత్వాలు 60 ఏళ్లలో చేయలేని కార్యక్రమాలను విజయవంతంగా సాధించారని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ ఉద్యమం ద్వారా కోట్లాది మంది ప్రజల ఆకాంక్షలను నెరవేర్చారని, ప్రజాస్వామ్య పోరాటంతో రాష్ట్రాన్ని సాధించిన నాయకుడిగా కేసీఆర్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడతారని ఆయన అన్నారు.
రేవంత్ రెడ్డిని తీవ్రంగా విమర్శిస్తూ, ఆయన కూల్చివేయడానికి వచ్చాడే తప్ప, నిర్మించడానికి కాదని కేటీఆర్ ఆరోపించారు. పేదల ఇళ్లు, ప్రాజెక్టులను కూల్చడం, రాజకీయ వేధింపులు, కక్ష సాధింపులు తప్ప రేవంత్‌కు ఏమీ చేతకాదని విమర్శించారు. రేవంత్ రెడ్డి వంటి "చిల్లర నాయకుడు" కేసీఆర్ గొప్పతనాన్ని ఎప్పటికీ అర్థం చేసుకోలేడని, కాంగ్రెస్‌ను బొంద పెట్టే వరకు వెంటాడతామని కేటీఆర్ హెచ్చరించారు.
రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు, 420 హామీలపై నిలదీయాలని, ప్రజాక్షేత్రంలో రేవంత్‌ను నిలబెట్టే రోజు వస్తుందని ఆయన అన్నారు. కేబినెట్ ఎలా పనిచేస్తుందో రేవంత్‌కు తెలియదని, రైతుల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలు ఆయనకు ముఖ్యమని విమర్శించారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ వంటి డ్రామాలతో రేవంత్ రాక్షసానందం పొందుతున్నాడని, కానీ నిజం త్వరలో బయటపడుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణను సస్యశ్యామలం చేసిన కాళేశ్వరం ప్రాజెక్టును అర్థం చేసుకోవడానికి రేవంత్ తెలివి సరిపోదని, కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సాధించబడిందని, ఆయన ఖ్యాతి ఎప్పటికీ తగ్గదని కేటీఆర్ స్పష్టం చేశారు. "జై కేసీఆర్, జై తెలంగాణ" అని నినదిస్తూ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేటీఆర్ మాట్లాడారు.

# ఎంతటి వారున్నా వదిలిపెట్టం



గత బీఆర్ఎస్ ప్రభుత్వం పై విమర్శలు గుప్పించారు. ఈ పథకాలను ప్రజా సంక్షేమం కోసం కాకుండా, తమ రాజకీయ వ్యవస్థను బలోపేతం చేసుకోవడానికి ఉపయోగించుకున్నారని ఆయన ఆరోపించారు.
పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, కాళేశ్వరం వంటి ప్రాజెక్టులు ప్రజలకు ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో కాకుండా, ఆర్థిక అవకతవకలకు వేదికగా మారాయని విమర్శించారు. ధరణి పోర్టల్ ద్వారా భూ రికార్డులలో అవకతవకలు జరిగాయని, మిషన్ భగీరథ పథకంలో కూడా అవినీతి జరిగిందని ఆయన ఆరోపించారు. ఈ పథకాలన్నీ బీఆర్ఎస్ పార్టీ యొక్క రాజకీయ ఆధిపత్యాన్ని కొనసాగించడానికి మరియు వారి వ్యవస్థను బలోపేతం చేయడానికి ఉపయోగపడ్డాయని ఆయన ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలోని నాయకులు తమను తాము జాతిపితగా ప్రకటించుకున్నప్పటికీ, వారు కూడా చట్టం ముందు సమానమేనని స్పష్టం చేశారు. "ఎంతటి వారైనా, తప్పు చేస్తే చర్యలు తప్పవు. దర్యాప్తు సంస్థల ముందు విచారణకు హాజరవుతున్నారు, ఇది చట్టం యొక్క బలాన్ని చూపిస్తుంది," అని ఆయన హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో సంబంధం ఉన్న అవినీతి ఆరోపణలపై జరుగుతున్న విచారణను పరోక్షంగా ప్రస్తావిస్తూ, న్యాయం అందరికీ సమానంగా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, గత ప్రభుత్వం యొక్క తప్పిదాలను సరిదిద్దడం మరియు పారదర్శకమైన పాలనను అందించడం తమ లక్ష్యమని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో జరుగుతున్న విచారణలు నిజాలను వెలికితీస్తాయని, అవినీతిలో పాల్గొన్న వారిని చట్టం ముందు నిలబెట్టడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా, రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం పై నమ్మకం ఉంచాలని, ప్రజా సంక్షేమం కోసం తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మహోద్యమంలా వనమహోత్సవం!

**రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**

**పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణతో పాటు వన మహోత్సవం 2025 పోస్టరు ఆవిష్కరించిన మంత్రి**



**హైదరాబాద్, జూన్ 11 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టదలిచిన వనమహోత్సవం కార్యక్రమాన్ని ఫారెస్టు డిపార్టుమెంటు అధికారులు మహోద్యమంలా తీసుకొని ముందుకు వెళ్ళాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ చెప్పారు. వృక్షో రక్షిత రక్షితః నినాదాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన అవసరం ఉందని ఆమె పునరుద్ఘాటించారు. వనమహోత్సవం-2025 పోస్టరు బుధవారం జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో ఆవిష్కరించారు. పోస్టరు ఆవిష్కరణలో తెలంగాణ అటవీ ప్రధాన సంరక్షిణాధికారిణి డాక్టర్ సువర్ణ, సీసీఎఫ్ ప్రియాంక వర్గీస్, సోషల్ ఫారెస్టు రామలింగం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ... ఈ ఏడాది తలపెట్టబోయే వనమహోత్సవ కార్యక్రమం వంద శాతం విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. అన్నివర్గాల వారు ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. నాటిన ప్రతీ మొక్కను బతికించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. నాటిన మొక్కలకు నీటి సదుపాయం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పండ్ల మొక్కలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జిల్లాల్లో జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్ళాలని సూచించారు. 2024 సంవత్సరం డిపార్టుమెంటువారీగా, డిస్టిక్ వారీగా రాష్ట్రవ్యాప్తంగా 20.02 కోట్ల మొక్కలు నాటాలని ప్రణాళికలు వేసుకోగా... 19.04 కోట్లు నాటినట్టు మంత్రి సురేఖ గుర్తు చేశారు. 95 శాతం మేరకు అంచనాలు రీచ్ అయినట్టు వెల్లడించారు. ఈ సారి 100 శాతం మనం పెట్టుకున్న టార్గెట్ రీచ్ కావాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి గ్రామంలో వన నర్సరీల ద్వారా మొక్కలు పెంచి అదే గ్రామంలో నాటించడానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు. గతంలో ఎదురైన అనుభవాలు, తప్పిదాలు పునరావృత్తం కాకుండా అవసరమైన జాగ్రత్తలను అధికారులు తీసుకోవాలన్నారు. ప్రతీ ఇంటికి మొక్కలు ఇచ్చి నాటేందుకు ప్రోత్సహించాలని చెప్పారు. ప్రజలు అడిగిన మొక్కలను అందజేయడానికి అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ఇండ్లలో ప్రధానంగా పెంచే గులాబీ, మందార, సీతాఫలం, జామ, ఉసిరి, అల్ల నేరేడు, మునగ, కానుగ, తులసి, ఈత మొక్కలతో పాటు పలు ఔషద మొక్కలు, పూల మొక్కలను సిద్ధం చేయాలని ఆదేశించారు. పూల మొక్కలను ప్రభుత్వ స్థలాలు, రహదారులకు ఇరువైపులా, పొలం, చెరువు గట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు, కమ్యూనిటీ కేంద్రాలు, వైద్య శాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ఆవరణల్లో నాటేందుకు ప్రణాళిక రూపొందించాలని మంత్రి సురేఖ ఆదేశించారు. గతం కంటే ఈసారి మాన్ సూన్ ముందే వచ్చిందని... ఈ నేపథ్యంలో అందరూ సన్నద్ధంగా ఉండాలన్నారు. ఏ ఏరియాలో ఎటువంటి చెట్లు నాటాలో గుర్తించి ఆ విధంగా ముందుకు వెళ్ళాలని మంత్రి సూచించారు. ఈ దఫా వనమహోత్సవంలో ఈత, తాటి, వేప, చింత, కుంకుడు మొక్కలు నాటించాలన్నారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటిన వారికి గుర్తించి ప్రోత్సాహకాలు ఇవ్వాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. మొక్కల పెంపకంలో ప్రత్యేకంగా కృషి చేసిన వారికి పలు విధాలుగా గుర్తింపు ఇవ్వాలని అటవీ శాఖ ఉన్నతాధికారులకు చెప్పారు.

# గిరిజన జాతి మరింత జాగృతం కావాలి

**గిరిజన పుస్తకావిష్కరణలో కోదండరామ్**




**హైదరాబాద్, జూన్11 (జనంసాక్షి) :** గిరిజన జాతి మరింత జాగృతం కావాలని ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. 1961లో నాటి జనాభా గణన సందర్భంగా రిజిస్ట్రార్ ఆఫ్ ఇండియా ప్రచురించిన పుస్తకాన్ని తెలుగులో ప్రొఫెసర్ జాటోత్ రాజారాం, ఆంగ్లంలో ముదావత్ రామునాయక్ అనువదించారు. '1961లో బంజారా గిరిజనుల జీవనం' పుస్తకాన్ని బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ప్రొఫెసర్ ఎం.కోదండరాం ఆవిష్కరించి మాట్లాడారు. గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వ విధానాల రూపకల్పనకు 1961లో బంజారా గిరిజనుల జీవనం పుస్తకం ఎంతో దోహదపడుతుందన్నారు. బంజారాల జీవితాన్ని ప్రతిబింబించే ఆనాటి గిరిజనుల జీవన స్థితిగతులపై రూపొందించిన ఆంగ్ల మోనోగ్రాఫ్ ను నేటితరాలకు ఉపయోగపడేలా తెలుగులో అనువదించడం అభినందనీయ మన్నారు. గిరిజన జాతి జాగృతం కోసం ఇలాంటి పుస్తకాలు మరెన్నో రావాల్సిన అవసరం ఉందన్నారు. పుస్తక ప్రతులను ప్రభుత్వ అధికారులకు అందజేయాలని, అప్పుడు బంజారా గిరిజనుల జీవనం, వారి సంస్కృతి, సంప్రదాయాలు అందరికీ తెలుస్తాయని అన్నారు. కార్యక్రమానికి తెలంగాణ విద్యావంతుల వేదిక ప్రతినిధి డి.ఎస్.ఎస్.ఆర్. కృష్ణ అధ్యక్షత వహించగా తెలంగాణ రాష్ట్ర సేవాలాల్ సేన అధ్యక్షుడు అంగోత్ రాంబాబునాయక్, ప్రేమ్‌చంద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రాజగోపాల్ రెడ్డి అభిమానుల ఆందోళన

**మంత్రి పదవి రాకపోవడంపై నిరసనలు**

**పదవులకన్నా ప్రజలే ముఖ్యమన్న రాజగోపాల్**



**నల్గొండ, జూన్11 (జనంసాక్షి) :** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి రాకపోవడంతో ఆయన అభిమానులు ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ తీరుపై మండిపడ్డారు. కావాలనే పదవి రాకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ క్రమంలో చండూరులో ఇద్దరు యువకులు వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకుంటే.. తాము వాటర్ ట్యాంక్‌పై నుంచి దూకేస్తామంటూ వారు బెదిరించారు. దీంతో స్థానికులు వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వాటర్ ట్యాంక్ వద్దకు చేరుకుని.. వారిని కిందకు దింపేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు తనకు మంత్రి పదవి రాకపోవడంపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన ఎక్స్ ఖాతా వేదికగా బుధవారం స్పందించారు. కొత్తగా మంత్రి పదవులు పొందిన ఎమ్మెల్యేలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఇంతకీ ఆయన ఏమన్నారంటే.. తెలంగాణ కేబినెట్‌లో నూతనంగా నియమితులైన మంత్రులను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. ప్రజలకు సేవ చేయడంలో వారికి సంపూర్ణ విజయం కోరుకుంటున్నాను. నాకు రాజకీయాలు అంటే పదవులు గానీ, అధికారాలు గానీ కాదు. ప్రజల పట్ల నా నిబద్ధత, తెలంగాణ పునర్నిర్మాణం పట్ల నా కలలే నాకు ప్రేరణగా నిలిచాయి. అదే కారణంగా నేనే తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చాను. ఈ రోజు నేను మంత్రిగా లేక పోయినా, పార్టీని బలపరిచే ప్రయత్నాల్లో, ప్రజల మద్దతుతో ముందుకు సాగుతాను. ప్రజల సమస్యలు వినడంలో, వారి హక్కుల కోసం పోరాడడంలో, వారి గొంతుకను ప్రభుత్వం వరకు తీసుకెళ్లడంలో నేను ఎప్పటికీ ముందుంటాను. నా రాజకీయ ప్రయాణం ఇక్కడితో ఆగదు. కొన్నిసార్లు, పదవి లేకుండానే ప్రజల మధ్య పని చేసే అవకాశం ఎంతో శక్తివంతంగా మారుతుంది. అదే మార్గాన్ని నేను ఎంచుకున్నానన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. తన కేబినెట్‌ను ఇటీవల పునర్వ్యవస్థీకరించారు. ఈ నేపథ్యంలో ముగ్గురు కొత్త వారికి ఆ కేబినెట్‌లో చోటు కల్పించారు. అయితే ఈ కేబినెట్‌లో తమకు చోటు దక్కుతోందంటూ పలువురు సీనియర్ ఎమ్మెల్యేలు ఆశించారు. కానీ వారికి చోటు దక్కలేదు. ఈ నేపథ్యంలో వారంతా తీవ్ర నిరాశ చెందారు. ఆ క్రమంలో తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్‌తోపాటు- మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు.. సదరు ఆశావాహుల ఇళ్లకు వెళ్లి బుజ్జగించిన సంగతి తెలిసిందే. ఇక ఈ జాబితాలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సైతం ఉన్నారు. ఆయన కూడా తీవ్ర నిరాశకు గురయ్యారు. ఆయన్ని సైతం పార్టీ పెద్దలు బుజ్జగించినట్లు- సమాచారం. అదీకాక రేవంత్ రెడ్డి కేబినెట్‌లో పలువురు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారు. ఈ నేపథ్యంలో సామాజిక వర్గాల సమీకరణాల దృష్ట్యా వివిధ వర్గాల వారికి ఈ కేబినెట్‌లో చోటు- కల్పించాలని పార్టీ అధిష్టానం నిర్ణయించింది. అందులోభాగంగా వివిధ సామాజిక వర్గాలకు చెందిన ముగ్గురికి కేబినెట్‌లో చోటు కల్పించింది. ఇంకోవైపు రేవంత్ రెడ్డి కేబినెట్‌లో మరో మూడు మంత్రి పదవులను భర్తీ చేయాల్సి ఉంది. వాటిని భవిష్యత్తులో భర్తీ చేసే అవకాశముందని పార్టీ వర్గాల్లో ఒక చర్చ అయితే నడుస్తోంది.

# 'ఇథనాల్' కంపెనీలకు బీజేపీ వ్యతిరేకం

**ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ రద్దు చేయొచ్చు కదా..?**

**బీజేపీ మాజీ ఎమ్మెల్సీ రామచంద్ర రావు వెల్లడి**

**ప్రజల అభిప్రాయం తర్వాతనే కార్యకలాపాలు సాగాలని వ్యాఖ్య**




**గద్వాల నడిగడ్డ, జూన్ 11 (జనంసాక్షి) :** ఇథనాల్ ఫ్యాక్టరీలను మేము కూడా వ్యతిరేకిస్తున్నామని, రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ మాత్రం రద్దు చేయకుండా నాటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై అభాండాలు వేస్తూ చేతులు దులిపేసుకుంటున్నదని బీజేపీ మాజీ ఎమ్మెల్సీ రామచంద్ర రావు అన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీకి తాము వందకు వందశాతం వ్యతిరేకమని వెల్లడిరచారు. జోగులాంబ గద్వాల జిల్లా డీకే అరుణ బంగ్లాలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ రామచంద్రరావు.. మోడీ 11 ఏళ్ల పాలనలో దేశాభివృద్ధి గురించి వివరించారు. ఈ క్రమంలో రాజోలి మండలం పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీకి అనుమతులు బీజేపీ ప్రభుత్వమే ఇచ్చింది కదా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన స్పందించారు. దాని విషయం తనకు తెలియదని, అక్కడ పబ్లిక్ హియరింగ్ జరగాలని అన్నారు. అది కలెక్టర్ ద్వారా జరుగుతుందని, ఆ నివేదిక వచ్చిన తర్వాతనే మిగతావి ఉంటాయని చెప్పారు. అదేవిధంగా బిజెపి గద్వాల జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఇక్కడున్న కాంగ్రెస్ ప్రభుత్వం నెడుతోందని, ఫ్యాక్టరీ యాజమానులతో కుమ్మక్కై బీజేపీ మీద ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.

**దేశంలో అవినీతి రహిత పాలన**

బీజేపీ ప్రభుత్వం 11ఏళ్ల పాలనలో ఎలాంటి అవినీతి జరగకుండా అవినీతి రహిత పాలన అందిస్తూ దేశాభివృద్ధికి కోసం నరేంద్ర మోడీ ప్రభుత్వం పని చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ రామచంద్ర రావు అన్నారు. 2004నుంచి 2014 వరకు దేశంలో స్కామ్‌లు పెద్ద ఎత్తున జరిగాయని, బీజేపీ ప్రభుత్వం లో ఎలాంటి అవినీతి జరగలేదని అన్నారు. గ్రామీణ ప్రాంతాలకూ 99శాతం రోడ్డు పనులు జరిగాయని, తెలంగాణ రాష్ట్ర ప్రజలు దేశంలో రాష్ట్రంలో మోడీ ప్రభుత్వం కోరుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, బిజెపి జిల్లా ఇంచార్జి డికె స్నిగ్ధా రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే, మాజీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రరెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ బండల వెంకట రాములు,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంఎస్ రెడ్డి, గద్వాల పోటీ చేసిన అభ్యర్థి బలిగేర శివా రెడ్డి, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ, బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు మిర్జాపురం వెంకటేశ్వర రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దేవా దాస్ తదితరులు ఉన్నారు.

# కారును ఢీకొన్న బస్సు

**ముగ్గురు వ్యక్తుల మృతి**



**రంగారెడ్డి, జూన్11 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని మాల్ వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. నాగార్జునసాగర్ రహదారిపై కారును బస్సు ఢీకొట్టిన ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతులను మహబూబ్‌నగర్‌కు చెందిన సాయితేజ, పవన్, రాఘవేంద్రగా గుర్తించారు. వీరంతా ఉద్యోగాలు చేస్తూ హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. మంగళవారం ఏడుగురు స్నేహితులు నాగార్జునసాగర్ పరిధిలోని వైజాగ్ కాలనీకి విహారానికి వెళ్లారు. అర్ధరాత్రి తిరుగు ప్రయాణంలో మాల్ వద్ద వీరి కారును బస్సు ఢీకొంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గిరిజనులకు ఆంక్షలు లేకుండా రుణాలు మంజూరు చేయండి

**బ్యాంక్ అధికారులను ఆదేశించిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్**



**మహబూబాబాద్ ప్రతినిధి, జూన్ 11 (జనం సాక్షి):** మహబూబాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా గూడూరు మండలంలోని యూనియన్ బ్యాంక్ ను సందర్శించి ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు అందాల్సిన బ్యాంకు రుణాలను అందుతున్నాయా ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన ప్రజలు లావాదేవీల మీద ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బ్యాంక్ అధికారులతో సమావేశమైన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు నాయక్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో నివాసముంటున్న పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు ప్రభుత్వ బ్యాంకుల ఆర్థికపరమైన సదుపాయాలను కల్పించాలని పేద గిరిజన బడుగు బలహీన వర్గాల ప్రజలను ఆర్థికంగా ఆదుకొని వారిని ఆర్థిక స్థితి నుండి మెరుగుపడే విధంగా బ్యాంకు అధికారులు కృషి చేయాలని వారు అన్నారు గతంలో మంజూరై పెండింగ్ లో ఉన్న ఎస్టీ కార్పొరేషన్ లోన్లను త్వరిత గతన మంజూరు చేయాలని ఎలాంటి ఆంక్షలు లేకుండా గిరిజన రైతులకు 10 లక్షల వరకు రుణాలు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించరు ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్రవికుమార్ డిప్యూటీ మేనేజర్ మయూర్ దత్తే మనోజ్ నవీన్ మాజీ ఎంపీపీ చెల్పూరి వెంకన్న ఎంపిటిసి మౌనిక శ్రీనివాస్ రజిత సోము నాయక్ మాజీ సర్పంచ్ మోతిలాల్ రాంబాబు నాయక్ కృష్ణా నాయక్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు

# యశోదాలో పల్లాకు కెసిఆర్ పరామర్శ



**హైదరాబాద్, జూన్11 (జనంసాక్షి) :** ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పరామర్శించారు. కాలు జారి కిందపడటంతో గాయపడి సోమాజీగూడ యశోద ఆసుపత్రిలో పల్లా చికిత్స పొందుతున్నారు. భారాస నేతలతో కలిసి యశోద ఆసుపత్రికి వెళ్లిన కేసీఆర్.. పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కేసీఆర్‌తో పాటు- మాజీ మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, పలువురు భారాస నేతలు పల్లాను పరామర్శించిన వారిలో ఉన్నారు. కాళేశ్వరం కమిషన్ విచారణ ముగిసిన తర్వాత కేసీఆర్ నేరుగా యశోదా ఆస్పత్రికి బయలుదేరి వెళ్లారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కేసీఆర్ పరామర్శించారు. కేసీఆర్ కాళేశ్వరం విచారణ సందర్భంగా పల్లా రాజేశ్వర్ రెడ్డి సిద్దిపేటలోని ఫాంహౌస్‌కు వెళ్లారు. అయితే అక్కడ ప్రమాదవశాత్తు ఎమ్మెల్యే జారి పడ్డారు. ఈ క్రమంలో ఆయన తుంటి ఎముకలో గాయమైంది. వెంటనే ఆయనను హుటాహుటిన అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని యశోదా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో పల్లా రాజేశ్వర్ రెడ్డి చికిత్స పొందుతున్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసుకోవాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య...**

**భీమదేవరపల్లి, జూన్ 11(జనం సాక్షి) :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. బుధవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారు కనక లక్ష్మీ అనే మహిళతో కలెక్టర్ మాట్లాడారు.ఇంటి నిర్మాణానికి సంబంధించి మెటీరియల్ను ఎక్కడినుండి తీసుకువస్తున్నారు, ఎంత ఖర్చయిందని, మహిళా సంఘంలో ఉన్నారా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘంలో తీసుకున్న డబ్బులతో ఇంటి నిర్మాణ సామగ్రిని తెచ్చుకున్నట్లు లబ్ధిదారు కలెక్టర్కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణ పనులను వేగవంతంగా చేసుకోవాలన్నారు. ఇంటి నిర్మాణానికి దశలవారీగా బిల్లులు వస్తాయి కాబట్టి త్వరగా నిర్మించుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో మండలంలో ప్రైస్ కమిటీ ఉండాలని, మేస్త్రీలతో సమావేశం నిర్వహించాలని ఎంపీడీవోకు సూచించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు సిద్ధార్థ నాయక్,రవీందర్, తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం, స్థానిక కార్యదర్శి పూర్ణచందర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఉపసర్పంచ్ కొలుగూరి రాజు, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు జక్కుల అనిల్,గజ్జల సురేష్, తదితరులు పాల్గొన్నారు.



# రఘువంశీ హత్యను అంగీకరించిన సోనమ్

**మా సోదరిని ఉరి తీయండన్న సోదరుడు**

**రఘువంశీ కుటుంబాన్ని క్షమాపణలు కోరిన గోవింద్**

**ఇండోర్, జూన్11 (జనంసాక్షి) :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మేఘాలయ హనీమూన్ హత్య కేసు దాదాపు ఓ కొలిక్కి వచ్చింది. తన భర్త రాజా రఘువంశీని తానే హత్య చేయించానని సోనమ్ అంగీకరించినట్టు సమాచారం. తన భర్త హత్యలో తన ప్రమేయం ఉన్నట్టు సోనమ్ అంగీకరించిందని సిట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో సోనమ్ సోదరుడు గోవింద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. తన సోదరే ఈ హత్య చేసినట్టు తాను నమ్ముతున్నానని, ఆమెను ఉరి తీయాలని గోవింద్ వ్యాఖ్యానించాడు. రాజా రఘువంశీ కుటుంబ సభ్యులను కలుసుకున్న గోవింద్ వారిని ఓదార్చాడు. వారికి క్షమాపణలు తెలియజేశాడు. ఈ కేసుకు సంబంధించిన ఆధారాలను చూస్తుంటే రాజా రఘువంశీ హత్యలో తన సోదరి ప్రమేయం ఉన్నట్టు అర్థమవుతోందని, ఆమెతో తమ కుటుంబం సంబంధాలు తెంచుకుందని గోవింద్ అన్నాడు. ఈ కేసులో నిందితులుగా ఉన్న వాళ్లందరూ సోనమ్ స్నేహితుడు రాజ్ కుశ్వాహాకు తెలిసిన వాళ్లే అని గోవింద్ ధ్రువీకరించాడు. ఈ కేసులో దోషిగా తేలితే తమ సోదరిని ఉరి తీయాలని గోవింద్ అన్నాడు.



కాగా, రాజా రఘువంశీ కేసులో నిందితులందరినీ పోలీసులు బుధవారం షిల్లాంగ్ తీసుకెళ్లారు. అక్కడ సిట్ బృందం వీరిని విచారించింది. వారి ఎదుట సోనమ్ తన నేరాన్ని అంగీకరించినట్టు సమాచారం. దీంతో మెజిస్ట్రేట్ ఎదుట సోనమ్ వాంగ్మూలాన్ని రికార్డు చేయాలని, దానిని వీడియో టేప్ చేయాలని పోలీసులు భావిస్తున్నారు. సోనమ్ వాంగ్మూలం ఆధారంగా ఈ కేసు దాదాపు కొలిక్కివచ్చేలాగ కనిపిస్తోంది. మేఘాలయ పోలీసులు కేసులో ప్రధాన నిందితురాలైన రాజా రఘువంశీ భార్య సోనమ్‌ను ఉత్తరప్రదేశ్ నుంచి, రఘువంశీపై దాడిచేసి హతమార్చిన కిరాయి హంతకులను మధ్యప్రదేశ్ నుంచి ట్రాన్సిట్ రిమాండ్‌పై షిల్లాంగ్‌కు తీసుకొచ్చి సదార్ పోలీస్ స్టేషన్‌లో విచారిస్తున్నారు. ఈ విచారణ సందర్భంగా తన భర్త రాజా రఘువంశీని తానే హత్య చేయించినట్లు విచారణ సందర్భంగా మేఘాలయా పోలీసులు ఎదుట సోనమ్ ఒప్పుకున్నట్లు తెలిసింది. దీంతో ఆమె వాంగ్మూలాన్ని మెజిస్ట్రేట్ ఎదుట రికార్డ్ చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. కాగా, మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌కు చెందిన రాజా రఘువంశీ, సోనమ్ రఘువంశీ మే 11న వివాహం చేసుకున్నారు. మే 20న మేఘాలయకు హనీమూన్‌కు వెళ్లారు. ఈ క్రమంలో మే 23 నుంచి ఆ జంట ఆచూకీ లేకుండా పోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు జూన్ 2న ఉత్తర కాసీ కొండల్లోని లోతైన లోయలో రాజా రఘువంశీ మృతదేహం కనిపించింది. మిస్సింగ్ కేసును హత్య కేసుగా మార్చి దర్యాప్తు చేస్తున్న పోలీసులు నిందితుల నుంచి పలు వివరాలు రాబడుతున్నారు.

## బలైపోతున్న బాల కార్మికులకు
# ఆసరా ఏది?

2021లో విడుదలైన తాజా అంచనాల ప్రకారం, 5 నుండి 17 సంవత్సరాల మధ్య వయస్సు గల 160 మిలియన్ల మంది బాలురు మరియు బాలికలు బాల కార్మికులలో ఉన్నారు.వారు తరచుగా విద్యను, మంచి పనితో ఉజ్వల భవిష్యత్తును పొందే అవకాశాన్ని కోల్పోతున్నారు.79 మిలియన్ల మంది ప్రమాదకరమైన పనిలో ఉన్నారు.ఇది వారి భద్రత,ఆరోగ్యం మరియు నైతిక అభివృద్ధికి ప్రత్యక్షంగా హాని కలిగిస్తుంది.



ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం ప్రతి ఏటా జూన్ 12న నిర్వహించబడుతుంది.బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలలో అవగాహన తీసుకురావడానికి ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ కార్మిక సంస్థ సంయుక్తాధ్వర్యంలో ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) 2002లో మొదటిసారిగా ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవాన్ని ప్రారంభించింది.2021 లో ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో బాల కార్మికుల సంఖ్య తగ్గినప్పటికీ, ఉప-సహారా ఆఫ్రికాలో ఇది పెరిగింది. ఆఫ్రికాలో పెద్ద సంఖ్యలో ప్రభావితమైన పిల్లలు (86.6 మిలియన్లు) నివసిస్తున్నారు, ఇక్కడ 5-17 సంవత్సరాల వయస్సు గల పిల్లలలో 23.9% మంది బాల కార్మికులలో ఉన్నారు.2023 నాటికి, ప్రపంచంలోని అత్యంత పేద దేశాలలో, ప్రతి ఐదుగురు పిల్లలలో ఒకరు బాల కార్మికులలో నిమగ్నమై ఉన్నారు, వీరిలో అత్యధిక సంఖ్యలో ఉప-సహారా ఆఫ్రికాలో నివసిస్తున్నారు. ఇక్కడ నలుగురిలో ఒకరి కంటే ఎక్కువ మంది పిల్లలు అలా నిమగ్నమై ఉన్నారు.బాల కార్మికులను తగ్గించడంలో చాలా పురోగతి సాధించినప్పటికీ, ఇటీవలి సంవత్సరాలలో ప్రపంచ ధోరణులు మారాయి.ఇప్పుడు అన్ని రకాల బాల కార్మికుల నిర్మూలనను అంతం చేసే దిశగా చర్యలను వేగవంతం చేశాయి.సుస్థిర అభివృద్ధి లక్ష్యం 8.7ను స్వీకరించడంతో,అంతర్జాతీయ సమాజం 2025 నాటికి అన్ని రకాల బాల కార్మికులను నిర్మూలించడానికి కట్టుబడి ఉంది.2015 లో, భారతదేశం వివిధ పారిశ్రామిక పరిశ్రమలలో చట్టవిరుద్ధంగా పనిచేస్తున్న పిల్లల సంఖ్య అత్యధికంగా ఉంది. భారతదేశంలో వ్యవసాయం అనేది అతిపెద్ద రంగం, ఇక్కడ చాలా మంది పిల్లలు తమ కుటుంబాన్ని పోషించుకోవడానికి చిన్న వయస్సులోనే పని చేస్తారు.నిరుద్యోగం, పెద్ద కుటుంబాలు, పేదరికం మరియు తల్లిదండ్రుల విద్య లేకపోవడం వంటి అనేక కుటుంబ కారణాల వల్ల ఈ పిల్లలలో చాలామంది చిన్న వయస్సులోనే పని చేయవలసి వస్తుంది. భారతదేశంలో బాల కార్మికుల రేటు ఎక్కువగా ఉండటానికి ఇది తరచుగా ప్రధాన కారణం. బాల కార్మికుల నిర్మూలన కోసం భారతదేశంలో 1986 నుండి చట్టం ఉంది.ఇది పిల్లలు ప్రమాదకరం కాని పరిశ్రమలలో పని చేయడానికి అనుమతిస్తుంది.2013లో,పంజాబ్,హర్యానా హైకోర్టు ఒక అద్భుతమైన ఆదేశాన్ని ఇచ్చింది.ఇది ప్రమాదకరమైన లేదా ప్రమాదకరం కాని పరిశ్రమలలో 14 సంవత్సరాల వయస్సు వరకు పిల్లలను నియమించడాన్ని పూర్తిగా నిషేధించాలని ఆదేశించింది. ప్రస్తుతం భారతదేశంలో బాల కార్మికులు 5-17 సంవత్సరాల వయస్సు గల వారు 1.8 మిలియన్ల నుండి 3.3 మిలియన్ల మంది పిల్లలు బాల కార్మికులలో నిమగ్నమై ఉన్నారని,బాల కార్మికులను నిషేధించడానికి చట్టం ఉన్నప్పటికీ, పేదరికం, విద్యా అవకాశాలు లేకపోవడం మరియు సాంస్కృతిక నిబంధనలు వంటి అంశాలు దాని ప్రాబల్యానికి దోహదం చేస్తూనే ఉన్నాయి. పిల్లలందరికీ ప్రాథమిక విద్య అందుబాటులో ఉంచడం ద్వారా వారి భవిష్యత్తును మెరుగుపరచడానికి సహాయపడవచ్చు.బాల కార్మిక వ్యవస్థ యొక్క దుష్ప్రభావాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం.బాల కార్మిక చట్టాలను ఉల్లంఘించే వారికి కఠినమైన శిక్షలు విధించడం ద్వారా బాల కార్మిక వ్యవస్థను నిర్మూలన చేయవచ్చు.పిల్లల్లో సహజంగా ఉన్న నైపుణ్యాలు,సామర్థ్యాలు పెంపొందించడం. భారమైన శ్రమకు బలైపోతున్న బాలబాలికల చేత పలకా బలపం పట్టిస్తే వారు మహోన్నతమైనటువంటి వ్యక్తులుగా తీర్చిదిద్దబడతారు.ఇతరులకు ఆదర్శప్రాయాలుగా నిలుస్తారు.అందరి సమిష్టి కృషి వల్ల అప్పుడే సమాజంలో బాల కార్మిక నిర్మూలన జరిగి సమాజం మెరుగవుతుంది.





డాక్టర్ మోటె చిరంజీవి,
సామాజికవేత్త,విశ్లేషకులు, సెల్ : 9949194327


## చదువరుల పాలిట అక్షయ పాత్ర
# మొబైల్ లైబ్రరీ యాప్‌లు

**స్మార్ట్‌ఫోన్‌లు ఒకప్పుడు పుస్తకాలంత సర్వసాధారణంగా మారిన ఈ యుగంలో, మొబైల్ లైబ్రరీ యాప్‌లు ఒక శక్తివంతమైన మార్పుగా ఆవిర్భవించాయి. జ్ఞాన సంపదను నేరుగా మన జేబుల్లోకి తీసుకొస్తున్నాయి. ఈ డిజిటల్ వేదికలు, ఎప్పుడైనా, ఎక్కడైనా యాక్సెస్ చేయగలిగే సామర్థ్యంతో ఉన్నాయి. మనం సాహిత్యం, పరిశోధన,లేదా ఏ ఇతర అభ్యాసంతో ఎలా సంబంధం కలిగి ఉంటామో అలాగే మార్చివేస్తున్నాయి. ఇకపై లైబ్రరీ అనే స్వరూపం ,ఉనికి భౌతిక గోడలకు మాత్రమే పరిమితం కాకుండా, ఒక్క ట్యాప్‌తో ఎనలేని పుస్తకాలు, ఆడియోబుక్‌లు, అనేక విద్యా సంబంధిత వనరులను పాఠకులు అన్వేషించవచ్చు. ఈ సాంకేతికత, సాహిత్య సమ్మేళనం కేవలం సౌలభ్యం మాత్రమే కాదు. ఇది జ్ఞానానికి ప్రజాస్వామ్య యాక్సెస్‌ను ప్రోత్సహించే లక్షణం. జీవితకాల అభ్యాస సంస్కృతిని పెంపొందించే విప్లవం.**

మొబైల్ లైబ్రరీ యాప్‌ల ఆకర్షణ వాటి అసమానమైన యాక్సెసిబిలిటీలో ఉంది. సాంప్రదాయ లైబ్రరీలు నిర్దిష్ట పని గంటలు ప్రత్యేక స్థలాలలో పనిచేస్తాయి. కానీ ఈ యాప్‌లు 24/7 అందుబాటులో ఉంటాయి. బిజీగా ఉన్న ప్రొఫెషనల్స్, విద్యార్థులు, పరిశోధకులు, సాధారణ రీడర్స్ రాత్రి ,పగలు సమయంలో చదివే వారి షెడ్యూల్‌లకు అనుగుణంగా ఎప్పుడంటే అప్పుడు అందుబాటులో ఉంటాయి. రద్దీగా ఉన్న రైలులో ప్రయాణిస్తున్నా లేదా డాక్టర్ కార్యాలయంలో వేచి ఉన్నా, ఒక లైబ్రరీ యాప్ ఖాళీ క్షణాలను జ్ఞాన సమృద్ధి అవకాశాలుగా మార్చగలదు. ఉదాహరణకు, ఓవర్‌డ్రైవ్ అభివృద్ధి చేసిన "లిబ్బీ యాప్", స్థానిక పబ్లిక్ లైబ్రరీ కార్డ్‌తో ఈ-బుక్‌లు మరియు ఆడియోబుక్‌లను అరువుగా తీసుకోవడానికి అనుమతిస్తుంది. న్యూయార్క్‌లోని ఒక పాఠకుడు సబ్‌వేలో ప్రయాణిస్తూ "చిమమండా ఎన్‌గోజీ అడిచీ" నవలను చదవగలడు, అదే సమయంలో భారతదేశంలోని గ్రామీణ ప్రాంతంలోని ఒక విద్యార్థి తన ఫోన్‌లో విద్యా జర్నల్‌లను యాక్సెస్ చేయగలడు.భౌగోళిక మరియు ఆర్థిక అంతరాలను తగ్గిస్తూ. సాధారణ సౌలభ్యానికి మించి, మొబైల్ లైబ్రరీ యాప్‌లు భౌతిక లైబ్రరీల సేకరణలకు సమానమైన, కొన్నిసార్లు వాటిని అధిగమించే విస్తృత వనరులను అందిస్తాయి. "హూప్లా", "స్క్రిబ్డ్" వంటి ప్లాట్‌ఫారమ్‌లు బెస్ట్‌సెల్లర్‌ల నుండి అస్పష్టమైన విద్యా గ్రంథాల వరకు, "కామిక్స్", "షీట్ మ్యూజిక్", "పాడ్‌కాస్ట్‌ల"తో సహా మిలియన్ల కొద్దీ శీర్షికలను అందిస్తాయి. ఈ వైవిధ్యం విభిన్న ఆసక్తులు మరియు అభ్యాస శైలులను తీరుస్తుంది. సాధారణ పాఠకుల నుండి పరిశోధకుల వరకు అందరికీ విలువైనది ఏది కావాలో దానిని




అడిగిందే తడవుగా "అక్షయ పాత్ర లా అందిస్తుంది. ఉదాహరణకు, చరిత్ర పరీక్షకు సిద్ధమవుతున్న ఒక ఉన్నత పాఠశాల విద్యార్థి జోస్టర్ యాప్ ద్వారా ప్రాథమిక మూల డాక్యుమెంట్‌లను డౌన్‌లోడ్ చేయగలడు. అదే సమయంలో ఒక తల్లిదండ్రులు లాంగ్ డ్రైవ్ సమయంలో తమ బిడ్డను అలరించడానికి "లిబ్బీ"పై పిల్లల ఆడియోబుక్‌ను స్ట్రీమ్ చేయవచ్చు. అందుబాటులో ఉన్న కంటెంట్ యొక్క విస్తృతత సమగ్రతను ప్రోత్సహిస్తుంది. ఈ యాప్‌లను విద్య, వినోదానికి అనివార్య సాధనాలుగా మారుస్తుంది.

అంతేకాకుండా, మొబైల్ లైబ్రరీ యాప్‌లు భౌతిక పుస్తకాలు అందించలేని ఫీచర్ల ద్వారా చదివే అనుభవాన్ని మెరుగుపరుస్తాయి. అనుకూలీకరించదగిన టెక్స్ట్ సైజులు, సర్దుబాటు చేయగల బ్యాక్‌గ్రౌండ్ రంగులు, మరియు అంతర్నిర్మిత నిఘంటువులు దృష్టి లోపం లేదా భాషా అడెక్కులు ఉన్న పాఠకులకు యాక్సెసిబిలిటీని ప్రోత్సహిస్తాయి. "కిండిల్" మరియు "గూగుల్ ప్లే బుక్స్" వంటి యాప్‌లు పాఠకుల అభిరుచులకు తగిన భాగాలను" హైలైట్ " చేయడానికి, "నోట్స్" తీసుకోవడానికి, మరియు వారి పురోగతిని ఫోన్, ట్యాబ్, లేదా ఈ-రీడర్‌లలో సమకాలీకరించడానికి అనుమతిస్తాయి. సజావుగా చదివే అనుభవాన్ని సృష్టిస్తాయి. ఆడియోబుక్ ఫీచర్లు, "వేరియబుల్ ప్లేబ్యాక్ స్పీడ్"ల వంటివి, వినియోగదారులు తమ సొంత వేగంతో కంటెంట్‌ను ఆస్వాదించడానికి అనుమతిస్తాయి. ఈ ఆవిష్కరణలు చదవడాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చడమే కాక, ఆధునిక వినియోగదారుల వేగవంతమైన, బహుళ-పనుల జీవనశైలిని కూడా సమన్వయం చేస్తాయి. అయితే, మొబైల్ లైబ్రరీ యాప్‌ల ఆవిర్భావం సవాళ్ల లేకుండా లేదు. డిజిటల్ డివైడ్‌లు ఇప్పటికీ ఉన్నాయి, చాలా మంది, ముఖ్యంగా సేవలు అందని ప్రాంతాలలో, నమ్మదగిన ఇంటర్నెట్ లేదా అనుకూల పరికరాలకు యాక్సెస్ లేకపోవడం ఒక సమస్య. అదనంగా, కొన్ని యాప్‌లు వినియోగదారు సమాచారాన్ని సేకరించడం వల్ల డేటా గోప్యత గురించి ఆందోళనలు ఉన్నాయి. ఈ సౌకర్యం కొన్ని సందర్భాలలో దుర్వినియోగం కావచ్చు. లైబ్రరీలు అలాగే యాప్ డెవలపర్‌లు సమాన యాక్సెస్‌ను ప్రోత్సహించడం... పారదర్శక గోప్యతా విధానాలను అమలు చేయడం ద్వారా ఈ సమస్యలను పరిష్కరించాలి. ఈ అడ్డంకులు ఉన్నప్పటికీ, మొబైల్ లైబ్రరీ యాప్‌లు సంఘాలను సాధికారపరచే సామర్థ్యం అసాధారణమైనది. "వరల్డ్‌రీడర్" వంటి కార్యక్రమాలు, తక్కువ-ఆదాయ దేశాలలో పిల్లలకు ఉచిత ఈ-బుక్‌లను అందించడం ద్వారా, భౌతిక లైబ్రరీలు అరుదుగా ఉన్న ప్రాంతాలలో సాక్షరత మరియు విద్యను పెంపొందించడం ద్వారా జీవితాలను మార్చగలవు.

మొబైల్ లైబ్రరీ యాప్‌ల సాంస్కృతిక ప్రభావం వ్యక్తిగత పాఠకులను అధిగమిస్తుంది. జ్ఞానాన్ని సార్వత్రికంగా యాక్సెస్ చేయగలిగేలా చేయడం ద్వారా, ఈ యాప్‌లు విద్య మరియు ప్రచురణలలో సాంప్రదాయ గేట్‌కీపింగ్‌ను సవాలు చేస్తాయి. అవి అట్టడుగు స్వరాలను సాధికారపరుస్తాయి, స్వీయ-ప్రచురిత రచయితలకు అలాగే ఓపెన్-యాక్సెస్ విద్యా రచనలకు వేదికలను అందిస్తాయి. ఇవి బుక్‌స్టోర్ షెల్ఫ్‌లకు ఎప్పటికీ చేరకపోవచ్చు. ఒక గ్రామంలోని రచయిత వాట్‌ప్యాడ్‌పై తమ కథను ప్రచురించి, ప్రపంచవ్యాప్త ప్రేక్షకులను చేరుకోవచ్చు, అదే సమయంలో ఒక పరిశోధకుడు రీసెర్చ్‌గేట్‌పై తమ ఆవిష్కరణలను పంచుకోవడం ద్వారా అంతర్జాతీయ సహకారాన్ని ప్రేరేపించవచ్చు. కంటెంట్ సృష్టి మరియు వినియోగం యొక్క ఈ ప్రజాస్వామ్యీకరణ సాహిత్య దృశ్యాన్ని మార్చివేస్తోంది. మరింత సమగ్రమైన పరస్పర సంబంధిత ప్రపంచాన్ని పెంపొందిస్తోంది.


సారాంశంగా, మొబైల్ లైబ్రరీ యాప్‌లు కేవలం సాధనాలు మాత్రమే కాదు. అవి జ్ఞానానికి హద్దులు లేని భవిష్యత్తుకు గేట్‌వేలుగా భావించాలి. అవి చదవడం యొక్క శాశ్వత ఆనందాన్ని భర్తీ చేయకుండా, సాంకేతికత దానిని మెరుగుపరచగలదనే వాగ్దానాన్ని సాకారం చేస్తాయి. ఈ విప్లవాన్ని స్వీకరించడం ద్వారా, మానవ పురోగతికి మూలస్తంభమైన లైబ్రరీ రాబోయేతరాల కోసం శక్తివంతంగా మరియు యాక్సెస్ చేయగలిగేలా ఉండేలా మనం నిర్ధారిస్తాము.




డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్
9849328496


## అపురూప కావ్య సంపుటి
# సినారె స్మరణ వేళలో..

7 జూన్ 2025 న వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం వీసీ చాంబర్ పక్కన గల హాల్ లో ఉదయం నుండి సాయంత్రం దాకా "సినారె సాహిత్యోత్సవం" వీనుల విందుగా జరిగింది. పలువురు సాహితీవేత్తలు, పాల్గొన్న ఈ సభలో సినారె అనువాద రచయితలు అనేక రాష్ట్రాల నుండి విచ్చేయడం విశేషం. ఈ సందర్భంగా " స్మరణ వేళలో" అనే సినారె కవితల సంకలనం వెలువరించారు. ఇది సినారె కవితా సంపుటాల కొన్ని పుస్తకాల పేర్లు గల కవితలతో కూర్చారు. అన్ని కవితలు ఆణి ముత్యాలే.




ఇందులో విశ్వగీతి, మధ్య తరగతి మందహాసం,మరోహరివిల్లు, మంటలూ మానవుడూ, ముఖాముఖి, మార్పు నా తీర్పు, భూమిక, ఆరోహణ, దృక్పథం, భూగోళమంత మనిషి బొమ్మ, గదిలో సముద్రం,దూరాలను దూసుకొచ్చి, రెక్కల సంతకాలు, జ్వాలగా జీవించాలని, కొనగోటి మీద జీవితం, కలిసి నడిచే కలం,అవీ ఆ జీవనిధులు, సమూహం వైపు, మనిషిగా ప్రవహించాలని, విశ్వం నాలో ఉన్నపుడు, నా చూపు రేపటి వైపు,అలలెత్తే అడుగులు,నింగి కెగిరిన చెట్లు,క్షేత్ర బంధం, నా రణం మరణం పైనే." ఇలా 25 కవిత్వ పుస్తకాల పేర్లను , కవితలను చేర్చడం ద్వారా యువతరానికి సినారె కవితా రీతులు పరిచయమవుతాయి. . సీనియర్ సాహితీవేత్తలకు మరోసారి గుర్తు చేస్తాయి.

1965 లో వెలువడిన " అక్షరాల గవాక్షాలు" కవితా సంపుటితో నాకు సినారె కవిత్వ పరిచయం జరిగింది. అంతకు కాస్త ముందే గులేబకావళి సినిమా పాటలతో పల్లె పల్లెకు సినారె కవిత్వం చేరింది. జ్ఞాన పీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి. నారాయణ రెడ్డి తెలుగు సాహిత్యం అందుకోని శిఖరాలు లేవు. అందని అధికార హోదాలు లేవు. సినిమా పాటల కవిగా, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ గా, తెలుగు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ గా, అధికార భాషా సంఘం చైర్మన్ గా, తెలంగాణ భాషా సంస్కృతిక శాఖ చైర్మన్ గా, రాజ్య సభ సభ్యులుగా పరిపాలనా దక్షులుగా కూడా ప్రసిద్ధి చెందారు. అన్ని పదవులను హోదాలను కవి హృదయంతో నిర్వహించారు. సినారె కోపమన్నది ఎరుగరు. కవిత్వంలో కూడా అంతే. ఎంతో సున్నితంగా హృదయాన్ని మనస్సును మంచి తనాన్ని తట్టి లేపుతారు. సినారె తన కవిత్వానికి లయాత్మకత అద్ది చక్కగా పాడి వినిపించేవారు. తెలుగు సాహిత్యంలో విషాద ప్రణయ గీతాల భావ కవిత్వ యుగంలో సినారె సాహిత్య ప్రయాణం మొదలైంది . దానికి ప్రతినిధి కవితగా" విశ్వగీతి" నిలుస్తుంది. అలా కర్పూర వసంత రాయలు, నాగార్జున సాగరం గేయ కావ్యాలు రాసాక కాలంతో పాటు వచన కవిత్వంలోకి ప్రవేశించారు.

1960 నుండి సినిమాల్లో 2800 పైగా పాటలు రాసారు. ప్రపంచ పదులు, సినారె గజల్లు మొదలైన ప్రక్రియల్లో కూడ చరిత్ర సృష్టించారు . సినారె పిహెడీ " తెలుగు కవిత్వంలో సాంప్రదాయములు ప్రయోగములు" అనే గ్రంథం నేటికీ వేలాది పరిశోధకులకు ప్రామాణిక గ్రంథం. తెలుగు సాహిత్యం లో సినారే ప్రవేశించినపుడు వందలాది కవుల్లో ఒకరు . . కాలం గడిచిన కొద్దీ కొందరు ఆగిపోయారు. కొందరు గతించారు. నిరంతర కవితాయానంలో పదిమందిలో ఒకరు గా ఎదిగారు. మరికొంత కాలానికి ఒకే ఒకరుగా జ్ఞాన పీఠ అవార్డు గ్రహీతగా నిలిచారు. అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. సినారె ప్రతి సభను అద్భుతంగా నిర్వహించారు. సమయ పాలన వారి నుండి నేర్చుకోవలసినదే. ప్రతి కవిని రచయితను వారిలోని సుగుణాంశాలను వెలికి ప్రశంసించేవారు. వారు రాసిన అభినందన ఆశీర్వచన లేఖలను కవులు భద్రంగా దాచుకునే వారు. ఇలా. వ్యక్తిత్వంలో , మాట తీరులో, పాఠం చెప్పే తీరులో, నిత్య రచనలో ఆదర్శ ప్రాయుడు డాక్టర్ సినారె. ఉర్దూ మీడియంలో చదువుకొని తెలుగు సంస్కృత భాషలను అధ్యయనం చేసి పాండిత్యం ప్రదర్శన కోసం కాకుండా కవిత్వం పండించడం కోసం పొదుపుగా ఒదుపుగా ఉపయోగించిన కవి. సినారె కవిత్వంలో పల్లె పదాలు అలవోకగా కవితా జలపాతంలో ప్రవహిస్తాయి. ఈ సంపుటిలోని 25 కవితలో వాటన్నిటిని గమనించవచ్చు. పరిశోధించవచ్చు. ఈ కవితల సంపుటి పైనే ఒక యం ఫిల్ చేయ వచ్చు. పాఠకులు రస హృదయులు సాహిత్యాభి మానులు, సాహితీ వేత్తలు యువ సాహిత్యకారులు అందరు చదవ వలసిన పుస్తకం ఈ సంపుటి. భావ కవితా పదగుంభనకు " విశ్వగీతి " ఒక మచ్చుతునక. నాలో ఎగిసిన గీతంఫాలాక్ష నిటలాగ్ని జ్వాలా మాలా పూతం"

" నాలో పలికిన గీతం మృత్యు నర్తకీ కరాళ నృత్యంలో తెగిన కింకిణీ గణ గల సంగీతం" అలా సాగి సాగి దూరాలనుదూసుకొచ్చి" సముద్రాలను బోర్ వెల్స్ గా మార్చుకోవాలన్న కోరికలు" పెరిగిన క్రమం ! మనిషిగా ప్రవహించాలంటే "" ప్రవాహం చలన శీలానికి ప్రతి రూపం ఈ సృష్టికైనా ఏ వ్యక్తి కైనా" అని ప్రేమిస్తాడు. క్షేత్ర బంధం కొత్తేసరికి బాల్యంలోకి తెలంగా భాషలోకి ఎంత సుళువుగా ప్రవహించాడో! "చిన్నపుడు మా మక్క చేన్లో ముచ్చటపడి నాగలి పేటి దున్నేవాణ్ని. వంతర్లు పోతున్న ఆ వాజగటి చీలేవని చూసి పక్కనే. న్న పాలేరవ్వలు ముసి ముసి నవ్వులు నవ్వుతూ చూసెటోల్లు". ఇట్లా కవిత్వంలో తెలంగాణ భాష నుడికారం, సినారె మాటల్లో పాటల్లో విన్నపుడు మరింత వినసొంపుగా ఉంటుంది.

" నడక నాతల్లి పరుగు నా తండ్రి. సమత నా భాష కవిత నా శ్వాస " అంటూ సార్థకంగా జీవించి మహాకవి సినారే తెలుగు సాహిత్యం ఉన్నంత వరకు వెలుగు ప్రసరిస్తూనే వుంటారు. అమూల్యమైన ఈ పుస్తకానికి ధర లేదు ఉచిత కానుక. కనక తొందరగా సంపాదించుకొండి

**(తెలంగాణ సారస్వత పరిషత్ కార్యాలయంలో లభిస్తుంది.)**


బిఎస్ రాములు
8331966987




# ప్రగతి పథంలో ప్రజా పాలన పాటల సంకలనం

కాంగ్రెస్ ప్రభుత్వంలో "ప్రగతి పథంలో పరిపాలన "ఎలా సాగుతున్నదో పాటల రూపంలో ప్రజలకు తెలిపే పాటల పుస్తకం ఇది. సంపాదకీయంలో డా. మామిడి హరికృష్ణ పాట ప్రధాన్యతను, అవసరాన్ని, పని పాటల్లో పాట వ్యాప్తి చెందిన విధాన్ని పరిచయం చేశారు. ఇందులో 80 పాటలు చేర్చబడ్డాయి. తెలంగాణ సాంస్కృతిక సారథి కవులు కళాకారులు సాహితీవేత్తలు రాసిన పాటలివి. ఇందిరమ్మ ఇల్లు, మహిళలుకు రెండు న్నవేలు, ఐదు వందలకు వంటగ్యాస్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతుభరోసా, కౌలురైతులకు 15 వేలు, వ్యవసాయ కూలీకి 12 వేలు, వరి పంటకు ఐదు వేలు బోనస్,ఆరోగ్యశ్రీ, విద్యా భరోసా, ఎరువులు, విత్తనాలు, ఉపాధిహామీ, 200 యూనిట్ల ఉచిత కరెంటు, గురుకుల పాఠశాలలు మొదలైన పథకాలు ఈ పాటల ద్వారా ప్రజలకు వివరించారు.ఇందులో మరికొ న్ని పథకాలు ప్రస్థావించారు. అవి ప్రారంభం కావలసినవి. రెండు పాటలు సంవాద రూపంలో సాగాయి. ఈ పాటలో కుల




వృత్తులు చేస్తున్న బీసీ కులాల గురించి లేకపోవడం గమనించ దగిన విషయమే. పాటలు ప్రచార స్థాయిలో ఉన్నాయి. ఉన్నత సాహిత్య విలువలు, కళారూపం , సంతరించుకోవలసి వుంది. పాటల ట్యూన్లు వింటేగా ొతెలియదు. ప్రయత్నం ఆహ్వానించ దగినది. సాహత్య విలువలు, ప్రజల జీవితంలో పథకాల వల్ల వచ్చిన మార్పులు ప్రయోజనాలు చైతన్యం జీవన ప్రమాణాలు పెరిగిన తీరు అధ్యయనం చేసి రాస్తే రప్రచార స్థాయి నింటికా సాహిత్య స్థాయి అందుకుంటాయి పాటలు. ఇందులో పేర్కొన్నావే కాక ఇంకా ఎన్నో సంక్షేమ , అభివద్ధి పథకాలున్నాయి. వాటిని కూడా ప్రచారం చేయడం అవసరం. (ప్రతి పథంలో ప్జాపాలన, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ సాంకేతిక సారథి ప్రచురణ, 128 పేజీలు. వెల 150 రూపాయలు. ప్రతులకు తెలంహ సాంస్కృతిక సారథి. ఫోన్.040 40204657)

## సంతలో సరస్వతి

అక్షరాభ్యాసానికి లక్షల్లో ఆరగించి
అరకొరగా సదువు చెప్పి
"నిరుద్యోగ"పత్రాలను అప్పచెప్పి

గురు బ్రాహ్మ గురు విష్ణని
గప్పాలు కొట్టి మరి

ఆ బ్రాహ్మ జీత భత్యాలను దోపిడీల
రాత రాసే
దొంగ యాజమాన్యాలు

శాస్త్రీయత కరువైన పుక్కిటి పురాణాల్ని చేర్చి

చెద పట్టిన చరిత్రను అనువుగా సవరించి

నూతన విద్య అంటూ
అజ్ఞాన నూతిలోకి విద్యార్థిని
నెట్టేసి

పైత్యమెక్కి ప్రవర్తించే పలు రాజకీయ
పార్టీలు

ప్రభుత్వాల బడులంటే
పురుగన్నాల మడులేనని

మరుగుదొడ్డి వ్యదలేనని

పేద బిడ్డ పరిగెడుతూ
నీకెంతో దూరమయ్యే

తల్లీ సరస్వతీ దేవి
నీకు గుడిలోన దండమెట్టి
విద్యా వీధిలోన బేరమెట్టే
నా దేశం?


**నేపా.సంతోష్ అచ్యుత్ కుమార్
అసిస్టెంట్ ప్రొఫెసర్,
కాళోజి ప్రతిభ పురస్కార గ్రహీత**


## పాఠశాల

అక్కడ అడుగు పెట్టడంతోనే
అజ్ఞానం చీకటి పొరలు
ఒక్కొక్కటిగా తొలగిపోతూ
విజ్ఞాన కిరణాలు తొడగబడతాయి

ఆ ప్రాంగణంలోని ప్రతి చెట్టు
బోధి వృక్షంగా మారి
బుద్ధులను తయారుచేసి
ఈ ప్రపంచ దుఃఖాన్ని తొలగిస్తాయి

అక్కడి మైదానం
శరీరంలోని ప్రతి అణువణువును
బలంగా తయారు చేసి
విశ్వ విజేతను చేసి నిలబెడతాయి

అక్కడి గాలి తగిలితే చాలు అది
పేదరికిన్ని పటాపంచలు చేసి
ప్రపంచ పటాలపై నడిపిస్తూ
సంపన్నుడిని చేసేలా సహకరిస్తుంది.

అక్కడి ప్రతి తరగతి గది
నైపుణ్యాల పారించే నది

అక్కడ ప్రతి శిక్షకుడి మది
సామర్థ్యాలతో నిండిన కడలి .

అంబేద్కరులైన
అబ్దుల్ కలాములైన
అక్కడి నుండే నడక మొదలెట్టి
ప్రపంచ నలుమూలలకి
తన జ్ఞానాన్ని ప్రసరించి
విజ్ఞాన చిహ్నాలుగా వెలుగునిస్తారు.


**నెరువట్ల చైతన్య
9491470746, కరీంనగర్**

## దరఖాస్తులకు పరిమితం కాకుండా రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అమలు చేయాలి

- ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్




**హైదరాబాద్, జూన్ 11 (జనంసాక్షి) :** దరఖాస్తులకు పరిమితం కాకుండా రాజీవ్ యువ వికాస్ పథకాన్ని రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు హిమాయత్ నగర్ లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దరఖాస్తులు తప్ప అమలుకు నోచుకోవడం లేదని వారు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి రుణాలు అందించడానికై రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా రూ.50వేల నుండి రూ.5 లక్షల వరకు రుణాలను ఇస్తామని 6వేల కోట్ల రూపాయలను కేటాయించిందన్నారు. ఈ పథకానికి రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులు 16 లక్షలా 25వేల మంది వరకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం జూన్ 2 తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున రాజీవ్ యువ వికాస్ పతకం లబ్దిదారులకు నిధులను మంజూరు చేస్తామని ప్రచారం చేసి వాయిదా వేసిందన్నారు.ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా కాలయాపన చేయకుండా రాజకీయ ప్రమేయం లేకుండా అర్హులైన లబ్దిదారుల అందరికి రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా నిధులు మంజూరు చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిబిల్ స్కోరు లేకున్నా నిరుద్యోగ యువతకు ఈ పథకాన్ని అమలు చేయాలని, లేనిపక్షంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. సత్య ప్రసాద్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి మధు, శివ కుమార్, వంశి తదితరులు పాల్గొన్నారు.

# మోగిన బడిగంట...

- అసంపూర్తిగా యూనిఫాంల సరఫరా
- రెండు రోజుల తర్వాత పాఠశాలకు చేరే అవకాశం
- పంపిణీకి సిద్ధంగా ఉన్న పాఠ్యపుస్తకాలు నోట్ పుస్తకాలు
- ప్రైవేట్ పాఠశాలలో అడ్మిషన్ల జోరు
- ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల బేజారు
- జనరల్ హాస్టల్లో ప్రారంభం కానీ అడ్మిషన్లు



**వికారాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 11 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతుంది. బడి గంట మోగగానే పాఠశాలలు విద్యార్థులతో నిండిపోయి కళకళలాడుతాయి. కానీ నోటు పుస్తకాలు పాఠ్యపుస్తకాలు మినహా ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో యూనిఫాంల సరఫరా జరగలేదు. పూర్తిస్థాయిలో యూనిఫాంల కోసం మరో రెండు మూడు రోజులు పట్టొచ్చు. ఇక ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్ల జోరు అందుకుంది. ప్రభుత్వ పాఠశాలలు హాస్టల్లో అడ్మిషన్లు ప్రారంభం కావాల్సి ఉంది. అరకొర వసతులతో బడి గంట మోగుతుంది. వివరాల్లోకి వెళితే రాష్ట్ర ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం ఈ ఏడాది విద్య సంవత్సరం ప్రారంభం కాబోతోంది. వికారాబాద్ జిల్లాలోని అన్ని మండలాల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలలు .ప్రైవేట్ పాఠశాలలు గురువారం అట్టహాసంగా ప్రారంభిస్తున్నారు. పాఠశాలల్లో పండగ వాతావరణం లో విద్యార్థులు సందడి చేస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు నోట్ పుస్తకాలు పాఠ్యపుస్తకాలు యూనిఫాముల సరఫరా జరిగింది. మొదటి దఫ కింద ఒక్కొక్క విద్యార్థికి ఒక జత చొప్పున యూనిఫామ్ పాఠ్య పుస్తకాలు నోటు పుస్తకాలు అందజేయనున్నారు. ఇంకా కొన్ని పాఠశాలలకు యూనిఫాంల సరఫరా జరగలేదు. రెండో దఫా యూనిఫామ్ లు నెలరోజుల తర్వాత విద్యార్థులకు అందజేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఒక జతకు 75 రూపాయల చొప్పున కుట్టుకూలీ చొప్పున డ్వాక్రా మహిళలు యూనిఫామ్ లు కుడుతున్నారు. కాగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంకా అడ్మిషన్లు ప్రారంభం కాలేదు. ఇప్పటివరకు ప్రభుత్వ ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించి బడి ఈడు పిల్లలు బడి బయట పిల్లలను గుర్తించి బడిలో చేర్చే కార్యక్రమాన్ని నిర్వహించారు. కానీ ప్రైవేట్ పాఠశాలలు వారం రోజుల ముందే ఈ ఏడాది విద్యా సంవత్సరం అడ్మిషన్లను ప్రారంభించారు. విద్యా సంవత్సరం ప్రారంభం కంటే ముందే అడ్మిషన్లు పూర్తిచేసి షెడ్యూల్ ప్రకారం సకాలంలో అన్ని తరగతులకు విద్యాబోధన చేయనున్నారు. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పుడిప్పుడే అడ్మిషన్లు ప్రారంభించనున్నారు. షెడ్యూల్ ప్రకారం గత సంవత్సరం విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన ఉన్న కొత్తగా పాఠశాలలో చేరే విద్యార్థులు లేటుగా అడ్మిషన్ పొందడంతో పాఠ్యాంశాల బోధన వినలేని పరిస్థితి నెలకొంది. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ చొరవతో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు తరగతి గదుల మరమ్మత్తులకు శ్రీకారం చుట్టారు. ఇక పాఠశాలలే కాదు సాంఘిక సంక్షేమ ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ జనరల్ హాస్టల్లో అడ్మిషన్లు ఇంకా ప్రారంభం కాలేదు. పాఠశాలలో విద్యార్థి చేరగానే ఆ విద్యార్థికి హాస్టల్లో భోజన వసతితో పాటు ఇతర సదుపాయాలు కల్పించవలసిన బాధ్యత సాంఘిక సంక్షేమ శాఖపై ఉంది. కానీ ఇంకా హాస్టల్లో అడ్మిషన్లు ప్రారంభం కాలేదు. దీంతో పాఠశాలలో చేరిన విద్యార్థికి ఇక్కట్లు తప్పవు. దూర ప్రాంతాల నుంచి వచ్చి పాఠశాలలో చేరిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తది. ఫలితంగా పాఠశాలలో సమయానికి విద్యార్థి పాఠ్యాంశం పద్ధతిన సరిగ్గా విద్య బోధన అందుకోలేక పోతాడు. ఈ విషయంపై ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. తమ మండలాలలో పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు నోట్ పుస్తకాలు యూనిఫాంలో సరఫరా జరిగిందని ఈ యాలాల విద్యాధికారి రమేష్ తెలియజేశారు.

## బోడుప్పల్ పెద్దకంచె భూముల ల్యాండ్ పుల్లింగ్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి

- హెచ్ఎండిఏ కమీషనర్ను కోరిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి

**బోడుప్పల్, జూన్ 11 (జనంసాక్షి) :** బోడుప్పల్లోని పెద్దకంచె భూముల ల్యాండ్ పుల్లింగ్ ప్రక్రియను వెంటనే పూర్తి చేసి, దళితులకు తగిన న్యాయం చె యాలని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి నేతృత్వంలో పలువురు నాయకులు బుధవారం హెచ్ఎండిఏ కమీషనర్ సర్ఫరాజ్ అ హమ్మద్కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, బోడుప్పల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంద సంజీవ రెడ్డిలు మాట్లాడుతూ.. బోడుప్పల్ పెద్దకంచె సర్వే నంబర్లు 63బై2 నుంచి 63 బై 25 వరకు ఉన్న 336 ఎకరాల భూమిని ల్యాండ్ పుల్లింగ్ చె యాలని గత ప్రభుత్వం ల్యాండ్ పుల్లింగ్ విధానం ద్వారా అభివృద్ధి చేయాలని నిర్ణయించగా. కొంతమంది న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో కోర్టు సదరు ప్రక్రియను నిలుపుదల చేసిందని పేర్కొన్నారు. అదేవిధంగా దళిత రైతులకు ఎకరానికి ఆరువందల గజాల స్థలాన్ని చొప్పున ఇచ్చే విధంగా అలాట్మెంట్ లెటర్ను ఇవ్వాలని హెచ్ఎండిఏ కమీషనర్కు విన్నవించారు.



దీనికి స్పందించిన కమీషనర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.త్వరలో ల్యాండ్ పుల్లింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు తమవంతు కృషి చేస్తామని కమీషనర్ హామీ ఇచ్చారు. కమీషనర్ సర్ఫరాజ్ అహమ్మద్ను కలిసిన వారిలో బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు. మాజీ జడ్పీటీసీ మందసంజీవ రెడ్డి, అంబేద్కర్ సంఘము మాజీఅధ్యక్షులు మీసాల కృష్ణ, చిన్నింగల కుమార్, చిన్నింగిల నర్సింహా, సంఘం ప్రధాన కార్యదర్శిచంటి శ్రీనివాస్. ఉపాధ్యక్షులు ఉప్పరివిజయ్ పాల్గొన్నారు.

## ఈ నెల 23 నుంచి మహిళా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

- వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్



**వికారాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 11 (జనం సాక్షి) :** తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో అర్హులైన మహిళా విద్యార్థులు జూన్ 23 తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వికారాబాద్ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళ డిగ్రీ కళాశాల ప్రవేశాలకు సంబంధించిన గోడ ప్రతిని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వికారాబాద్ కు సంబంధించిన డిగ్రీ మహిళా కళాశాల మొయినాబాద్ మండలం, తోలు కట్ట సమీపంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. డిగ్రీ కళాశాలలో బీఎస్సీ (ఎంపీసీఎస్, ఎంఎస్సిఎస్, బిజెడ్సి, ఎంజెడ్సి), బీకాం (బిఎ, సిఎ), బిఎ (హెచ్ఈపి) కోర్సుల లో ప్రవేశాలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు పదవ తరగతి, ఇంటర్మీడియట్ మార్కుల మెమో (అటేస్టెడ్ గెజిటెడ్ అదికారి), కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డ్ జిరాక్స్ కాపీ, 5 పాస్పోర్ట్ సైజ్ ఫోటోలతో పాటుగా జనవరి-2025 తర్వాత పొందిన తాజా ఆదాయ ధ్రువీకరణ పత్రం (గ్రామీణ 1,50,000 రూపాయలు, పట్టణ ప్రాంతానికి చెందిన వారు 2 రెండు లక్షల రూపాయలు) ను దరఖాస్తుకు జత చేసి నేరుగా జూన్ 23 లోపు కళాశాలలో అందజేయాలని కలెక్టర్ తెలిపారు. గోడప్రతి ఆవిష్కరణలో అదనపు కలెక్టర్ సుధీర్, డి సి ఓ సాయి లత, కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ విజయ కోట, అశోక్, డిఇఓ రేణుకా దేవి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి



**యాచారం, జూన్ 11 (జనం సాక్షి) :** విహార యాత్ర నిమిత్తం వెళ్లి తిరుగు ప్రయాణంలో వారు ప్రయాణిస్తున్న కారును ఎదురుగా వేగంగా వస్తున్న ట్రావెల్స్ బస్సు బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందగా, మరో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాదకర ఘటన యాచారం మండలం మాల్ సమీపంలో నాగార్జున సాగర్ రహదారి పై అర్ధరాత్రి చోటు చేసుకుంది. యాచారం సీఐ నందీశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మహబూబ్ నగర్ జిల్లా కు చెందిన వాస సాయితేజ, వాస పవన్ కుమార్, రాఘవేందర్ లు హైదరాబాద్ బాలానగర్లో ఉంటూ ప్రైవేట్ సంస్థల్లో పని చేస్తున్నారు. కాగా మరో నలుగురు స్నేహితులతో కలిసి మంగళవారం నాగార్జున సాగర్ బ్యాక్ వాటర్ వైజాగ్ కాలనీకి వెళ్లారు. తిరిగి ప్రయాణంలో వస్తుండగా మాల్ దాటిన తరువాత ఎస్ఆర్ పెట్రోల్ బంకు సమీపంలో నాగార్జునసాగర్ వైపు వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఎదురుగా వచ్చి బలంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో సాయితేజ (22), వాస పవన్ కుమార్(25),రాఘవేందర్ (25)లు ముగ్గురు అక్కడికి అక్కడే మృతిచెందగా వారి స్నేహితులు వాస శివకుమార్, వాస సాయికుమార్, ఎం.సందీప్, శివ కుమార్లకు తీవ్రంగా గాయడ్డారు. అక్కడికి చేరుకున్న పోలీసులు స్థానికుల సహాయంతో వారిని చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి శుభాకాంక్షల వెల్లువ

- మాలలు రాజకీయంగా ఎదగాలి
- మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చొక్కంపేట ఆంజనేయులు

**షాబాద్, జూన్ 11 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికి ప్రాధాన్యత ఇస్తూ పరిపాలన వ్యవహారాలలో బాధ్యతలు అప్పగిస్తూ న్యాయం చేస్తుంది అని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చొక్కంపేట ఆంజనేయులు అన్నారు. తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో అవకాశం వచ్చిన సందర్భంగా మాల సంక్షేమ సంఘం నాయకులు నగరంలోని వారి నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాల సంఘం జిల్లా అధ్యక్షులు చొక్కంపేట ఆంజనేయులు మాట్లాడుతూ... మాలలు రాజకీయంగా ఎదగాలి అలాగే సమాజంలోని అన్ని వర్గాలలో ముందుకు సాగాలి అని అన్నారు. తమ సామాజిక వర్గానికి చెందిన గడ్డం వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వారి తండ్రి కాంగ్రెస్ ప్రభుత్వం తరపున ప్రజలకు ఎన్నో సేవలు అందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బేగరి రాజు, ప్రధాన కార్యదర్శి చొక్కంపేట చంద్రశేఖర్, జిల్లా నాయకులు షాగంటి మహేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## బోనాలు, మొహరం పండుగలకు అసౌకర్యాలు ఉండొద్దు

- జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్



**హైదరాబాద్, జూన్ 11 (జనంసాక్షి) :** భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. బోనాలు, మొహరం పండుగల సందర్భంగా బుధవారం ఆయన డబీర్ పుర, లాల్ దర్వాజ ప్రాంతాల్లో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... భక్తులకు ఎలాంటి ఆసౌకర్యాలు కలగకుండా పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని తెలిపారు. శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని జోనల్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భక్తులు కూడా పరిశుభ్రతను పాటించాలని, వ్యర్థాలు నిర్దేశించిన ప్రదేశాలలో పారవేయాలని కమిషనర్ భక్తులను కోరారు. కమీషనర్ వెంట జోనల్ కమీషనర్ వెంకన్న, డిసిఏఎం అండ్ హెచ్ఓ తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికే భూభారతి

- యాచారం తహసీల్దార్ అయ్యప్ప



**యాచారం, జూన్ 11 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూ భారతి చట్టంతో భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని యాచారం తహసిల్దార్ అయ్యప్ప అన్నారు. బుధవారం మండలంలోని గున్గల్ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తు లను స్వీకరించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ. భూ సమస్యలున్న ప్రతి ఒక్క రైతూ రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ధరణి బదులు భూభారతిని తీసుకొచ్చిందన్నారు. రెవెన్యూ సదస్సుల ద్వారా గ్రామాల్లో ఏ రకమైన భూ సమస్యలు ఉన్నాయనే అంశాలను తెలుసుకోవడానికి ప్రభుత్వం వీటిని నిర్వహిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ రామకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ పవన్, పిఎసిఎస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీలు శ్రీనివాస్ రెడ్డి, గజ్జి రామకృష్ణ యాదవ్, కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, మచ్చ లక్ష్మణ్, కాశమల యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడమే లక్ష్యం

**శేరిలింగంపల్లి, జూన్ 11 (జనంసాక్షి) :** భారతదేశ చరిత్రలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాల అమలులో ఒక విప్లవాత్మక అడుగు అని, తెలంగాణ రాష్ట్రం ఘనమైన అభివృద్ధిని సాధించాలంటే కాంగ్రెస్ పార్టీని ప్రజలు కడుపులో పెట్టి చూసుకోవాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి వాలీదాస్ జగదీశ్వర్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నూతనంగా నియమితులైన నేపథ్యంలో బుధవారం రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను జిహెచ్ఎంసి స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు వాలిదాసు గాంధీభవన్ లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలతోపాటు శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధి కోసంసైతం తమచిత్తశుద్ధిని చాటుకుంటుందని జగదీశ్వర్ గౌడ్ భరోసాను వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనను కొనసాగిస్తూ ఓవైపు సమస్యల పరిష్కారానికి కృషిచేస్తూనే మరోవైపు తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తుందన్నారు. చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రేటర్ హైదరాబాద్ ఓ ప్రత్యేకతను సంతరించుకుంటే గ్రేటర్ హైదరాబాద్ లోనే మరింత ప్రత్యేకత కలిగిన నియోజకవర్గంగా శేరిలింగంపల్లి నిలిచిందన్నారు. సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీ నిర్మాణంలో, పార్టీ ఆశయాలను ప్రజలకు చేరవేయడంలో కాంగ్రెస్ పార్టీ క్రియాశీల కార్యకర్తగా తానెప్పుడూ ముందుంటానని వాలిదాసు వివరించారు. కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను, పార్టీ నిర్ణయాల పట్ల అంకిత భావాన్ని గుర్తించిన అధిష్టానం తనకు టిపిసిసి ప్రధాన కార్యదర్శిగా అవకాశాన్ని కల్పించిన తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి తదితరుల నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం తిరుగులేని అభివృద్ధిని సాధిస్తుందని, ప్రజా సంక్షేమ పథకాల అమలులో తమ వంతు ఉడతా భక్తిని ప్రదర్శిస్తూ పథకాలను



ప్రజల్లోకి తీసుకు వెళ్లడానికి తన వంతు ప్రయత్నాన్ని నిజాయితీగా కొనసాగిస్తానని వాలిదాసు ధీమాను వ్యక్తం చేశారు.

## చింతలబస్తీలో హైడ్రా చర్యలు

- నాలాల ఆక్రమణలు తొలగింపు



**హైదరాబాద్, జూన్ 11 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలో నాల విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. బుధవారం చింతలబస్తీలో నాలా ఆక్రమణలను హైడ్రా తొలగించింది. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 వద్ద ఉన్న కల్వర్టుకు చింతల బస్తీ వైపు ఆక్రమణలు జరిగాయి. మొత్తం 15 మీటర్ల వెడల్పు కల్వర్టు కింద ఉండగా చింతలబస్తే వైపు 7 మీటర్ల మేర కబ్జా జరిగినట్టు నిర్ధారణకు వచ్చిన హైడ్రా అధికారులు ఆక్రమణలను తొలగాంచారు. ఇసుక, చిన్న సిమెంట్ దుకాణంతో పాటు కల్లు కాంపౌండ్ రేకుల షెడ్డు ను తొలగించారు. పింఛను ఆఫీసు వద్ద ఉన్న కల్వర్టు ను పూర్తి స్థాయిలో హైడ్రా విస్తరిస్తోంది. శంకర్పల్లిలోని బుల్కాపూర్ చెరువు నుంచి మొదలై నాగులపల్లి, పుప్పాలగూడ, మణికొండ, దర్గా, మేహిదీపట్నం, బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12, చింతలబస్తి, తుమ్మలబస్తీ మీదుగా హుస్సేన్ సాగర్ కలిసే చారిత్రక బుల్కాపూర్ నాలా సాఫీగా సాగేందుకు హైడ్రా చర్యలు తీసుకుంటోంది.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
12 జూన్ 2025

# ఆయిల్‌ఫామ్ సాగులో జిల్లాను ఆదర్శంగా నిలపాలి

- ఆయిల్‌ఫామ్ సాగుకు రైతులు ముందుకు రావాలి
- కలెక్టర్ రాహుల్ రాజ్

**శివ్వంపేట, జూన్ 11 (జనంసాక్షి) :** ఆయిల్ పామ్ సాగుకు మన జిల్లా అనుకూలంగా ఉందని ఐఐఓపిఆర్ ఆయిల్ పామ్ పరిశోదన స్థానం, పెదవేగి శాస్త్రవేత్తలు జిల్లాను 2023-24 సంవత్సరంలో సందర్శించి, దృవీకరించగా ఆ సంవత్సరం నుంచి మన జిల్లాలో ఆయిల్ పామ్ పంటను ప్రోత్సహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ స్పష్టం చేశారు. బుధవారం అయిన శివ్వంపేట మండలం సీతారాం తండా గ్రామపంచాయతీ పరిధిలో పర్యటించి, ఆ తాండాకు చెందిన బానోత్ సోని, భానోత్ రవి లు ఆయిల్ ఫామ్ సాగు చేయడానికి ముందుకు రాగా, కలెక్టర్ వారి వ్యవసాయ క్షేత్రంలో పర్యటించి, ఆయిల్‌ఫామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలో 2024 సంవత్సరంలో 78 మంది రైతులు 336 ఎకరాలలో, 2024-25 సంవత్సరంలో 152 రైతులచే 533 ఎకరాల ఆయిల్ పామ్ సాగు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే 2025-26 సంవత్సరానికి జిల్లాకు 2500 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేయుటకు ప్రణాళికా చేసుకోవడం జరిగిందని, అందులో భాగంగానే ఇప్పటివరకు 1545 ఎకరాలల్లో ఆయిల్ ఫామ్ సాగు కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందని కలెక్టర్ గుర్తు చేశారు. రైతులకు మొక్కలు సరాఫరా చేయుటకు ఎం. ఎస్. లివ్ పామ్ రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపనీ వారు నిజాంపేట్ మండలంలో చల్మెడ గ్రామంలో 40 ఎకరాల స్థలంలో నర్సరీని స్థాపించడం జరిగిందని ఆయన తెలిపారు. జిల్లా లో ఉద్యాన



శాఖ ద్వారా ఆయిల్ పామ్ సాగు చేపట్టే రైతులకు మొక్కలపై రూ. 11,001ల రాయితితో పాటు నాలుగు సంవత్సరములు తోట నిర్వహణకు, అందులో అంతర పంటల సాగు కొరకు ఎకరాకు సంవత్సరానికి రూ.4,200 లు, చొప్పున మొత్తంగా రూ.16,800లు రాయితీ సొమ్మును రైతుల ఖాతాకు జమ చేయడం జరుగుతుందని కలెక్టర్ గుర్తు చేశారు. ఆయిల్ ఫాం సాగు ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయాన్ని అందిస్తుందన్నారు. శివంపేట మండలం రత్నాపూర్ గ్రామంలో బానోత్ సోని, భానోత్ రవి నాయక్ లు వారికున్న 7 ఎకరాల 30 గుంటల పొలంలో ఆయిల్ ఫామ్ సాగు చేయడానికి ముందుకు వచ్చినందుకు ఉద్యానవన, వ్యవసాయ శాఖ తరపున వారిని కలెక్టర్ అభినందించారు. ఇదే స్ఫూర్తిగా తీసుకొని జిల్లాలో పెద్ద ఎత్తున ఆయిల్ ఫామ్ సాగు చేయడానికి రైతులు ముందుకు రావాలని కలెక్టర్ సూచించారు. జిల్లావ్యాప్తంగా రైతులు అత్యధిక శాతంలో వరి పండిస్తారని, పంట మార్పిడి చేయకుండా వరి పండించడం వల్ల దిగుబడిలో వ్యత్యాసాలు వచ్చి రైతులకు ఆశించిన ఆదాయం రావడం లేదన్నారు. పంట మార్పిడి చేపట్టినట్లయితే భూమి సారవంతమై ఆదాయాలు మెండుగా ఉంటాయన్నారు. జిల్లా లో ఆయిల్ ఫామ్ మొక్కలతో పాటు, డ్రిప్ సిస్టం, ఆయిల్ ఫామ్ నిర్వహణకు సబ్సిడీ అందిస్తుందన్నారు. రత్నాపూర్, సీతారాం తండాలో రైతులు 7. 30 ఎకరాల భూమిలో ఆయిల్ ఫామ్ గాను 428 మొక్కలు నాటడం జరిగిందన్నారు. ఇందుకుగాను 02 లక్షల 90 వేల రూపాయల సబ్సిడీ మూడు సంవత్సరాల్లో మంజూరు అవుతుందన్నారు. ఆయిల్ ఫాం సాగుకు ఒక ఎకరాకు లక్షన్నర నికర ఆదాయం చేకూరుతుందన్నారు. ఇదేవిధంగా ఏడెకరాలలో ఆయిల్ ఫామ్ సాగు చేసినట్లయితే 10 లక్షల ఆదాయం చేకూరుతుందన్నారు. ఇప్పుడు వేసిన ఆయిల్ ఫామ్ పంటను మూడు సంవత్సరాలు జాగ్రత్తగా కాపాడుకుంటే నాలుగో సంవత్సరం నుంచి మంచి గిట్టుబాటు ధర ఆదాయం చేకూరుతుందన్నారు. ఆయిల్ ఫాం పంటను జిల్లాలో అధిక మొత్తంలో సాగు చేయాలని, మండల వ్యవసాయ అధికారులు రైతుల దగ్గరకు వెళ్లి ఆయిల్ పంట యొక్క పూర్తి వివరాలను రైతులకు అవగాహన కల్పించాలని తద్వారా రైతులందరూ ఆయిల్ ఫామ్ సాగుకు ముందుకు రావాల అన్నారు. రైతుల అభ్యున్నతి రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకొని సుస్థిర వ్యవసాయం దిశగా అడుగులు వేస్తూ ముందుకు పోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి వినయ్, ఏడీఏ సంధ్యారాణి, ఆయిల్ ఫామ్ కంపెనీ సీఈవో వీరారెడ్డి, మండల వ్యవసాయ అధికారి లావణ్య, మాజీ సర్పంచ్ సోనీ రవి నాయక్, వ్యవసాయ విస్తరణ అధికారులు మౌనిక, ఆయిల్ ఫామ్ సిబ్బంది, రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలి

- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 11 (జనం సాక్షి) :** ఇంటర్ విద్యలో విద్యార్థుల సంఖ్య పెంచాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రశేఖర్ ఇంటర్ బోర్డు అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్ విద్య అధికారులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇంటర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని, డ్రాప్ అవుట్స్ తగ్గించాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నమోదును పెంచడానికి కార్యాచరణ చేయాలన్నారు.పదవ తరగతి ఉత్తీర్ణులైన పాఠశాల విద్యార్థుల సమాచారాన్ని డిఐఈఒ అధికారులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ కు చేరవేయాలని అన్నారు. విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించాలని సంగారెడ్డి పట్టణంలోని ఎస్సీ ఎస్టీ, బీసీ హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అన్నారు. జూనియర్ కళాశాలల సిబ్బంది ద్వారా ప్రవేశాలను వేగవంతం చేయాలనీ పేర్కొన్నారు.బాల్య వివాహాల కారణంగా, పదకొండవ తరగతి నుండి పన్నెండో తరగతి వరకు చదువు మధ్యలో మానేయడం పెరుగుతోందనీ దాన్ని నిరోధించాలని అన్నారు. ప్రిన్సిపల్స్ డ్రాప్ అవుట్ సర్వే నిర్వహించి కారణాలను సమర్పించవలసిందిగా ఆదేశించారు. మౌలిక సదుపాయాలు అవసరమయ్యే కళాశాలలలో జహీరాబాద్, ఝర్ఝెరా, కల్హేర్, నారాయణఖేడ్, కోహీర్, జోగిపేట్, హద్నూర్, పుల్కల్, న్యాల్కల్, పటాన్చెరు, సంగారెడ్డి(బాలుర), సదాశివపేటలలో త్వరిత గతిన మౌలిక సదుపాయాలు కల్పించాలని పిలుపునిచ్చారు. అక్షయ పాత్ర ఫౌండేషన్ నుండి ఎం డి ఎం పథకం ఖచ్చితంగా నమోదును మెరుగుపరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి గోవింద్ రావు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ సంబందిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భూ సమస్య పరిష్కారానికి భూ భారతి

- తహసీల్దార్ నాగజ్యోతి



**నిజాంపేట్, జూన్ 11 (జనం సాక్షి) :** రైతుల భూ సమస్యలు పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం భూభారతి ప్రవేశపెట్టిందని నిజాంపేట్ తాహసిల్దార్ నాగజ్యోతి అన్నారు. బుధవారం నిజాంపేట్ మండలంలోని ముంగేపల్లి గ్రామంలో భూభారతిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ రైతులకు ఈ సమస్యలు ఉంటే భూభారతి ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ జాన్సన్, కాంగ్రెస్ నాయకులు మీస్కిన్, గంగాధర్, కిషన్ ,బాబా పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలి



**తూప్రాన్, జూన్ 11 (జనం సాక్షి) :** ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలని తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి తెలిపారు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ఉత్తర్వులను సందర్భంగా మాట్లాడారు ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పల్లెర్ల రవీందర్ గుప్తా, మాజీ కౌన్సిలర్లు జిన్నా భగవాన్ రెడ్డి, బాణాపురం రాజు, తూప్రాన్ పట్టణ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మామిండ్ల కృష్ణ, బజారు విశ్వరాజ్, నాగరాజు గౌడ్, కుమ్మరి రఘుపతి, ఎండి ఉమర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు ప్రజలు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఉద్యోగుల సమస్యలపై ఐక్యంగా పోరాడాలి

- జిల్లా జేఏసీ చైర్మన్ మొహమ్మద్ జావిద్ అలీ
- రాష్ట్ర సంఘం అధ్యక్షులు దాస్య నాయక్

**సంగారెడ్డి టౌన్, జూన్ 11 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర నాలుగో తరగతి ఉద్యోగుల స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు మహమ్మద్ షరీఫ్ , కార్యదర్శి నాగరాజు అద్వర్యంలో బుధవారం సంగారెడ్డి పట్టణంలోని సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సంగారెడ్డి జిల్లా జేఏసీ (జాయింట్ యాక్షన్ కమిటీ) చైర్మన్ మొహమ్మద్ జావిద్ అలీ, తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల రాష్ట్ర సంఘం అధ్యక్షులు దాస్య నాయక్ హాజరై, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "నాలుగవ తరగతి ఉద్యోగులు ప్రభుత్వ యంత్రాంగానికి స్థంభంలాంటివారు. వీరి కృషి లేకుండా ఎలాంటి పాలన ముందుకు సాగదని టీఎన్జీవో ఉద్యోగులు, నాలుగవ తరగతి ఉద్యోగులు ప్రభుత్వ విధానాలకు దగ్గరగా ఉండి ప్రజలకు సేవలందిస్తున్నామని అభివృద్ధికి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉండాలని అన్నారు. ఉద్యోగుల సమస్యలపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సంగారెడ్డిలో సంఘ కార్యాలయం నిర్మించుటకు తన వంతు కృషి చేస్తానని అయన తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు దాస్య నాయక్ మాట్లాడుతూ నాలుగో తరగతి ఉద్యోగులకు సంబంధించిన సమస్యలపై రాష్ట్ర స్థాయిలో నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ



పెన్షన్ స్కీమ్) రద్దు, పదోన్నతులు, ఖాళీ పోస్టుల భర్తీ, నియామక ప్రక్రియలు, మరియు పెండింగ్‌లో ఉన్న బిల్లుల క్లియరెన్స్ వంటి అంశాలను ప్రాధాన్యతగా తీసుకొని ప్రభుత్వంతో చర్చలు కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వానికి నివేదికలు సమర్పించడం, మంత్రి స్థాయిలో సమావేశాలు నిర్వహించడం ద్వారా సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాదర్ బిన్ హసన్, కోశాదికారి ధనరాజ్, టి.ఎన్.జి.ఓ కార్యదర్శి రవి, అసోసియేట్ అధ్యక్షులు కసిని శ్రీకాంత్ వెంకటరెడ్డి, కోశాధికారి శ్రీనివాస్ తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు ప్రమోద్, వెంకటేష్, యాదవ్ రెడ్డి , నాలుగో తరగతి ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్ వద్ద భద్రత పటిష్టంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్



**గద్వాల నడిగడ్డ, జూన్ 11 (జనం సాక్షి) :** ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత పటిష్టంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. బుధవారం జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గల గోదాములో ఎలక్ట్రిక్ ఓటింగ్ మిషన్లు లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ ను జిల్లా కలెక్టర్ సంతోష్ సంబంధిత అధికారులు,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సాధారణ తనిఖీలో భాగంగా కలెక్టర్ ఈ తనిఖీ నిర్వహించారు. గద్వాల జిల్లాకు సంబంధించిన ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ తో పాటు భద్రత నిర్వహణను పరిశీలించారు.ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్ నిర్వహణకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు.స్ట్రాంగ్ రూమ్ భద్రతలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనితీరును పరిశీలించారు.ఈ కార్యక్రమంలో గద్వాల తహసిల్దార్ మల్లికార్జున్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ కరుణాకర్,సురేష్,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నీట మునిగే లోతట్టు ప్రాంతాలలో చర్యలు చేపట్టండి

**జడ్చర్ల, జూన్ 11 (జనం సాక్షి) :** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో వర్షపు నీట మునిగే లోతట్టు ప్రాంతాలలో చర్యలు తీసుకోవాలని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ అన్నారు. రానున్న వర్షాకాల నేపథ్యంలో మున్సిపాలిటీ పరిధిలో



జలమయమయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి మరమ్మత్తులు చేపట్టాలని బీసీ జాగృతి సేన ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్ మహబూబ్ అలీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ యాదవ్ మాట్లాడుతూ బాదేపల్లి నల్లకుంట చిన్నపాటి వర్షాలకే నిండి వర్షం వచ్చిన ప్రతిసారి నల్లకుంట నీరు అమర్ కృష్ణ లాడ్జ్ ఎదురుగా నిలిచి చెరువును తలపిస్తూ ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని, సంబంధిత అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు తప్ప శాశ్వత పరిష్కారం చేయడం లేదని, అందుకు సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ఇట్టి సమస్య పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని, అలాగే మున్సిపాలిటీ పరిధిలో లోతట్టు ప్రాంతాలను గుర్తించి వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీ లను మెరుగుపరిచి వర్షపు నీరు రోడ్లపై చేరకుండా చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ జాగృతి సేన మండల అధ్యక్షుడు గొడుగు నర్సిములు, కార్మిక విభాగం, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సురభి విజయ్ కుమార్, రైతు విభాగం జిల్లా అధ్యక్షులు కుర్వగడ్డ పల్లి గోపాల్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు గంగాపూర్ భీమరాజ్, మండల ప్రచార కార్యదర్శి కావాలి రాములు, పట్టణ అధ్యక్షులు శివరాములు, పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, చంద్రమౌళి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# 60 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు పూర్తి



**తూప్రాన్, జూన్ 11 (జనం సాక్షి) :** భూ సమస్యల పరిష్కారమే దేవుని సదస్సుల లక్ష్యమని తూప్రాన్ డివిజన్లో ఇప్పటివరకు 60 గ్రామాలలో జరిగిన రెవెన్యూ సదస్సులలో 3441 దరఖాస్తులు వచ్చినట్లు తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి తెలిపారు. తూప్రాన్ మండలం లోని నాగులపల్లీ, మాసాయిపేట మండలంలో అచ్చంపేట గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను సందర్శించారు. భూ సమస్యల పరిష్కారానికి వచ్చిన రైతులు మరియు ప్రజలతో మాట్లాడుతూ, వారు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. అలాగే ఎవ్వరూ భూ సమస్యల పట్ల ఆందోళన పడొద్దని, అందరి భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. సదస్సులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి వచ్చే దరఖాస్తులను పరిశీలించి , వారి భూ సమస్యలు పరిష్కరించేలా తగిన సూచనలు , సలహాలను ఇచ్చారు. సదస్సులో వచ్చే రైతులు , గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కనీసవసతులైన త్రాగు నీరు, కుర్చీలు ఉండే విధంగా చూడాలని ఆదేశించారు.

# ప్రజా వైద్యం కోసం 13న బీజేపీ 24 గంటల నిరాహార దీక్ష

- ప్రజలకు వైద్యం దూరం చేయడమేనా ప్రజాపాలన
- ఆస్పత్రిలేని జిల్లా కేంద్రంగా మార్చారు
- జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్

**నారాయణపేట జిల్లా ప్రతినిధి, జూన్ 11 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అంటూ ప్రజలకు వైద్యం అందకుండా చేసిందనీ నారాయణపేట జిల్లా బిజెపి అద్యక్షుడు సత్య యాదవ్ విమర్శించారు.బుధవారం నారాయణపేట ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిజెపి జిల్లా కోశాధికారి సిద్ది వెంకట్ రాములు,జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ,జిల్లా మహిళా మో ర్చా అధ్యక్షులు లక్ష్మి శ్యామ్ సుందర్ గౌడ్ తో కలిసి మాట్లాడుతు జిల్లా ఆస్పత్రిని తరలించడాన్నీ తప్పు పట్టడం లేదని ఇందులో ఎలాంటి రాజకీయం లేదని అన్నారు.జిల్లా కేంద్రంలో ఉన్న ఆస్పత్రిని తరలించినప్పుడు దాదాపు 60 వేల జనాభా ఉన్న జిల్లా కేంద్రంలో ప్రత్యామ్నాయ ఏర్పాటు ఎందుకు చేయలేదనీ ప్రశ్నించారు.దాంతో పట్టణ ప్రజలు వైద్యానికి దూరమయ్యారనీ అందరూ ప్రైవేట్ ఆస్పత్రులకు వేల రూపాయలు ఖర్చు చేసుకుంటున్నారని అన్నారు.అభివృద్ధి విషయంలో బిజెపి ఎల్లవేళలా సహకరిస్తుందని ప్రజలకు ఇబ్బందులు కల్పిస్తే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.పట్టణంలో ప్రత్యామ్నాయ




ఏర్పాటు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు.ముందు ప్రత్యామ్నాయం చూపి ఆస్పత్రిని తరలించాల్సి ఉందన్నారు జిల్లా కేంద్రానికి 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న మెడికల్ కాలేజీ కి ఆస్పత్రిని తరలించి అక్కడ ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా ఈ ప్రజా పాలన ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నదని విమర్శించారు.సి ఎం.సొంత జిల్లాలో ఆస్పత్రి లేని పరిస్థితి దాపురించిందని అన్నారు.కేంద్ర ప్రభుత్వం బస్తీ దవాఖానలు,పల్లె దవాఖానలు ఏర్పాటు చేసి ప్రజల ముంగిటికి వైద్యం తీసుకు వస్తుంటే జిల్లా కేంద్రంలోనే ఈ ప్రజా ప్రభుత్వ పాలన వైద్యం లేకుండా చేసిందనీ విమర్శించారు.జిల్లా ఆస్పత్రికి బిజెపి వ్యతిరేకం కాదని అక్కడ ఎలాంటి సౌకర్యాలు లేవని అన్నారు.మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవానికి సి ఎం వచ్చిన కనీసం కిలో మీటర్ రోడ్డు వేయక పోవడం విడ్డూరంగా ఉందన్నారు.అలాంటి కాలేజీలో జిల్లా ఆస్పత్రి ఏర్పాటు చేసి ప్రజలకు ఏలాంటి వైద్యం అందించాలని అనుకుంటున్నారని ప్రశ్నించారు.పట్టణంలో ఆస్పత్రి ఉన్నపుడు రోజుకు వంద వరకు కాన్పులు అవుతుంటే నేడు 5 కాన్పులు జరగడం లేదని అన్నారు.అలాగే ఓ పి రోగులు ఇక్కడ 5,6 వందల మంది ఉంటే అక్కడ వంద మందికి దాటడం లేదన్నారు రోడ్డు సౌకర్యం లేక విద్యుత్ దీపాలు లేక రోగులు అవస్థలు పడి వైద్యం కోసం వెళ్లాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు.ఇది వర్షాకాలం కావడంతో రోగులు ఆస్పత్రికి వెళ్లలేని పరిస్థితి నెలకొన్నదనీ అన్నారు.ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాల్సిన రోగులను ప్రైవేట్ ఆస్పత్రులకు దారి మళ్లిస్తున్నారనీ అన్నారు.గుడ్డిగా ఆస్పత్రిని తరలించడం సరికాదని అన్నారు. వెంటనే జిల్లా కేంద్రంలో ఏరియా ఆస్పత్రినీ ఏర్పాటు చేయాలని, ప్రాథమిక ఆరోగ్య చికిత్సలకు,గర్భిణీలకు స్కానింగ్ సెంటర్స్ ఏర్పాటు చేయాలని,చిన్న పిల్లలకు వైద్యం కల్పించాలని,జిల్లా ఆస్పత్రికి 24 గంటలు అంబులెన్స్ సౌకర్యం ఉండాలనీ,జిల్లా కేంద్రంలో వెంటనే యుద్ధ ప్రాతిపదికన ఆస్పత్రి నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు.ఈ డిమాండ్లతో ఈ నెల 13న జిల్లా కేంద్రంలో బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నాగురావు నామాజీ ఆధ్వర్యంలో 24 గంటల సత్యాగ్రహ దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ దీక్షలో ప్రజలు అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

# నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వాడొద్దు




**జడ్చర్ల, జూన్ 11 (జనం సాక్షి) :** నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వాడొద్దని, ఎవరైనా వాడితే కఠిన చర్యలతో పాటు జరిమానా విధిస్తామని జడ్చర్ల మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఒక మార్పు అభివృద్ధికి మలుపు 10వ రోజు బుధవారం మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి తో కలిసి 14వ వార్డులో మహిళలకు నిషేధిత ప్లాస్టిక్ కవర్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని ప్లాస్టిక్ బ్యాగులను ప్రభుత్వం నిషేధించిందని, నిషేధిత కవర్లు వాడితే జరిమానాలు విధిస్తామని, ఈ కవర్లతో పర్యావరణానికి వాటిల్లుతుందన్నారు. 40 మైక్రాన్ల కంటే తక్కువ మందంగాల ప్లాస్టిక్ కవర్లు వాడితే రూ.100 నుంచి 5వేల వరకు జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. ముందుగా వార్డులో ర్యాలీ నిర్వహించి తడి, పొడి చెత్త పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఐదేండ్లలోపు పిల్లలలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

- అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు చదువుతోపాటు పోషణ
- హన్మకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- ములుకనూరులో అమ్మ మాట-అంగన్వాడీ బాట కార్యక్రమం ప్రారంభం



**భీమదేవరపల్లి, జూన్ 11 (జనంసాక్షి) :** ఐదేళ్లలోపు ఉన్న చిన్నారులను అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూర్ లోని ఐదో అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యంలో అమ్మ మాట -అంగన్వాడీ బాట కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. అంగన్వాడీ కేంద్రంలో చదువుతున్న చిన్నారుల తల్లులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. చిన్నారులు పాటలు, నేర్చుకున్న పాఠ్యాంశాలను చెప్పారు. అంగన్వాడీ టీచర్ శోభారాణి అంగన్వాడీ పాఠశాలలో చేపట్టిన వివిధ కార్యక్రమాలను కలెక్టర్ కు వివరించారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేందుకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అదేవిధంగా అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారుల నమోదు శాతాన్ని పెంచేందుకు అమ్మ మాట-అంగన్వాడి బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 0-5 సంవత్సరాల చిన్నారులు అంగన్వాడి కేంద్రాలలో చేర్పించాలని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో చదివే చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులకు చదువుతో పాటు సరైన పోషణ ఆహారాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. పాఠ్య పుస్తకాలు ప్రభుత్వం పంపిణీ చేస్తున్నామన్నారు. చిన్నారులు ఇష్టపడే పౌష్టికాహారాన్ని అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడి టీచర్లకు వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్నారుల అసలైన బరువును అంగన్వాడీ టీచర్లు తెలియజేయాలన్నారు. అసలైన బరువు తెలిస్తే వాళ్లకు పౌష్టికాహారం ఎంత అందించవచ్చు అనేది తెలుస్తుందన్నారు. పిల్లల బరువు, ఎత్తు గురించి అంగన్వాడి టీచర్లు, చిన్నారుల తల్లిదండ్రులు దృష్టి పెట్టాలన్నారు. సమావేశం అనంతరం అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులతో కలిసి జిల్లా కలెక్టర్ భోజనం చేశారు. అంగన్వాడి కేంద్రం ఆవరణలో కలెక్టర్ మొక్క నాటి నీళ్లు పోశారు. ఇదే ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు స్కూల్ యూనిఫామ్స్ కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జయంతి, స్థానిక తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం, కార్యదర్శి పూర్ణచందర్, ఇతర అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.



## పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు ప్రారంభానికి సిద్ధంగా ఉండాలి..

- మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

**మహబూబాబాద్ ప్రతినిధి, జూన్ 11 (జనం సాక్షి) :** పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు ప్రారంభానికి సిద్ధంగా ఉండాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. గూడూరు మండలంలోని మట్టేవాడ ఆశ్రమ పాఠశాల అంగన్వాడీ కేంద్రం రెవెన్యూ సదస్సును మహబూబాబాద్ పట్టణంలోని ఇందిరా నగర్ అంగన్వాడి కేంద్రం ప్రైమరీ స్కూల్ లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వేసవి సెలవుల అనంతరం విద్యాసంస్థలు అంగన్వాడి కేంద్రాలను పునర్ ప్రారంభం కానున్న నేపథ్యంలో వారం రోజులుగా (మిషన్ మూడ్) యుద్ధ ప్రాతిపదికన ప్రత్యేక అధికారులతో విద్యాసంస్థలు అంగన్వాడి కేంద్రాలను సానిటేషన్ పరిశుభ్రత విద్యుత్ ఫ్యాన్స్ టేబుల్స్ టాయిలెట్స్ క్లాస్ రూమ్స్ బ్లాక్ బోర్డ్ యూనిఫార్మ్ తదితర అన్ని సౌకర్యాలను సిద్ధం చేస్తూ ఒక పండుగ వాతావరణం లో పాఠశాలలను ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మేరకు బడిబాట కార్యక్రమం వాడవాడ గ్రామ గ్రామాన నిర్వహిస్తూ ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధనలు అందిస్తున్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు పిల్లలకు అవగాహన కల్పిస్తున్నామని ప్రభుత్వ పాఠశాలలు విద్యాసంస్థలలో అంగన్వాడీ కేంద్రాలలో నాణ్యమైన బలవర్ధకమైన ఆహారాన్ని మధ్యాహ్నం భోజనంగా అల్పాహారంగా న్యూట్రిషన్ ఫుడ్ అందించడం ద్వారా ప్రభుత్వ సంస్థలలో హాజరు శాతం పెంచేందుకు ప్రత్యేక అధికారులు హెచ్ఎంలు కాంప్లెక్స్ ఇన్చార్జులు ప్రతి ఒక్కరు ఒక ఉద్యమ రూపంలో క్షేత్రస్థాయిలో పనిచేస్తూ ఉన్నారని అన్నారు అంగన్వాడీ కేంద్రాలలో పౌష్టిక ఆహారం అందిస్తూ పిల్లల లెర్నింగ్ లెవెల్స్, శారీరక ఎదుగుదల మానసిక ఎదుగుదల అంశాలపై దృష్టి పెట్టాలని అంగన్వాడి టీచర్స్‌లకు ఆదేశాలు జారీ చేశామని, క్లాస్ రూమ్ లను పరిశుభ్రంగా ఉంచాలని మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలకు విద్యను అందించాలన్నారు గూడూరు ఎస్సై గిరిధర్ రెడ్డి ఆధ్వర్యంలో మట్టేవాడ మదనాపురం గ్రామా రెవెన్యూ రైతు సదస్సుల వద్ద స్థానిక పోలీసు బృందాలతో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి జిల్లా వెల్ఫేర్ అధికారిని ధనమ్మ సిడిపిఓలు నిలోఫర్ శిరీష గూడూరు డిప్యూటీ తాసిల్దార్ కోమలారెడ్డి విద్యాసంస్థల హెచ్ఎంలు అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్ఆర్‌సి జిల్లా ప్రధాన కార్యదర్శిగా వేల్పుల మహేందర్



**మల్హర్, జూన్ 11(జనంసాక్షి) :** జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) రాష్ట్ర అధ్యక్షులు మొగుళ్ళ భద్రయ్య ఆదేశాల మేరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శిగా మలహర్ మండలానికి చెందిన వేల్పుల మహేందర్ ను నియమించామని జిల్లా అధ్యక్షులు దుంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో రాష్ట్ర కమిటీ అదేశాల మేరకు పని చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఎన్ హెచ్ ఆర్ సి. జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన వేల్పుల మహేందర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండల కమిటీలతో పాటు గ్రామ కమిటీలను కూడా పూర్తి చేస్తామని, సమస్యల పరిష్కారంలో పేద ప్రజల పక్షాన కృషి చేస్తానని స్పష్టం చేశారు. తనకు ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు మొగుళ్ళ భద్రయ్య కు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట రాజయ్య, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోటగిరి సతీష్, రాష్ట్ర కమిటీ సభ్యులు దయ్యాల సదయ్య, మంత్రి రాకేష్, టి రవికుమార్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు దుంద్ర కుమార్ యాదవ్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.


## ఆయిల్ పామ్ కొనుగోలు కేంద్రం ప్రారంభం



**నర్సంపేట, జూన్ 11 (జనం సాక్షి) :** ఆయిల్ పామ్ కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తో కలసి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రారంభించారు. ఆయిల్ ఫామ్ సాగు 6000 ఎకరాలు వరకు ఉందని, ఇంకా రైతులు ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలని కోరారు. మార్కెట్ సమస్య, దళారుల సమస్య, కోతుల సమస్య, ధరల సమస్య లేనటువంటి పంట ఆయిల్ పామ్ దీనికి రాష్ట్ర ప్రభుత్వం రాయితీలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పెద్ద రైతులు ఎత్తున సాగు చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ప్రతి ఏడాది స్థిరమైన ఆదాయం వచ్చే విధంగా రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలన్నారు. ఆయిల్ ఫామ్ పండించి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందిన రైతులను ఆదర్శంగా తీసుకొని రైతులు ముందుకు వచ్చి ఆయిల్ ఫామ్ సాగు చేయాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, రామ్ చరణ్, ఆయిల్ ఇండస్ట్రీస్ జిఎం నారాయణ, డిహెచ్ఎస్ వో జి అనసూయ, ఉద్యాన అధికారులు జ్యోతి తిరుపతి, రాకేష్, రైతులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌ను కలిసి భరత్ కుమార్ రెడ్డి

**మహబూబాబాద్ ప్రతినిధి, జూన్ 11 (జనం సాక్షి):** హైదరాబాద్ బంజారాహిల్స్ లోని కెసిఆర్ నివాసంలో బుధవారం మాజీ సీఎం కేసీఆర్‌ను మాజీ మంత్రి కేటీఆర్‌ను పార్టీ రాష్ట్ర నాయకులు బీరవెల్లి భరత్ కుమార్ రెడ్డి రాష్ట్ర మాజీ కార్పొరేషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు మర్యాద పూర్వకంగా కలిసారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసిన కేసీఆర్ పై ఎన్ని అక్రమ నోటీసులు పంపిన కెసిఆర్ ను ఏమి చేయలేరని ఇప్పటికైనా నీతిమాలిన రాజకీయాలు మాని రాష్ట్ర అభివృద్ధికి ఆలోచన చేయాలని వారు విమర్శించారు.



# సన్న బియ్యం పంపిణీ దేశానికే ఆదర్శం

- ఇందిరమ్మ రాజ్యంలోనే పేదల స్వంత ఇంటి కల సాకారం
- స్టేషన్ ఘన్పూర్ ఎంఎల్ఏ కడియం శ్రీహరి




**స్టేషన్ ఘన్పూర్, జూన్ 11 ( జనం సాక్షి ) :** సన్న బియ్యం పంపిణీ దేశానికే ఆదర్శం అని, 13 వేల 500 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని 3 కోట్ల 10లక్షల మందికి ఒక్కొక్కరికి 6కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రంఅని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నా రు. పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత విద్యుత్, గృహ అవసరాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. వర్గీకరణకు చట్టభద్దత కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని, సుప్రీం కోర్టు తీర్పుకు లోబడి అన్ని రాష్ట్రాల కంటే ముందుగా స్పందించి షెడ్యూల్ కులాల వర్గీకరణ కు చట్టబద్ధత కల్పించిన రాష్ట్రం తెలంగాణ రాష్ట్రంఅని, బీసీ కులగణన జరగాలి, బిసిలకు సామాజిక న్యాయం దక్కాలి అని బీసీ కులగణన చేపట్టామని, జనాభా ప్రాతిపదికన సంక్షేమ ఫలాలు అందాలని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టభద్దత కల్పించాలని శాసన సభలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించామని, తెలంగాణ వల్లనే కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్త కులగణన చేపడుతోందని, కేంద్రానికి సామాజిక న్యాయం పట్ల చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 15మందితో కూడిన మంత్రి వర్గంలో 4 గురు దళిత ఉన్నారని, 4గురు మంత్రులతోపాటు శాసనసభ స్పీకర్ కూడా దళితుడేనని అన్నారు. 10ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో ఒక్కరే దళిత మంత్రి ఉన్నారని, ఉమ్మడిరాష్ట్రంలో కూడా దళితులకు ఈ స్థాయిలో ప్రాధాన్యత దక్కలేదని, కాంగ్రెస్ పార్టీద్వారానే సామాజిక న్యాయం సాధ్యమని, సామాజిక న్యాయంలో తెలంగాణ దేశానికే రోల్ మాడల్ అని అన్నారు. ప్రధాని బీసీ అయి ఉండి కూడా బిసిలకు ఒరుగబెట్టింది ఏమీ లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలఅధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్ రెడ్డి, నియోజక వర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాగజ్‌నగర్ శివాలయంలో దొంగతనం

- రూ.4 లక్షల విలువ చేసే వెండి నాగపడిగ చోరీ



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో జూన్ 11 ( జనం సాక్షి) :** దేవాలయాలే టార్గెట్ గా వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని బాలాజీ నగర్ లో గల శివాలయంలో మంగళవారం రాత్రి దొంగతనం జరిగింది. మంగళవారం నాడు రాత్రి 8 గంటల ప్రాంతంలో బలమైన ఈదురు గాలులు, వర్షం రావడంతో విద్యుత్ అధికారులు కరెంట్ సరఫరాను నిలిపివేశారు. సాయంత్రం వరకు పూజారి పూసాల బుచ్చయ్య పూజలు నిర్వహించి పక్కనే గల ఇంటికి వెళ్లిపోయారు. బుధవారం తెల్లవారుజామున 4 గంటల 30 నిమిషాల సమయంలో ఆలయ సమీపంలో గల ఇంటి యజమాని అశోక్ నిద్ర నుంచి మేల్కొని ఆలయం వైపు చూశాడు. దీంతో గుడి తలుపులు తెరిచి ఉన్నట్లు గమనించి ఆలయ పూజారి పూసల సాయిరాంకు సమాచారం అందించాడు. పూజారి సాయిరాం ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలం దేవాలయం సందర్శనకు వెళ్లారు. దీంతో పూజారి సాయిరాం తన తండ్రి బుచ్చయ్యకు దొంగతనం గురించి సమాచారం అందించారు. దీంతో బుచ్చయ్య ఈ విషయాన్ని ఆలయ నిర్వాహకులు బొలిశెట్టి మహేశ్వర్ కు సమాచారం ఇచ్చారు. ఆలయానికి చేరుకున్న మహేశ్వర్, మరి కొంతమంది ,పూజారి బుచ్చయ్యతో కలిసి పోలీసులకు సమాచారం కోసం డయల్ 100 కు సమాచారం అందించారు. వెంటనే స్థానిక పట్టణ పోలీసు అధికారి ఎస్ . హెచ్ . ఓ ప్రేమ్ కుమార్ పోలీసులతో కలిసి దేవాలయానికి చేరుకొని దొంగతనం గురించి ఆరా తీశారు. ఆలయంలోని శివలింగం పై గల 4 కిలో గ్రాముల వెండి నాగ పడిగ దొంగతనానికి గురైనట్లు వారు పోలీస్ అధికారి ప్రేమ్ కుమార్ కు వివరించినట్లు బొలిశెట్టి మహేశ్వర్, పూజారి బుచ్చయ్యలు తెలిపారు. ఈ వెండి పడిగ విలువ సుమారు రు .4 లక్షలు విలువ చేసి ఉంటుందని పేర్కొంటున్నారు. ఆలయంలో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ అవి పని చేయడం లేదని నిర్వాహకులు తెలిపారు. దీంతో పోలీసులు ఆలయ సమీపంలో గల ఇళ్లలోని సీసీ కెమెరాల ఆధారంగా దొంగతనానికి సంబంధించిన వివరాలు రాబట్టేందుకు పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. కాగా దొంగతనం 8 గంటల నుండి 9 గంటల రాత్రి ప్రాంతంలో జరిగి ఉంటుందని,, ఆలయం ముందు నుండి రోడ్డు గుండా కొందరు వ్యక్తులు కార్లలో ప్రయాణించగా తలుపులు తెరిచి ఉన్నట్లు వారు పేర్కొన్నట్లు ఆలయ నిర్వహకులు తెలిపారు. ఆలయ ప్రహరీ గోడ చిన్నదిగా ఉండడంతో దొంగతనానికి పాల్పడినవారు గోడ పైనుంచి దూకి, నేరుగా గర్భగుడి తాళాలు తగలగొట్టి, ఈ దొంగతనానికి పాల్పడ్డారు. కాగా ఆలయంలోని రెండు హుండీలు, బంగారు పుస్తెలు, మట్టెలు, శతగోపాలు దొంగతన%శీ% జరగలేదు. దీనిని బట్టి చూస్తే స్థానికంగా ఉన్నవారే ఈ దొంగతనానికి పాల్పడి ఉంటారని, పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గత మే నెల 2 వ తేదీన కాగజ్ నగర్ పట్టణంలోని కాపు వాడలో గల హనుమాన్ మందిర్, మండలంలోని బట్పల్లి గ్రామము గల హనుమాన్ మందిర్, దేహగం మండలంలోని బోర్లకుంట శ్రీ సీతారామ ఆంజనేయ స్వామి ఆలయంలో దొంగతనాలు జరిగాయి. కానీ వారం రోజుల వ్యవధి లోనే కాగజ్ నగర్ రూరల్ సిఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు దొంగతనం కేసును చేదించారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్యేకు మంత్రి పదవి వస్తే బిఆర్ఎస్, బిజెపి సంబరాలు ఏంటో?

- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ సాగర్ రావు



**మంచిర్యాల ప్రతినిధి జూన్ 11 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ఎమ్మెల్యేకు మంత్రి పదవి వస్తే మంచిర్యాల బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు సంబరాల్లో మునిగిపోవడం విచిత్రంగా ఉందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. బుధవారం మంచిర్యాల పట్టణంలోని మెయిన్ రోడ్ చౌరస్తా లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచిర్యాల లో బీజేపీ, బీఆరెస్ రెండు పార్టీలు మిలాఖత్ అయ్యాయని ఆరోపించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే మంత్రి పదవి వస్తే ఆ రెండు పార్టీలు తెగ సంతోషించడాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. మంచిర్యాల నియోజక వర్గానికి నేనే మంత్రి నేనే రాజు అని స్పష్టం చేశారు. ఎవరి జోక్యం ఇక్కడ అవసరం లేదని సూచించారు. మంచిర్యాల లోని ప్రధాన వీధుల సుందరీకరణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. వర్షాల ఆకటంకం లేకపోతే డిసెంబర్ నాటికి రోడ్ల విస్తరణ, భూగర్భ మురికి కాలువల నిర్మాణాలు పూర్తవుతాయని తెలిపారు. రోడ్లు విస్తారంగా ఉంటేనే భావితరాలకు అభివృద్ధి ని అందించిన వారం అవుతామన్నారు. కొంత మందికి రోడ్ల విస్తరణ లో నష్టం జరిగినా తర్వాత కాలంలో వ్యాపారాలు ఊపందుకుంటాయని తెలిపారు. విశ్వనాథ ఆలయం దుకాణాల సముదాయం కూల్చివేతకు అనుమతి లభించిందని గురువారం ఉదయం కూల్చివేతలు ఉంటాయని తెలిపారు. వేంపల్లి లో ఐటీ పార్కుకు ఆమోద ముద్రపడిందని చెప్పారు. ఆటోనగర్, పరిశ్రమలు ఏర్పాటు తో అభివృద్ధితోపాటు స్థానికులకు ఉపాధి లభిస్తుందని తెలిపారు.

## భట్టి విక్రమార్క, మహేష్ కుమార్ గౌడ్ ను కలిసిన ఎమ్మెల్యే, యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి





**పాలకుర్తి, జూన్ 11(జనంసాక్షి) :** ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డితో కలిసి టీపీసీసీ ఉపాధ్యక్షురాలుగా నూతనంగా నియమితులైన హనుమాండ్ల ఝాన్సీరెడ్డి హైదరాబాద్ లోని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉపముఖ్యమంత్రి భట్టి.విక్రమార్క లను బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ గత రెండేళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిలు కష్టపడుతున్న ఝాన్సీరెడ్డికి టీపీసీసీ ఉపాధ్యక్ష పదవి కట్టబెట్టిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, భట్టి విక్రమార్క లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గం లో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాల్లో విజయ దుందుభి మోగిస్తుందని తెలిపారు.

## సింగరేణిలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలుపై పరిశీలన




**భూపాలపల్లి, జూన్ 11 (జనం సాక్షి):** భూపాలపల్లి ఏరియాలలో పని చేస్తున్న ఎస్సీ ఉద్యోగులకు సంబంధించిన రోస్టర్ రికార్డులను చీఫ్ లైజన్ ఆఫీసర్ దుర్గం. రామచందర్ జిఎం మణుగూరు ఏరియా పరిశీలించారు. వీరికి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి ఘనస్వాగతం పలికి సాలువకప్పి, మొక్కను అందచేశారు. సింగరేణిలోని అన్ని ఏరియాల వ్యాప్తంగా చేస్తున్న రోస్టర్ రికార్డుల పరిశీలనలో భాగంగా బుధవారం జి.యం. కార్యాలయం నందు భూపాలపల్లి ఏరియాలో పనిచేస్తున్న ఎన్.సి.డబ్ల్యు.ఏ. ఉద్యోగుల ఏరియా స్థాయి అంతర్గత నియామకాలు, పదోన్నతులలో ఎస్సీ రిజర్వేషన్ నియమాల అమలుకు సంబంధించిన రోస్టర్ రికార్డులను చీఫ్ లైజన్ ఆఫీసర్ దుర్గం. రామచందర్ , కమిటీ సభ్యులు రాజేశ్వర్ , రావు , నాగేశ్వర్ రావు , తిరుపతి పరిశీలించారు. అనంతరం ఏరియాలోని వివిధ గనులు, విభాగాలలో ఉన్నటువంటి ఖాళీలకు అనుగుణంగా చేపట్టిన నియామకాలు, పదోన్నతుల వివరాలను పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి వారికి అందజేశారు. ప్రభుత్వ ఉత్తర్వులకనుగుణంగా ఏరియాలో అమలు చేస్తున్న రూల్ ఆఫ్ రిజర్వేషన్ పద్ధతిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సివిల్ విభాగం ద్వారా నిర్వహిస్తున్న వివిధ కాంట్రాక్టులలో ఎస్సీ రిజర్వేషన్ అమలును పరిశీలించారు. ఎస్సీ రిజర్వేషన్ నిష్పత్తి ప్రకారం వివిధ గనులు, విభాగాలలో ఉన్న ఖాళీలు నింపడానికి సరిపడా ఉద్యోగులు లేనందున, షెడ్యూల్డ్ కులాలకు చెందిన అభ్యర్థులకు ఏరియాలో ఉన్న బ్యాక్ లాగ్ ఖాళీల వివరాలు, అర్హత ప్రమాణాలపై అవగాహన కల్పించాలని ఎస్సీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ఐఈడి జోతి, ఎస్ ఈ సివిల్ బాలరాజు , డి వై పి ఎం గుండు.రాజు, అసిస్టెంట్ సూపర్డెంట్ రవి, ఏరియా ఎస్సీ లైజన్ ఆఫీసర్ చంద్రశేఖర్ , ఏరియా ఎస్సీ ఉద్యోగుల సంఘం బత్తుల వెంకటేశ్వర్లు, గడిపే చక్రపాణి, మండల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు మంచిర్యాల కలెక్టరేట్ ముట్టడి

- జిల్లా కేబుల్ టీవీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాం రెడ్డి

**నస్పూర్, జూన్ 11, (జనంసాక్షి):** మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట ఈనెల 12వ తేదీన జిల్లా కేబుల్ టీవీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంచిర్యాల జిల్లా కేబుల్ టీవీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గూడ రాం రెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. విద్యుత్ పోల్ బిల్లును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత 30 సంవత్సరాలుగా చాలీచాలని ఆదాయంతో ప్రజలకు సేవలు అందిస్తున్నామని, మారుతున్న సాంకేతికతతో కేబుల్ టీవీ ఆపరేటర్స్ పరిస్థితి దినదిన గండంగా తయారై వారి ఉనికే ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు కరెంట్ పోల్ టాక్స్ చెల్లించాలంటూ గ్రామాలు, పట్టణాలు మున్సిపల్ కార్పొరేషన్లలో ఉన్న అన్ని విద్యుత్ పోల్స్ లెక్కించడానికి వస్తున్నారని, ఇప్పటికే ఆపరేటర్లు ఎంత భారమైనప్పటికీ విద్యుత్ పోల్ బిల్లు చెల్లిస్తున్నారని, అయినప్పటికీ మళ్ళీ కరెంట్ పోల్ బిల్లులు పెంచాలని చూడడం అన్యాయం అని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్ పోల్ బిల్లు రద్దు చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ పోల్ బిల్లును రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్యను అందిస్తున్నాం

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**కల్లూరు, జూన్ 11 (జనం సాక్షి) :** ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, ప్రజలు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం ఉంచి తమ పిల్లలను పంపాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.బుధవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా కల్లూరు మండలంలోని ఓబుల్ రావు బంజర గ్రామంలో గతంలో మూతబడిన ప్రాథమిక పాఠశాలను గ్రామ ప్రజలు, తల్లిదండ్రుల సమక్షంలో పండుగ వాతావరణంలో బడి పిల్లలతో కలిసి జిల్లా కలెక్టర్ పునః ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని, ప్రైవేట్ కంటే మెరుగ్గా ఇక్కడ విద్య అందిస్తున్నామని అన్నారు. ప్రజలకు నాణ్యమైన విద్య అందించడం తమ బాధ్యతగా ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు . డబ్బులు చెల్లించినప్పటికీ ప్రైవేటు వ్యవస్థలో నాణ్యమైన విద్య లభించడం లేదని కలెక్టర్ పేర్కొన్నారు. సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు దక్కాలని, దీనికి విద్య ఒకటే మార్గమని స్పష్టం చేశారు.ఖమ్మం జిల్లాలో 1500 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, వీటిలో మూతబడిన పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటి పునరుద్ధరణకు చర్యలు చేపట్టామన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో కూడా నాణ్యమైన ఆంగ్ల భాష విద్య అందిస్తామని, దీని కోసం అవసరమైన శిక్షణ ఉపాధ్యాయులకు అందించామని అన్నారు. ఈ ప్రభుత్వ



పాఠశాలల్లో వారం రోజులలో ప్రహరీ గోడ, టాయిలెట్స్ వంటి మౌళిక సదుపాయాల కల్పన పనులు ప్రారంభిస్తామని తెలిపారు. మన పూర్వీకులు మొత్తం ప్రభుత్వ పాఠశాలల్లో చదివి, గొప్ప స్థాయికి ఎదిగారని తెలిపారు. గత సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 96 శాతం ఉత్తీర్ణత ఉంటే, ప్రైవేట్ పాఠశాలల్లో ఆ సంఖ్య కేవలం 91 శాతం అని, ప్రైవేట్ కంటే మెరుగ్గా ఫలితాలను ప్రభుత్వ పాఠశాలలు సాధిస్తున్నాయని కలెక్టర్ గుర్తుచేశారు. మన దగ్గర నాణ్యమైన, అనుభవం కల్గిన ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటారని తెలిపారు.ఒక సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం ఉంచి పిల్లలను పంపాలని, వారిలో స్పష్టమైన మార్పు కనిపించని పక్షంలో మళ్ళీ ప్రైవేట్ కు పంపాలని, ఒకసారి ప్రభుత్వ పాఠశాలలకు అవకాశం కల్పించాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కల్లూరు మండలంలో మూతబడి పునః ప్రారంభించుకున్న పాయాపూర్, లక్ష్మీపురం, ఓబుల్ రావు బంజారా పాఠశాలల రినోవేషన్ కోసం 10 లక్షల రూపాయల చెక్కును కల్లూరు ఆర్డీవోకు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పిల్లలకు స్కూల్ యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు, పాఠశాలకు స్పోర్ట్స్ మెటీరియల్ పంపిణీ చేశారు.అనంతరం గ్రామంలోని అంగన్వాడీ సెంటర్ ను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ ఎంత మంది విద్యార్థులు అంగన్వాడీ కి వస్తున్నారు తదితర వివరాలను ఆరా తీశారు. పోషక లోపం ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైన పౌష్టికాహారం అందించాలని, పిల్లల ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అంగన్వాడి కేంద్రంలో ఉన్న పిల్లల ఎత్తు, బరువు, వయసుకు తగ్గట్టు ఉందో లేదో నిరంతరం చెక్ చేసుకోవాలని, అంగన్వాడీకి కావలసిన సౌకర్యాలకు సంబంధించి ప్రతిపాదనలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. సత్యనారాయణ, కల్లూరు ఆర్డీఓ ఎల్. రాజేందర్ గౌడ్ తాసిల్దార్ పులి సాంబశివుడు ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎం.ఈ.ఓ. పత్తిపాటి నివేదిత, సి.డి.పి.ఓ. సి.హెచ్. నిర్మలా జ్యోతి, సూపర్వైజర్ సుజాత, అంగన్వాడీ టీచర్ ఐ.వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పూర్తి నాణ్యత ప్రమాణాలతో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలి

- కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గొట్టముక్కల రాములు



**హుజూర్‌నగర్, జూన్ 11 (జనంసాక్షి) :** పూర్తి నాణ్యత ప్రమాణాలతో బ్రిడ్జి నిర్మాణ పనులు అధికారులు చేపట్టాలని కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గొట్టముక్కల రాములు అన్నారు. హుజూర్ నగర్ పట్టణంలోని గోవిందాపురంలో రెండు కోట్లతో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు కాంట్రాక్టర్, అధికారులు ఇష్టానుసారంగా చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బుధవారం హుజూర్ నగర్ లోని గోవిందపురం బ్రిడ్జి వద్ద నిర్మాణ పనుల నిరసిస్తూ ఆందోళన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బ్రిడ్జి నిర్మాణ పనుల కోసం రెండు కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తే కాంట్రాక్టర్, అధికారులు బ్రిడ్జి పనులను డిజైన్ మార్చి పనులు చేస్తున్నారని విమర్శించారు. సైడ్ వాల్స్ నిర్మాణమును గతంలోపూర్తి నాణ్యత ప్రమాణాలతో బ్రిడ్జి నిర్మాణ పనులు ఇచ్చిన నిబంధనల మేరకు కాకుండా మోడల్ మార్చడం వల్ల భారీ వరదల సమయంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. పట్టణంలోని గోవిందాపురంలో సుమారు మూడువేల మంది ప్రజలు ఉండగా వారి సౌకర్యార్థం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రెండు కోట్లు నిధులు కేటాయించి బ్రిడ్జి పనులకు నిధులు మంజూరు చేశారని తెలిపారు. పబ్లిక్ హెల్త్ అధికారులు, మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్ కలిసి బ్రిడ్జి వాల్స్ పనులను మార్చివేశారని విమర్శించారు. భారీ వరదల సమయంలో నీటి సరఫరాకు అంతరాయం లేకుండా సైడ్ వాల్స్ రోడ్డు పక్కన నుండి నిర్మించాలన్నారు. పూర్తి నాణ్యత ప్రమాణాలతో బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉండేటి బాబు, బండి భాస్కర్, దాసరి శ్రీనివాస్ వీరస్వామి, చిట్టి మల్ల మట్టయ్య, భాస్కర్, చిలక బత్తిని అలివేలు, మంగమ్మ, మర్సకట్ల దాసు, గంపల కొండలు, గంపల కొండలు, దాసరి వెంకట నర్సు, బత్తిని కృష్ణ, అన్నమ్మ పాల్గొన్నారు.

## ఏడుగురు పేకాటరాయుళ్లు అరెస్ట్

**చింతకాని, జూన్ 11 (జనంసాక్షి) :** కొంతమంది పేకాట ఆడుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంతో చింతకాని పోలీస్ స్టేషన్ పరిధిలోని రామకిష్టపూరం గ్రామంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పేకాట అడుతున్న ఏడుగురిని టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. తదుపరి విచారణ నిమిత్తం చింతకాని పోలీస్ స్టేషన్ లో అప్పగించినట్లు టాస్క్ ఫోర్స్ ఏసీపీ రవి తెలిపారు. పేకాట అడుతున్న వారిని అదుపులోకి తీసుకోవాలన్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్, చింతకాని పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించి ఉయాలా శ్రీను, ఎస్కే.రహీమ్, పగిల్లా శివరమ కృష్ణ, గంటాలా రవీంద్ర, నకులురి రామారావు, మాండా సాయి కిరణ్, ఎస్కే మస్తాన్ అదుపులోకి తీసుకొని వారి నుండి రూ.19 వేల నగదు, 7 బైకులు, 7 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందుతులపై తెలంగాణ స్టేట్ గేమింగ్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు చింతకాని ఎస్సై తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకాలాపాలకు పాల్పడితే ఏలాంటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## హత్య కేసులో నిందితుడి అరెస్ట్

- మిగిలిన వారికోసం గాలింపు చర్యలు.
- సీఐ నాగరాజు ను వారి సిబ్బందిని అభినందించిన ఏఎస్పి



**భద్రాచలం, జూన్ 11 (జనంసాక్షి) :** భద్రాచలంలో ఇటీవల జరిగిన కణితి సతీష్ హత్య కేసు ను భద్రాచలం ఏ ఎస్ పి విక్రాంత్ కుమార్ సింగ్ విచారణ చేపట్టి నేరస్తుల కోసం మూడు బృందాలను ఏర్పాటు చేసి నేరస్తుల కోసం వెతుకుతూ ఉండగా ప్రధాన నిందుతుడు భద్రాచలం జగదీష్ కాలనీకి చెందిన గుంజా సాయి రామ్ (32) ను జూన్ 9వ తారీకు న భద్రాచలం పోలీస్ సిబ్బంది పట్టుకున్నారు. పట్టుబడిన వ్యక్తిని అరెస్ట్ చేసి భద్రాచలం ప్రధమ శ్రేణి మేజిస్ట్రేట్ ముందు హాజరు హాజరు పరిచినట్లు తెలిపారు. మిగిలిన వారి ఆచూకి కొరకు గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన టౌన్ ఇన్స్పెక్టర్ ఎం. నాగరాజు, ఎస్ఐలు స్వప్న, సతీష్, రామకృష్ణలు వారి సిబ్బందిని అభినందించారు. మిగిలిన ముద్దాయిల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు తెలియజేశారు.

## మహిళల ద్వారా ఇసుక పాయింట్ నిర్వహణకు ప్రణాళిక

- ఇసుక పాయింట్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**చింతకాని, జూన్ 11 (జనం సాక్షి) :** చింతకాని మండలం చిన్న మండవ గ్రామంలో సింధు గ్రామ సమాఖ్య ద్వారా ఏర్పాటు చేసిన ఇసుక పాయింట్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మహిళా సంఘాలపై ఉన్న నమ్మకంతో సింధు గ్రామ సమాఖ్య ద్వారా ఇసుక పాయింట్ ఏర్పాటు చేసామని, ఇక్కడ ఎటువంటి అవకతవకలు అక్రమాలు జరగడానికి వీలు లేదని, కూపన్ ఆధారంగా మాత్రమే ఇసుక పాయింట్ నుంచి ఇసుక తరలింపు జరగాలని అన్నారు. ప్రతి రోజు ఎన్ని ట్రిప్పులు ఇసుక పోతుంది, ఎవరైనా ఒత్తిడికి గురి చేస్తున్నారా వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఇసుక కూపన్ లను, చెరువు వద్ద లోడ్ అవుతున్న ట్రాక్టర్ వద్ద ఉన్న కూపన్ ను కలెక్టర్ పరిశీలించారు. లోడింగ్ కు ఎంత డబ్బు ఖర్చు అవుతున్నది అడిగి తెలుసుకున్నారు. జేసిబి లను అనుమతించడానికి వీలు లేదని ఇసుక పాయింటు వద్ద 10 రోజుల్లో చెక్ పోస్ట్ వంటిది మహిళలు ఉండే విధంగా ఏర్పాటు చేయాలని అన్నారు. ఇసుక పాయింట్ వద్ద త్రాగుబోతుల సమస్య ఎక్కడ వచ్చినా వెంటనే తహసిల్దార్, పోలీసుల దృష్టికి తీసుకుని రావాలని కలెక్టర్ సూచించారు. ఖమ్మం జిల్లా



వ్యాప్తంగా ఇసుక పాయింట్ నిర్వహణ బాధ్యతలను మహిళా సమాఖ్య లకు అప్పగించడం జరుగుతుందని అన్నారు.స్త్రీ టీ స్టాల్, షీ రాక్స్ సెంటర్ వంటి వినూత్న వ్యాపార యూనిట్లు మహిళా సంఘాల ద్వారా జిల్లాలో మరిన్ని ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. చిన్న మండవ గ్రామంలో జరుగుతున్న ప్రయత్నం నివేదిక వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని, రాష్ట్రవ్యాప్తంగా కూడా మహిళా సంఘాల ద్వారా ఇసుక పాయింట్ నిర్వహణ అవకాశాలు పరిశీలించాలని కోరుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమం లో తహసీల్దారు కె. అనంతరాజు, ఎంపిడిఓ శ్రీనివాస్ రావు, ఏపిఎం శ్రీనివాస్ రావు, సింధు గ్రామ సమాఖ్య సభ్యులు బేబీ రాణి, లక్ష్మీ, ఇందిరా, భాగ్యలక్ష్మి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పించాలి

**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 11 (జనంసాక్షి) :** అటవీ హక్కుల ద్వారా పట్టా పొందిన గిరిజన లబ్దిదారులకు సోలార్ ప్లాంట్స్ తో సాగునీరు అందించుటకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా సౌర గిరిజల వికాసం పథకంను ప్రవేశ పెట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె.శంకర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం సంబందిత జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకాన్ని సత్వరమే అమలు కొరకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులకు ఆదేశించారు.జిల్లాలో మఠంపల్లి, పాలకవీడు, చింతలపాలెం మండలాలలో అటవీ భూములు పొందిన గిరిజన రైతులు ఉన్నారని, సోలార్ విద్యుత్ పై రైతులకు అవగాహనపరిచి ప్రోత్సహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి సతీష్ కుమార్, జిల్లా భూ గర్భ జల




శాఖ అధికారి బాలు నాయక్, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జిల్లా రవాణా శాఖ అధికారి, జిల్లా హార్టికల్చర్ అండ్ సెరికల్చర్ శాఖ అధికారి నాగయ్య, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, మఠంపల్లి, పాలకవీడు, చింతలపాలెం ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## చాక్లెట్స్ కవర్స్‌లలో గంజాయి అమ్మకం



**హయత్‌నగర్, జూన్ 11 (జనం సాక్షి) :** హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుంట్లూరు రోడ్డు లోని దుర్గా భవానీ ట్రేడర్స్ దుకాణంలో నిషేధిత పొగాకు ఉత్పత్తులు, గంజాయి చాక్లెట్ లను అక్రమంగా కలిగి ఉండటం, విక్రయించడం గురించి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సబ్-ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె. వెంకట్ రెడ్డి, పోలీస్ సిబ్బంది, మధ్య వర్తుల తో కలిసి, సెర్చ్ వారెంట్‌తో దుకాణంపై దాడి చేశారని హయత్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజ్ గౌడ్ తెలిపారు. షాప్ యజమాని గుండు శేఖర్ (40) శుభోదయ కాలనీ, హయత్‌నగర్ నివాసి కి గంజాయి చాక్లెట్స్ అమ్మడాని కి వచ్చిన ఏ2. రిషి శంకర్ మిశ్రా లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి "సెవెన్ మినార్ వట్టి" అని లేబుల్ చేయబడిన 9 ప్యాకెట్ల గంజాయి చాక్లెట్లు, "చార్మినార్ గోల్డ్ మునక్క" అని లేబుల్ చేయబడిన 1 ప్యాకెట్ దొరికాయి, మొత్తం 10 ప్యాకెట్ల గంజాయి చాక్లెట్లు సుమారు 2.035 కిలోల బరువు ఉన్నాయని వారు తెలిపారు. నిషేధిత పొగాకు ఉత్పత్తులను సుమారు 40000/- రూపాయల విలువ గల వాటిని వారు స్వాధీనం చేసుకున్నారు. సబ్-ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె. వెంకట్ రెడ్డి పిర్యాదు మేరకు, సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. నాగరాజ్ గౌడ్ క్రైమ్ నంబర్ 759/2025, యు/ ఎస్ 274, 275 బి ఎన్ ఎస్ సెక్షన్ 20(ఐ) సిఓటిపిఏ, 20 (బి) (ఐఐ) (ఏ) ఎన్ డిపిఎస్ చట్టం-1985 కింద కేసు నమోదు చేసి దర్యాప్తును సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె. లక్ష్మీనారాయణ కు అప్పగించినట్లు వారు తెలిపారు. హయత్‌నగర్ పౌరులు అటువంటి ఉత్పత్తులను తీసుకోవడం వల్ల కలిగే ప్రమాదాల గురించి తెలుసుకోవాలని, ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలను అధికారులకు తెలియపరచాలని వారు కోరుతున్నారు. మీకు ఏదైనా సమాచారం ఉంటే హయాత్నగర్ పోలీస్ వారిని, డయల్ 100 కి కాల్ చేసి సంప్రదించలని, "సమాచారం ఇవ్వండి సురక్షితంగా ఉండండి" అని పి. నాగరాజ్ గౌడ్ తెలిపారు.

## ఏఆర్ కానిస్టేబుల్స్‌కు కౌన్సెలింగ్ ద్వారా బదిలీ ప్రక్రియ నిర్వహించిన ఎస్పీ




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 11 (జనం సాక్షి) :** 35 మంది సివిల్ మరియు 07 మంది ఎంప్టీ సెక్షన్ ఏఆర్ కానిస్టేబుల్స్ కు కౌన్సిలింగ్ ద్వారా బదిలి ప్రక్రియ నిర్వహించిన జిల్లా ఎస్పి శ్రీ యం. రాజేష్ చంద్ర. బుధవారం కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్స్ వాడ సబ్ డివిజినల్ పరిధిలోని సివిల్ కానిస్టేబుల్స్. మరియు ఎంప్టీ సెక్షన్ ఏఆర్ కానిస్టేబుల్స్ లకు జిల్లా ఎస్పి యం. రాజేష్ చంద్ర, ఐ.పి.యస్. ఆధ్వర్యంలో అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ క్రింద బదిలీల ప్రక్రియ నిర్వహించడం జరిగింది.5 సం సర్వీసు పూర్తి చేసిన 35 మంది కానిస్టేబుల్స్ మరియు 07 మంది ఎంప్టీ సెక్షన్ ఏఆర్ కానిస్టేబుల్స్ లకు జిల్లా ఎస్పి వారితో వివరంగా మాట్లాడి వారి విల్లింగ్ స్టేషన్లు, స్పౌస్, సీనియారిటీని, ఆరోగ్య పరిస్థితులను మరియు సర్వీస్ రికార్డును పరిగణలోకి తీసుకొని కౌన్సిలింగ్ పద్ధతిలో పారదర్శకంగా బదిలి చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, కానిస్టేబుల్స్ ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో తమకు కేటాయించిన పోలీస్ స్టేషన్‌లలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. విధుల్లో క్రమశిక్షణతో పాటు నిబద్ధత, నిజాయితీ ఉండాలని స్పష్టం చేశారు.పోలీస్ ఉద్యోగంలో క్రమశిక్షణకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ఒక్కరి తప్పు మొత్తం శాఖపై ప్రభావం చూపుతుందని గుర్తు చేశారు. అందువల్ల కానిస్టేబుల్స్ లు జాగ్రత్తగా, నీతి మరియు నిజాయితీతో విధులు నిర్వహించి, ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని, తమకు కేటాయించిన విభాగాల్లో నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవాలని ఎస్పీ సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ కె. నరసింహారెడ్డి,, ఏఆర్ డీఎస్పీ యాకూబ్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ తిరుపయ్య, ఆర్ఐ లు నవీన్ కుమార్, కృష్ణ, మరియు కానిస్టేబుల్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కేసారం గ్రామంలో జిల్లా కలెక్టర్ విస్తృత పర్యటన

- పల్లె దావఖాన ఆకస్మిక తనిఖీ

**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 11 (జనంసాక్షి) :** సూర్యాపేట మండలంలోని కేసారం గ్రామంలో చౌక దుకాణం, అంగన్వాడి కేంద్రం, పల్లె దవాఖానను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆకస్మికంగా పరిశీలించారు.గ్రామంలోని రైతు వేదికలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు.ముందుగా గ్రామంలోని 24వ నెంబర్ రేషన్ షాపును పరిశీలించారు. సన్న బియ్యం పంపిణీ వివరాలను డీలర్ గొర్ల గన్నారెడ్డి అడిగి తెలుసుకున్నారు.షాపులో మొత్తం 735 రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు.జిల్లాలో ఉన్న 610 రేషన్ దుకాణాలకు 17577 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం పంపిణీ కొరకు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు.అనంతరం కేసారం గ్రామంలోని రైతు వేదికలో జరుగుతున్న భూ భారతి రెవెన్యూ సదస్సులో రైతుల కొరకు ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ దరఖాస్తుల స్వీకరణ కేంద్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం ప్రవేశపెట్టిన భూభారతి నూతన రెవెన్యూ చట్టంలో భాగంగా గ్రామస్థాయిలో రెవెన్యూ సంబంధించి భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.జూన్ 20 వరకు కొనసాగే ఈ రెవెన్యూ సదస్సులలో రైతులు పాల్గొని తమ భూ సమస్యలను పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఎన్నో సంవత్సరాలుగా



పెండింగ్‌లో ఉన్న సమస్యలను భూభారతి చట్టం ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ భూ భారతిలో అధికారులే రెవెన్యూ గ్రామాలకు వెళ్లి గ్రామ సభలు నిర్వహిస్తున్నారని, సమస్యలు ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.గతంలో ఏ సమస్య వచ్చినా జిల్లా కలెక్టర్ వద్దకు వచ్చేవారిని, ఈ కొత్త చట్టంలో తహసిల్దార్ వద్దనే ఎన్నో సమస్యలు పరిష్కరించే విధంగా చట్టం రూపొందించబడిందని పేర్కొన్నారు. ఏదైనా సమస్యపై దరఖాస్తు ఇచ్చేటప్పుడు దాని సంబంధించిన పూర్తి వివరాలను కూడా సమర్పించాలని కోరారు.దరఖాస్తు ఇచ్చిన తర్వాత రసీదును తీసుకొని వెళ్లాలని రైతులకు సూచించారు. రైతు సమస్యలపై విచారణ కొరకు గ్రామాలకు వచ్చిన రెవెన్యూ అధికారులకు రైతులు పూర్తిగా సహకరించాలని కోరారు.గ్రామాలలో క్షేత్రస్థాయిలో ఉన్న భూమి యొక్క పూర్తి వివరాలు పుస్తకాలలో ఉండేటట్లుగా భూభారతి తోడ్పడుతుందని తెలిపారు.అనంతరం రైతు సదస్సుకు వచ్చిన ఉప్పుల లింగయ్య సమస్యను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.రైతు వేదికకు పక్కనే ఉన్న కేసారం సెకండ్ కాలనీ అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అంగన్వాడీ కేంద్రంలో గర్భిణుల సంఖ్య, బాలింతల సంఖ్య, పిల్లల వివరాలను అంగన్వాడి టీచర్ చింత సుధాదేవిని అడిగి తెలుసుకున్నారు.పిల్లలకు వ్యాక్సినేషన్ వేస్తున్నారా లేదా అంగన్వాడి టీచర్ ను అడిగారు.అంగన్వాడీ కేంద్రాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచాలని మంచి అహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలకు విద్యను అందించాలన్నారు.అనంతరం పల్లె దవాఖానను ఆకస్మికంగా సందర్శించారు.మందుల రిజిస్టర్, హాజరు పట్టికను పరిశీలించారు. గర్భిణీల వివరాలు రిజిస్టర్లలలో నమోదు చేశారా లేదా పరిశీలించారు.సకాలంలో మందులు, గర్భిణీలకు ఐరన్ టాబ్లెట్స్ వారు తీసుకోవాల్సిన ఆహార విషయాలను ,గర్భిణీలకు వివరించాలన్నారు.పల్లె దవాఖానాలోని సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు.వైద్యసిబ్బంది ప్రజలకు సేవే ధర్మంగా విధులు నిర్వహించాలన్నారు. అన్ని రకాల మందులు స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ ఆకస్మిక పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఆర్డిఓ వేణుమాధవ్, తహసీల్దార్ కృష్ణయ్య, ఆర్ఐ శ్రీధర్, పల్లె దవాఖాన సూపర్వైజర్ విజయలక్ష్మి, ఏఎన్ఎం ఉపేంద్ర, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## ఎల్ఐసీ తదుపరి సీఈఓగా ఆర్ దొరైస్వామి

**ముంబై:** లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) మరియు మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) పదవికి ఆర్ దొరైస్వామిని ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్స్టిట్యూషన్స్ బ్యూరో (ఎఫ్ఎస్ఐబీ) బుధవారం సిఫారసు చేసింది. ప్రస్తుత తాత్కాలిక సీఈఓ మరియు ఎండీ అయిన సత్ పాల్ భానూ స్థానంలో దొరైస్వామి నియమితులు కానున్నారు. సత్ పాల్ భానూ 2025, జూన్ 8న ఈ పదవిలో నియమితులై, 2025, సెప్టెంబర్ 7 వరకు సంస్థకు సేవలు అందించనున్నారు. 2023, సెప్టెంబర్ నుంచి ఎల్ఐసీలో ఎండీగా వ్యవహరిస్తున్న ఆర్ దొరైస్వామికి ఆపరేషన్స్, మార్కెటింగ్, టెక్నాలజీ, మరియు అకాడమిక్ రంగాల్లో మూడు దశాబ్దాలకు పైగా విస్తృత అనుభవం ఉంది.

## స్టాక్ మార్కెట్లు స్వల్ప లాభాలతో ముగిశాయి




ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు స్వల్ప లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాల నేపథ్యంలో ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు, ఐటీ షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో పుంజుకున్నాయి. చివరికి స్వల్ప లాభాలతో ట్రేడింగ్ ముగిసింది. ప్రభుత్వ రంగ బ్యాంక్ షేర్లలో లాభాల స్వీకరణ కనిపించింది.
సెన్సెక్స్ ఉదయం 82,473.02 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,391.72) స్వల్ప లాభంతో ఆరంభమై, ఇంట్రాడేలో 82,308.91 నుంచి 82,783.51 మధ్య కదలాడింది. తుదికి 123 పాయింట్ల లాభంతో 82,515.14 వద్ద ముగిసింది. నిఫ్టీ 37 పాయింట్ల లాభంతో 25,141 వద్ద ముగియగా, డాలర్‌తో రూపాయి మారకం విలువ 85.52గా నమోదైంది.
సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్, టాటా మోటార్స్, అల్ట్రాటెక్ సిమెంట్, టైటాన్, టాటా స్టీల్, సన్ ఫార్మా షేర్లు లాభపడ్డాయి. ఇక పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, అదానీ పోర్ట్స్, ఇండస్ఇండ్ బ్యాంక్, నెస్లే ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ, హిందుస్థాన్ యూనిలీవర్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు నష్టపోయాయి.
అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 67.69 డాలర్ల వద్ద ట్రేడ్ కాగా, బంగారం ఔన్సు 3,354 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## మళ్లీ పెరిగిన పుత్తడి ధరలు

**న్యూఢిల్లీ :** వరుసగా మూడు రోజుల పాటు తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు బుధవారం తిరిగి భారీగా పెరిగాయి. ప్రస్తుతం అమెరికాలో కొనసాగుతున్న ఆందోళలతో పాటు- ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రపంచ వాణిజ్య పరిస్థితులు బంగారం, వెండి వంటి లోహాల ధరలపై భారీగా ప్రభావితం చేస్తోంది. ఈ నేపథ్యంలో నేడు హైదరాబాద్ లో బంగారం ధరల విషయానికి వస్తే.. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములు రూ. 820 పెరిగి 10 గ్రాములకు ధర రూ. 98,400 వద్ద ట్రేడ్ అవుతుంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.750 పెరిగి 10 గ్రాములకు ధర రూ. 90,200గా, 18 క్యారెట్ల బంగారం (10 గ్రాములు) రూ.610 పెరిగి రూ. 73,190 వద్ద ట్రేడ్ అవుతుంది. ఇది ఇలా ఉండగా బంగారం ధరలు భారీగా పెరిగిన వెండి ధరలలో మాత్రం ఎటువంటి మార్పు లేకపోవడం సంతోషకరమైన విషయం. హైదరాబాద్ లో కేజీ వెండి ధర నిన్నటి ధరలో ఎటు-వంటి తేడా లేకుండా రూ. 1,19,000 వద్ద ట్రేడ్ అవుతోంది.

# రూ.3వేలు దాటిన యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు..?




యూపీఐ లావాదేవీల వినియోగం రోజురోజుకూ విపరీతంగా పెరుగుతోంది. చిన్న కిరాణా దుకాణంలో వస్తువులు కొనుగోలు చేసినా, యూపీఐ ఆధారిత డిజిటల్ చెల్లింపులు సర్వ సాధారణంగా మారాయి. ప్రస్తుతం ఈ చెల్లింపులపై ఎలాంటి ఛార్జీలు లేవు. అయితే, త్వరలోనే యూపీఐ లావాదేవీలపై మర్చెంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) ఛార్జీలను విధించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు ఎన్డీటీవీ ప్రాఫిట్ తన కథనంలో పేర్కొంది. అధిక విలువైన డిజిటల్ లావాదేవీల నిర్వహణ ఖర్చులు పెరుగుతున్నాయని బ్యాంకులు, చెల్లింపు సేవా సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, ఎండీఆర్ ఛార్జీలను పునర్విధించాలని కేంద్రం భావిస్తోంది. వ్యాపారుల వార్షిక ఆదాయం కాకుండా, లావాదేవీ విలువ ఆధారంగా ఈ ఛార్జీలను విధించేందుకు చర్చలు జరుగుతున్నాయి. రూ.3,000 కంటే ఎక్కువ విలువైన యూపీఐ లావాదేవీలపై ఈ ఛార్జీలు వర్తించే అవకాశం ఉంది. దీంతో, 2020 జనవరి నుంచి అమల్లో ఉన్న జీరో ఎండీఆర్ విధానం ముగియనుంది. చిన్న మొత్తం లావాదేవీలపై ఎండీఆర్ ఛార్జీలకు మినహాయింపు కొనసాగే అవకాశం ఉన్నప్పటికీ, అధిక విలువ లావాదేవీలపై త్వరలోనే మర్చెంట్ రుసుము విధించే అవకాశం ఉంది. పెద్ద వ్యా పారులపై 0.3 శాతం ఎండీఆర్ విధించాలని పేమెంట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతిపాది ంచింది. ప్రస్తుతం క్రెడిట్, డెబిట్ కార్డులపై ఎండీఆర్ 0.9 శాతం నుంచి 2 శాతం వరకు ఉంది. రూపే కార్డులపై ప్రస్తుతానికి ఎండీఆర్ విధించే ప్రణాళిక లేదని తెలుస్తోంది. బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు, ఎన్‌పీసీఐ వంటి వాటాదారులతో చర్చల అనంతరం, ఒకటి లేదా రెండు నెలల్లో యూపీఐ ఛార్జీలపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

### యూజర్లపై ప్రభావం ఉంటుందా?

ఎండీఆర్ ఛార్జీలు తిరిగి ప్రవేశపెట్టినా, యూజర్లపై నేరుగా ఎలాంటి ప్రభావం ఉండకపోవచ్చని సమాచారం. ఎందుకంటే, ఈ ఛార్జీలను వినియోగదారుల నుంచి వసూలు చేయరు. గతంలో, 2022 వరకు యూపీఐ చెల్లింపుల ప్రాసెసింగ్ కోసం వ్యాపారులు బ్యాంకులకు ఒక శాతం లోపు ఛార్జీలు చెల్లించేవారు. ఆ తర్వాత, కేంద్రం ఈ ఛార్జీలను తొలగించి, ప్రాసెసింగ్ ఖర్చులను భర్తీ చేసేందుకు బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలకు సబ్సిడీలు అందిస్తోంది.



# లాస్ ఏంజెలెస్‌లో యాపిల్ లూటీ

### నిరసనల ముసుగులో స్టోర్‌లోకి చొరబడి దోపిడీ

లాస్ ఏంజెలెస్: అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో అక్రమ వలసదారుల అరెస్టులకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలను ఆసరాగా చేసుకుని కొందరు దుండగులు రెచ్చిపోయారు. యాపిల్ స్టోర్‌తో పాటు పలు వ్యాపార కేంద్రాలను లూటీ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.
డౌన్‌టౌన్‌లో నిరసనల సమయంలో ముసుగులు ధరించిన కొందరు వ్యక్తులు యాపిల్ స్టోర్‌లోకి చొరబడి, కిటికీల అద్దాలను ధ్వంసం చేసి గాడ్జెట్‌లను దోచుకున్నారు. ఇతర దుకాణాల్లోకి కూడా చొరబడి ఆస్తిని నాశనం చేశారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేశారు. ఈ క్రమంలో పలువురిని అరెస్టు చేసినట్లు లాస్ ఏంజెలెస్ పోలీసు అధికారి క్రిస్ మిల్లర్ తెలిపారు.
నిరసనల నేపథ్యంలో డౌన్‌టౌన్‌లోని కొన్ని ప్రాంతాల్లో పరిమిత కర్ఫ్యూ విధిస్తున్నట్లు లాస్ ఏంజెలెస్ మేయర్ కరెన్ బాస్ ప్రకటించారు. ఈ కర్ఫ్యూ మంగళవారం రాత్రి 8 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు (స్థానిక కాలమానం ప్రకారం) అమలులో ఉంటుందని ఆమె తెలిపారు. డౌన్‌టౌన్‌లో దుకాణాలను ధ్వంసం చేసి, లూటీ చేసిన వారు తగిన శిక్ష అనుభవించక తప్పదని ఆమె హెచ్చరించారు. అక్రమ వలసదారులను అరెస్టు చేసేందుకు ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) అధికారులు శుక్రవారం డౌన్‌టౌన్‌లో సోదాలు ప్రారంభించడంతో ఈ నిరసనలు మొదలయ్యాయి. ఈ నిరసనలు ప్రస్తుతం కాలిఫోర్నియాలోని శాన్‌ఫ్రాన్సిస్కో, శాంటా అనా, టెక్సాస్‌లోని డల్లాస్, ఆస్టిన్‌లకు విస్తరించాయి. జాతీయ కార్యాలయాలు, డిటెన్షన్ సెంటర్ల రక్షణ కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీ సంఖ్యలో నేషనల్ గార్డ్‌తో పాటు 700 మంది మెరైన్‌లను పంపుతున్నారు. అయితే, కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసమ్ మరియు లాస్ ఏంజెలెస్ మేయర్ కరెన్ బాస్‌తో పాటు స్థానిక పోలీసు అధికారులు ఈ చర్యను వ్యతిరేకిస్తున్నారు.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
| --- | --- | --- |
| హైదరాబాద్ | ₹ 610 | ₹ 59.2 |
| వరంగల్ | ₹ 612 | ₹59.4 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్
₹ 99,220 (24 క్యారెట్లు)
₹ 8,9450 (22 క్యారెట్లు)


చెన్నై
₹9,0200 (22 క్యారెట్లు)
₹9,8400 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹1,19,000

## ఆధార్ ధ్రువీకరణ ఉన్నవారికే తత్కాల్ టికెట్లు!

కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. తత్కాల్ రైలు టికెట్ల బుకింగ్‌కు ఆధార్‌ను తప్పనిసరి చేసింది.

దిల్లీ: రైల్వే తత్కాల్ టికెట్ల బుకింగ్‌కు సంబంధించి కేంద్రం కొత్త నిబంధనను అమలులోకి తెచ్చింది. జులై 1 నుంచి కేవలం ఆధార్ ధ్రువీకరణ ఉన్న వ్యక్తులు మాత్రమే తత్కాల్ టికెట్లు బుక్ చేసుకోగలరని రైల్వే శాఖ ప్రకటించింది. ఈ విషయంపై అన్ని జోన్లకు సర్క్యులర్ జారీ చేసింది. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ లేదా యాప్‌లో ఆధార్ అథెంటికేటెడ్ యూజర్లకు మాత్రమే టికెట్ బుకింగ్ సౌకర్యం అందుబాటులో ఉంటుందని సర్క్యులర్‌లో స్పష్టం చేశారు. జులై 15 నుంచి తత్కాల్ టికెట్ల బుకింగ్‌కు ఆధార్ ఆధారిత ఓటీపీని తప్పనిసరి చేస్తున్నట్లు కేంద్రం తెలిపింది. రైల్వే టికెట్ కౌంటర్లు, అధీకృత ఏజెంట్ల వద్ద తత్కాల్ టికెట్లు బుక్ చేసేందుకు వ్యక్తి మొబైల్‌కు వచ్చే ఆధార్ ఓటీపీని నమోదు చేయాల్సి ఉంటుంది. అంతేకాక, అధీకృత ఏజెంట్లకు తత్కాల్ టికెట్ల బుకింగ్‌కు మొదటి 30 నిమిషాలు అనుమతి ఉండదని రైల్వే శాఖ స్పష్టం చేసింది. అంటే, ఏసీ తరగతులకు ఉదయం 10:30 గంటల తర్వాత, నాన్-ఏసీ కోచ్‌లకు 11:30 గంటల తర్వాత మాత్రమే బుకింగ్ అవకాశం కల్పిస్తారు. ఈ నిబంధనలకు అనుగుణంగా రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ మరియు ఐఆర్‌సీటీసీ తమ వ్యవస్థల్లో మార్పులు చేయాలని రైల్వే శాఖ సూచించింది. అనధికార టికెట్ బుకింగ్‌లను అరికట్టేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.




### 24 గంటల ముందే వెయిటింగ్ లిస్ట్ సమాచారం

ప్రస్తుతం, ట్రైన్ బయలుదేరే నాలుగు గంటల ముందు మాత్రమే వెయిటింగ్ లిస్ట్ టికెట్ల స్థితి తెలుస్తోంది. ఇకపై, 24 గంటల ముందే ఈ వివరాలను వెల్లడించేందుకు రైల్వే శాఖ సన్నద్ధమవుతోంది. ఈ ప్రయత్నంలో భాగంగా బికనీర్ డివిజన్‌లో పైలట్ ప్రాజెక్ట్‌ను చేపట్టినట్లు రైల్వే బోర్డు సీనియర్ అధికారి వెల్లడించారు. వెయిటింగ్ లిస్ట్ టికెట్ల వల్ల ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆధార్ అథెంటికేషన్ చేసిన యూజర్లు మాత్రమే జులై ఒకటో తేదీ నుంచి ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, యాప్ ద్వారా తత్కాల్ టికెట్లను బుక్ చేసుకోగలుగుతారని రైల్వే మంత్రిత్వశాఖ స్పష్టం చేసింది.

# దేశంలో 7వేలకు పైగా కోవిడ్ కేసులు

- ప్రధానిని కలవాలంటే కోవిడ్ టెస్ట్ తప్పనిసరి
- అధికార వర్గాల సమాచారం

**న్యూఢిల్లీ:** దేశ వ్యాప్తంగా కోవిడ్ కేసులు అమాంతంగా పెరిగిపోయాయి. పదుల్లో ఉండే కేసులు ఇప్పుడు వేలల్లోకి వచ్చేశాయి. అన్ని రాష్ట్రాల్లోకరోనా కేసులు పెరిగిపోయాయి. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 7 వేలకు పైగా కోవిడ్ కేసులు నమోదయ్యాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య శాఖ సూచించింది. ఈ నేపథ్యంలో ప్రధాన మంత్రి కార్యాలయం కూడా అప్రమత్తం అయింది. ఇకపై ప్రధాని మోడీని కలిసే మంత్రులు, ప్రభుత్వ శాఖ అధికారులు, ఇతర ప్రముఖులు తప్పనిసరిగా ఆర్టీపీసీఆర్ పరీక్ష చేయించుకోవాలని పీఎంవో సూచించినట్లు- అధికారిక వర్గాలు తెలిపాయి. భారత్ లో కోవిడ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. కేసుల సంఖ్య 6,815 కు చేరుకుందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. గత 24 గంటల్లో కొత్తగా 324 మందికి ఈ వ్యాధి సోకింది. చికిత్స పొందుతూ ముగ్గురు మరణించారు. మరో 783 మంది కోలుకున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి దేశంలో 68 మరణాలు నమోదయ్యాయని పేర్కొంది. దేశంలో కోవిడ్ యొక్క కొత్త వేరియంట్ కూడా వ్యాప్తి చెందుతున్నట్లు- కనుగొనబడింది. దేశ వ్యాప్తంగా 163 మంది సోకిన వారిలో కొత్త ఓమిక్రాన్ వేరియంట్ ఎక్స్ఎఫ్ జి ఉనికిని కనుగొన్నట్లు- ఇండియన్ జెనోమిక్స్ కన్సార్టియం ప్రకటించింది. గతంలో జెఎన్1 , ఎల్ఎఫ్7 మరియు ఎక్స్ఎఫ్ జి వంటి ఓమిక్రాన్ వేరియంట్‌లు భారతదేశంలో వ్యాపిస్తున్నాయని ఐసిఎంఆర్ నిర్ధారించింది. కేరళలో 96 కొత్త కేసులు నమోదు కావడంతో మొత్తం సోకిన వారి సంఖ్య 2,053కు చేరుకుంది. పీఎంవో సూచన మేరకు బుధవారం సాయంత్రం ప్రధాని మోడీని కలవనున్న ఢిల్లీ ముఖ్యమంత్రి, ఏడుగురు ఎంపీలు, ఎమ్మెల్యేలతో సహా ఢిల్లీకి చెందిన దాదాపు 70 మంది బీజేపీ కార్యకర్తలు ఆర్టీ-పీసీఆర్ పరీక్ష చేయించుకోనున్నట్లు వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిన తర్వాత ప్రధాని మోడీ అన్ని రాష్ట్రాల పార్టీ నాయకులకు రాత్రి 7:30 గంటలకు విందు ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో అందరూ కూడా కోవిడ్ టెస్ట్ చేయించుకున్నట్లు- సమాచారం. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ బుధవారం విడుదల చేసిన లెక్కల ప్రకారం.. గత 24 గంటల్లో దేశంలో 306 కొత్త కేసులు నమోదవడంతో పాటు- ప్రస్తుతం యాక్టివ్ కేసుల సంఖ్య 7,121లకు చేరింది. దేశంలో కొవిడ్ మృతుల సంఖ్య 74కు పెరిగింది. కేరళలో అత్యధికంగా 2,223 యాక్టివ్ కేసులు ఉండగా.. గుజరాత్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్ తర్వాతి స్థానాల్లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.



## ఉత్తర కొరియా సరిహద్దుల్లో లౌడ్‌స్పీకర్ల వినియోగం నిలిపివేత

సియోల్: ఉత్తర కొరియా సరిహద్దుల్లో ప్రచారం కోసం ఏర్పాటు చేసిన భారీ లౌడ్‌స్పీకర్ల వినియోగాన్ని నిలిపివేస్తున్నట్లు దక్షిణ కొరియా ప్రకటించింది. ఇరు దేశాల మధ్య విశ్వాసాన్ని పునరుద్ధరించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజలు ఈ చర్యను స్వాగతించారు, ఎందుకంటే ఈ స్పీకర్ల శబ్దం వల్ల కొన్ని నెలలుగా వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
దక్షిణ కొరియా కొత్త అధ్యక్షుడు లీ జే-మ్యుంగ్ ఎన్నికైన ఒక వారంలోనే ఈ నిర్ణయం వెలువడటం గమనార్హం. ఇరు దేశాల సంబంధాలను మెరుగుపరుస్తానని ప్రచారం చేసి ఆయన ఎన్నికల్లో విజయం సాధించారు.గతంలో దక్షిణ కొరియా నిర్వహించిన లౌడ్‌స్పీకర్ ప్రచారాన్ని ఉత్తర కొరియా ఒక యుద్ధ చర్యగా పరిగణించి, స్పీకర్లను ధ్వంసం చేస్తామని హెచ్చరించిన సందర్భాలు ఉన్నాయి. దాదాపు ఆరేళ్ల పాటు దక్షిణ కొరియా ఈ ప్రచారాన్ని నిలిపివేసినప్పటికీ, ఉత్తర కొరియా నుంచి వేలాది చెత్త బెలూన్లు పంపడంతో, గత ఏడాది జూన్‌లో ఈ స్పీకర్లను మళ్లీ ప్రారంభించింది. ఈ స్పీకర్ల శబ్దం పగటిపూట 10 కిలోమీటర్లు, రాత్రివేళల్లో 24 కిలోమీటర్ల దూరం వరకు వినిపిస్తుంది. మునుపటి అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ హయాంలో ఇరు దేశాల సంబంధాలు మరింత క్షీణించాయి. సైనిక పాలన విధించడంతో తీవ్ర వ్యతిరేకత ఎదురై, ఆయన పదవిని కోల్పోయారు.




## త్వరలో భారత్‌లో స్టార్‌లింక్ ఇంటర్నెట్ సేవలు

ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ కంపెనీ యొక్క స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు త్వరలో భారత్‌లో ప్రారంభం కానున్నాయి. భారత ప్రభుత్వ టెలికమ్యూనికేషన్స్ విభాగం (డీఓటీ) నుంచి గ్లోబల్ మొబైల్ పర్సనల్ కమ్యూనికేషన్ శాటిలైట్ (జీఎంపీసీఎస్) లైసెన్స్‌ను పొందిన స్టార్‌లింక్, భారత్‌లో సేవలను అందించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ సందర్భంగా స్టార్‌లింక్ బ్రాడ్‌బ్యాండ్ ధరలు మరియు ప్రణాళికలకు సంబంధించిన కీలక నివేదిక వెలుగులోకి వచ్చింది.
నివేదిక ప్రకారం, స్టార్‌లింక్ ప్రైమరీ సెటప్ కిట్ భారత్‌లో రూ.33,000కి అందుబాటులో ఉం టుంది. ఈ కిట్‌లో స్టార్‌లింక్ డిష్, కిక్‌స్టాండ్, జెన్ 3 రౌటర్, స్టార్‌లింక్ కేబుల్, ఏసీ కేబుల్, మరియు విద్యుత్ సరఫరా కేబుల్స్ ఉంటాయి. ఈ కిట్ గృహ వినియోగదారుల కోసం ప్రత్యే కంగా రూపొందించబడింది, వీడియో కాల్స్, స్ట్రీమింగ్, ఆన్‌లైన్ గేమింగ్ వంటి రోజువారీ ఇంటర్నెట్ అవసరాలకు అనుకూలంగా ఉంటు ంది. అపరిమిత డేటా ప్లాన్ నెలవారీ ధర రూ.3,000 నుంచి రూ.4,200 వరకు ఉండవ చ్చని నివేదిక సూచిస్తోంది. స్టార్‌లింక్ మార్చిలో భారత్‌లోని ప్రముఖ టెలికాం సంస్థలైన ఎయిర్‌టెల్ మరియు రిలయన్స్ జియోతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం, స్టార్‌లింక్ హార్డ్‌వేర్ కిట్‌లను ఈ సంస్థల రిటైల్ స్టోర్‌ల ద్వారా విక్రయించే అవకాశం ఉంది. స్టార్‌లింక్ లో-ఎర్త్ ఆర్బిట్ ఉపగ్రహ నెట్‌వర్క్‌ను ఉపయోగించి, జియో మరియు ఎయిర కనెక్టివిటీ అందించలేని మారుమూల ప్రాంతాల్లో వేగవంతమైన, యాక్సెస్ చేయగల ఇంటర్నెట్ సేవలను అందించనుంది. ప్రస్తుతం స్టార్‌లింక్‌కు 7,000 ఉపగ్రహాలు ఉన్నాయి, మరియు భవిష్యత్తులో ఈ సంఖ్యను 40,000కి పెంచాలని స్పేస్‌ఎక్స్ ప్రణాళిక వేస్తోంది.

# ఆ యువకుడు తప్పు చేశాడు

### అక్రమంగా ఆ దేశంలోకి ప్రవేశించాడు : భారత విదేశాంగ శాఖ




నెవార్క్: అమెరికాలోని నెవార్క్ ఎయిర్‌పోర్ట్‌లో భారతీయ విద్యార్థిపై అమెరికా అధికారులు చర్యలు తీసుకున్న ఘటన ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై భారతీయులు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఈ నేపథ్యంలో, భారత విదేశాంగ శాఖ అధికారులు స్పందిస్తూ, ఆ విద్యార్థి చట్ట విరుద్ధంగా అమెరికాలోకి ప్రవేశించినట్లు తెలిపారు. "ఆ యువకుడు తప్పు చేశాడు. హర్యాణాకు చెందిన అతను సరైన వీసా లేకుండా అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించాడు. ప్రయాణ సమయంలో అతని ప్రవర్తన కూడా సరిగా లేదు. దీన్ని గుర్తించిన అమెరికా అధికారులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అతని పరిస్థితి స్థిరపడిన తర్వాత భారత్‌కు తిరిగి పంపే ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ విషయంలో అమెరికా అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాం," అని విదేశాంగ శాఖ పేర్కొంది.
రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్, అక్రమ వలసలపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. అక్రమంగా నివసిస్తున్న వారిని గుర్తించి వారి స్వదేశాలకు పంపుతున్నారు. ఈ క్రమంలో, భారత్‌కు చెందిన ఓ విద్యార్థి నెవార్క్ ఎయిర్‌పోర్ట్‌లో దిగగానే అమెరికా పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అతన్ని నేలపై పడుకోబెట్టి, చేతులకు బేడీలు వేశారు. అతని వీసా రద్దైందని, చట్టవిరుద్ధంగా అమెరికాలోకి ప్రవేశించాడని పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనను వీడియో తీసిన ప్రవాస భారతీయుడు కునాల్ జైన్ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశాడు. సదరు విద్యార్థి హర్యాణాకు చెందిన వ్యక్తిగా అనిపించాడని, "నేను కలలను సాకారం చేసుకోవడానికి వచ్చాను, ఎవరికీ హాని చేయడానికి కాదు" అని ఆ విద్యార్థి విలపిస్తున్నా, అధికారులు నేరస్తుడిలా వ్యవహరించారని ఆయన పేర్కొన్నాడు. ఈ దారుణ ఘటనను ప్రత్యక్షంగా చూస్తూ నిస్సహాయంగా ఉండిపోవాల్సి వచ్చిందని కునాల్ జైన్ ఆవేదన వ్యక్తం చేశాడు.

## కెసిఆర్ నిబద్ధ రాజకీయనేత: హరీష్ రావు

హైదరాబాద్, జూన్ 11 :
తెలంగాణ ప్రజల పట్ల కేసీఆర్ నిబద్ధత అచంచలమైనదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కొనియాడారు. కాళేశ్వరం వంటి పరివర్తన ప్రాజెక్టులను ప్రజలకు అందించారని పేర్కొన్నారు. ఇతరులు అధికారం వెంటబడితే.. కేసీఆర్ మన జీవితాలను మార్చారు. కాంగ్రెస్ కుట్ర గానీ, విచారణ కమిషన్ గానీ కేసీఆర్ ఘనతను తుడిచిపెట్టలేవు. తెలంగాణ కోసం కేసీఆర్ చేసిన త్యాగాలు సాటిలేనివి అని హరీశ్‌రావు పేర్కొన్నారు. చివరగా జై తెలంగాణ.. జై కేసీఆర్ అని నినదించారు.

# రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధ ఖైదీల మార్పిడి

రష్యా మరియు ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ, ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. యుద్ధం నేపథ్యంలో బందీలైన ఖైదీలను ఇరు దేశాలు విడుదల చేశాయి. గత వారం ఇస్తాంబుల్‌లో జరిగిన చర్చల్లో మాస్కో మరియు కీవ్ మధ్య ఈ విషయంపై ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఈ ఒప్పందం ప్రకారం తాజాగా ఖైదీల మార్పిడి జరిగింది.
రష్యా రక్షణ శాఖ విడుదల చేసిన వీడియోలో ఈ ఖైదీల విడుదల దృశ్యాలు కనిపించాయి. వీరికి ప్రస్తుతం బెలారస్‌లో వైద్య సహాయం అందించనున్నట్లు, ఆ తర్వాత మాస్కోలోని ఆసుపత్రులకు తరలిస్తామని రష్యా తెలిపింది. అయితే, ఎంత మంది ఖైదీలను విడుదల చేశారనే విషయాన్ని స్పష్టం చేయలేదు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్స్కీ కూడా ఈ యుద్ధ ఖైదీల మార్పిడిని ధ్రువీకరించారు. ఇస్తాంబుల్‌లో జరిగిన రెండో దశ చర్చల్లో, తీవ్రంగా గాయపడిన ఖైదీలు మరియు 25 ఏళ్లలోపు వయస్సు గల యుద్ధ బందీలను మార్చుకోవడానికి ఇరు పక్షాలు అంగీకరించినట్లు మీడియా కథనాలు వెల్లడించాయి. ఇటీవలి చర్చల్లో భాగంగా, 6,000 మంది సైనికుల మృతదేహాలను అప్పగించేందుకు ఇరు దేశాలు సమ్మతించాయి. ఈ ప్రక్రియలో 1,212 మృతదేహాలతో కూడిన కంటైనర్లను పంపినప్పటికీ, ఉక్రెయిన్ ఈ ప్రక్రియను నిలిపివేసిందని రష్యా ఆరోపించింది. అయితే, ఈ విమర్శలను ఖండిస్తూ, మాస్కో "డర్టీ గేమ్స్" ఆడుతోందని, మృతదేహాల



తరలింపుకు నిర్దిష్ట తేదీ నిర్ణయించలేదని ఉక్రెయిన్ స్పష్టం చేసింది.

### కొనసాగుతున్న దాడులు

శాంతి చర్చలు జరుగుతున్నప్పటికీ, రష్యా ఉక్రెయిన్‌పై తన దాడులను కొనసాగిస్తోంది. మంగళవారం కీవ్ మరియు ప్రధాన రేవు పట్టణమైన ఒడెసాపై రష్యా దాడులు చేసింది. ఈ దాడుల్లో ముగ్గురు మరణించగా, 13 మంది గాయపడ్డారు. గత మూడేళ్ల యుద్ధంలో రష్యా చేసిన అతిపెద్ద దాడుల్లో ఇది ఒకటని జెలెన్స్కీ పేర్కొన్నారు. ఇటీవల ఉక్రెయిన్ 'స్పైడర్ వెబ్' పేరుతో భారీ ఆపరేషన్ చేపట్టిన సంగతి తెలిసిందే.

## భూభారతి సదస్సులు పకడ్బందీగా నిర్వహించాలి

- 187 గ్రామాల్లో 10,933 దరఖాస్తుల స్వీకరణ
- కలెక్టర్ రాహుల్ రాజ్



**నర్సాపూర్, జూన్ 11 (జనం సాక్షి) :** జిల్లాలో జూన్ 03 నుండి 20 వరకు నిర్వహిస్తున్న భూభారతి సదస్సులు రైతులకు అర్థం అయ్యే రీతిలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నర్సాపూర్ మండలం పరిధిలోని చిప్పల్ తుర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహణ తీరును నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి, తాసిల్దార్ శ్రీనివాస్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. భూభారతి చట్టం తీసుకొచ్చింది రైతుల కొరకేనని రైతులు తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. రైతుల నుంచి తీసుకున్న దరఖాస్తులను పరిశీలిస్తూ తెలియనివి ఉంటే అధికారులను అడిగి తెలుసుకోవాలని పొరపాట్లు చేయరాదన్నారు. భూభారతిలో రైతుల ప్రతి ఒక్క సమస్య పరిష్కరించడం జరుగుతుందని రైతులకు కలెక్టర్ తెలియజేశారు ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తోపాటు గ్రామ మాజీ సర్పంచ్ శ్యామల లక్ష్మణ్ గౌడ్ గ్రామస్తులు సురేష్ గౌడ్ భాస్కర్ శ్రీనివాస్ రెడ్డి, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# టెక్నాలజీని సమగ్రంగా వినియోగించాలి

- రామడుగు పోలీసుస్టేషన్ తనిఖీ చేసిన కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం

**కరీంనగర్ బ్యూరో, జూన్ 11 (జనంసాక్షి) :** కరీంనగర్ కమీషనరేట్ పరిధిలోని రామడుగు పోలీసుస్టేషన్ ను బుధవారం రోజు కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం తనిఖీ చేసారు. పోలీస్ స్టేషన్ కు విచ్చేసిన కమీషనర్ కు స్టేషన్ ఎస్సై పూల మొక్కను అందించి స్వాగతం పలికారు. అనంతరం సాయుధ దళ పోలీసుల గార్డ్ అందించిన గౌరవ వందనం స్వీకరించారు. హాజరు ఉన్న సిబ్బంది పరేడ్ , లాఠీ పరేడ్ నిర్వహించిన తీరును పర్యవేక్షించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో పలు కేసుల్లో పట్టుబడి స్వాదీనంలో ఉన్న వాహనాల వివరాలు అడిగి, పోలీస్ స్టేషన్ లో హాజరులో ఉన్న సిబ్బందితో మాట్లాడారు. వారికి కేటాయించబడిన విధులు అడిగి తెలుసుకుని, సరైన పద్ధతిలో రికార్డుల నిర్వహణ, నమోదైన కేసుల వివరాలు సిసిటిఎన్ఎస్ లో పొందుపరచాలన్నారు. తెలంగాణ పోలీసులు టెక్నాలజీ వినియోగంలో భాగంగా వినియోగించే సీసీటీఎన్ఎస్ 2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో ఈ-సమన్ల జారీ, అమలు,



టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్ , సీఈఐఆర్, సైబర్ క్రైమ్‌లో ఆర్థిక, ఆర్థికేతర నేరాల గురించి, సీడీఆర్ వంటి అన్ని రకాల సాఫ్ట్‌వేర్, అప్లికేషన్‌లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించి వాటిని రోజు వారి విధుల్లో విరివిగా వినియోగించాలన్నారు. పోలీసు స్టేషన్ కి కేటాయించబడిన వస్తువులను పరిశీలించారు. పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ ను బ్లూ కోల్ట్స్ సిబ్బంది వినియోగించే తీరును పరిశీలించారు. ఎఫ్ఐఆర్ ఇండెక్స్ ని పరిశీలించి, పెండింగ్ కేసులపై సమీక్ష చేసారు. వాటికి గల కారణాలు తెలుసుకుని త్వరితగతిన వాటిని పూర్తి చేయాలనీ సూచించారు. నమోదైన సైబర్ నేరాల గురించి తెలుసుకుని, విసబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రామడుగు పోలీసు స్టేషన్ పరిధిలో గల అన్నీ గ్రామాలను సెక్టార్లుగా, సబ్ సెక్టార్లుగా విభజించి వాటికి గ్రామ పోలీసు అధికారులను కేటాయించాలని ఆదేశించారు. నూతనంగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లకు పలు సూచనలు చేసి పోలీసు స్టేషన్ లో అన్ని రకాల విధులను సక్రమంగా నేర్చుకోవాలన్నారు. నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరని తెలిపారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని, ప్రతి నెల వారికి సంబందించిన నూతన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్ , చొప్పదండి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్ , రామడుగు ఎస్సై రాజులతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో నైపుణ్యం సాధించాలి

- క్రీడల్లో గెలుపు ఓటములు సహజం
- గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రధానం
- ఉప్పలచారి టేబుల్ ట్రస్ట్ సభ్యులు ఉప్పల అఖిల్

**తలకొండపల్లి, జూన్ 11 (జనంసాక్షి) :** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఉప్పల అఖిల్ అన్నారు. బుధవారం తలకొండపల్లి మండల కేంద్రంలో గత కొన్ని రోజుల నుండి జిల్లా ప్రజా పరిషత్ పాఠశాల మైదానంలో అండర్ 17 భాగంలో మహిళలు,పురుషులకు జిల్లాస్థాయి క్రీడలను ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ క్రీడా ముగింపు,బహుమతుల ప్రధానోత్సవంలో ముఖ్య అతిథిగా ఉప్పల చారిటేబుల్ ట్రస్ట్ సభ్యులు ఉప్పల అఖిల్ పాల్గొని అండర్ 17 భాగంలో వాలీబాల్,కాబడ్డీ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు,ఓటములు సహజమాని, విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని అన్నారు. క్రీడలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉప్పలచారి టేబుల్ ట్రస్టు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు. వేసవి సెలవులను వృధా చేయకుండా చక్కటి



క్రీడలను ఎంచుకొని, వాటిలో రాణించిన వారందరికీ అభినందనలు తెలిపారు. తలకొండపల్లిలో అండర్ 17 భాగంలో క్రీడలను ఏర్పాటు చేసిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి పద్మ నరసింహా,మాజీ సర్పంచ్ లలిత జ్యోతయ్య, సింగల్ విండో డైరెక్టర్ కటికల శేఖర్,హరిమోహన్ రెడ్డి,మాజీ వార్డు సభ్యులు దశరథం,శ్రీశైలంయాదవ్, సజ్జుపాషా, మల్లేష్,కోర్ర కృష్ణ, ఈశ్వర్,ఫిజికల్ డైరెక్టర్లు భాస్కర్ రెడ్డి,పాండు మల్లేష్ రాజు సాయి,వాలీబాల్ కోచర్ మల్లేష్, క్రీడాకారులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

- టీఎస్‌యుటిఎఫ్ జిల్లా కమిటీ



**వీపనగండ్ల, జూన్ 11 (జనం సాక్షి) :** ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఉధృతంగా పోరాటాలు చేయాల్సిన అవసరముందని టి ఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రవి ప్రసాద్ గౌడ్,జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కృష్ణయ్య పిలుపునిచ్చారుటిఎస్ యుటిఎఫ్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానుద్దేశించి వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వము అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి కాలయాపన చేస్తుందని ఆరోపించారు. అనేక సమస్యలు నేటికి పరిష్కారానికి నోచుకోవడం లేదని విమర్శించారు. ఐదు డిఏలు, పిఆర్సి పెండింగ్లో ఉన్నాయని,దాదాపు పది వేలకోట్లబకాయిలు కుబేరులో సిపిఎస్ అంశం ప్రస్తావన లేకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర విద్యాశాఖ చేపట్టిన బడిబాట కార్యక్రమం తమ సంఘం భుజాన వేసుకొని ప్రజలలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తుందని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం కృషి చేస్తుందన్నారు. వర్క్ అడ్జస్ట్మెంట్ శాస్త్రీయ పద్ధతుల్లో చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బి. వెంకటేష్, కే. జ్యోతి, కోశాధికారి టి.తిమ్మప్ప,జిల్లా కమిటీ సభ్యులు బి.అరుణ, జి.మురళి,అయోధ్య రాముడు,అగ్రిప్ప,రియాజ్, చెన్నకేశవులు, పి.శ్రీనువాసులు,బాలీశ్వర్, అనసూయ,డి.రాము, మల్లేష్,ప్రవీణ్, కురుమన్న,చిన్న స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మ రక్షణ కోసమే కరాటే

- వేములవాడ సీఐ వీరప్రసాద్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 11 (జనంసాక్షి) :** కరాటే ఆత్మ రక్షణకు ఎంతో దోహదపడుతుందని వేములవాడ సిఐ బి. వీరప్రసాద్ అన్నారు. బుధవారం వేములవాడ పట్టణ స్థానిక మహాదేవ్ ఫంక్షన్ హాల్‌లో ఓకినవా సీనియర్ కరాటే మాస్టర్ అబ్దుల్ మన్నాన్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపులో శిక్షణ పొందిన విద్యార్థులకు కరాటే గ్రేడింగ్ టెస్ట్ ప్రోగ్రాంకు పట్టణ సీఐ వీరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సుమారు 80 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని పలు రకాల బెల్ట్స్ సాధించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం వల్ల పిల్లలు శారీరకంగా మానసికంగా దృఢంగా వుంటారన్నారన్నారు. అమ్మాయిలు తమను తాము రక్షించుకోవడానికి కరాటే ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. కరాటేకి ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులతో పాటు కరాటే శిక్షణ ఇస్తున్న మాస్టర్ మన్నాన్ ను అభినందించారు. కాంగ్రెస్ నాయకుడు మైలారం రాము మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం వల్ల పిల్లలకు ఉద్యోగాల్లో క్రీడ కోటాలో రెండు శాతం రిజర్వేషన్ లభిస్తుందన్నారు. ఈ కార్య క్రమంలో కరాటే కోచర్లు లోలోపు రాజు, కనికరపు రాజశేఖర్, అనుగుల వర్షిత్, ప్రతాప రిషిక్ తేజ, గుడిసె సూర్య జయచంద్ర, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కోటి 42 లక్షల విలువ చేసే చెక్కులు మంజూరు చేయించిన మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు




**మంథని, జూన్ 11 (జనంసాక్షి) :** మంథని నియోజక వర్గం పరిధిలోని కాటారం మండలానికి కల్యాణ లక్ష్మి 84 చెక్కులు, 32 సీఎంఆర్ఎఫ్ చెక్కులు, మలహర్ రావు మండలానికి 41 కల్యాణ లక్ష్మి, 19 సీఎంఆర్ ఎఫ్..కోటి 42 లక్షల విలువచేసే చెక్కులను రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంజూరు చేయించారు. మంత్రి శ్రీధర్ బాబు పిఏ ఆకుల చంద్రశేఖర్ నేటి నుంచి లబ్ధిదారులకు నేరుగా వారి వద్దకు వెళ్లి చెక్కులను పంపిణీ చేయనున్నారు.

## విద్యార్థికి ఆర్థిక చేయూతనందించిన యస్‌బిఐటి



**ఖమ్మం, జూన్ 11 (జనంసాక్షి) :** ప్రకృతి వైపరీత్యం వల్ల తల్లిదండ్రులను కోల్పోయిన తమ కళాశాల విద్యార్థి షేక్ షరీఫ్ కు ఆర్థికంగా చేయూతను అందించినట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ ఒక ప్రకటనలో తెలియజేశారు. గత సంవత్సరం ఖమ్మం ను ముంచెత్తిన వరదలలో కూసుమంచి మండలం పాలేరు నాయకనూడెం వద్ద కళాశాల విద్యార్థి షరీఫ్ తల్లిదండ్రులైన షేక్ యాకూబ్ షేక్ సైదాభీ ఇద్దరూ మృతిచెందటంతో ఒంటరిగా మిగిలిన విద్యార్థి చదువులకు ఇబ్బంది కలగకుండా ఉండేలా నేషనల్ ఇన్సురెన్స్ ద్వారా 2 లక్షల రూపాయల చెక్కును బుధవారం కళాశాలలో విద్యార్థికి అందించారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఓదార్చి, కళాశాల యాజమాన్యం ఎల్లపుడూ తోడుగా ఉంటుందని తెలియజేశారు. ఏదైనా ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల వల్ల ప్రమాదవశాత్తు తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులకు తమ కళాశాల అండగా ఉంటుందని, అర్థంతరంగా విద్యకు ఆటంకం కలగకూడదనే సదుద్దేశంతో ఈ పథకాన్ని అవలంభిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రి తెలిపారు. విద్యార్థులు ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా ధైర్యాన్ని ఇవ్వడానికి ఇటువంటి ఆలోచన చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రాజ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డాక్టర్ ఎవివి.శివప్రసాద్, డాక్టర్ జె.రవీంద్రబాబు, డాక్టర్ యన్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## సింగర్ మంగ్లీ బర్త్‌డే పార్టీలో ఆమెతో సహా పలువురిపై కేసులు



**రాజేంద్రనగర్, జూన్ 11 (జనం సాక్షి) :** చేవెళ్ల మండలం ఈర్ల పల్లి గ్రామ శివారులో ఉన్న త్రిపుర లో సింగర్ మంగ్లీ బర్తడే పార్టీలో గంజాయి విదేశీ మద్యం పట్టుబడ్డయి. రాజేంద్రనగర్ డిసిపి తెలిపిన ప్రకారం ప్రతిరోజు పోలీసులు నిర్వర్తించే భద్రతల భాగంగా మంగళవారం రాజేంద్రనగర్, ఎస్ఓటి పోలీసులు చేవెళ్ల శివారు త్రిపుర రిసార్ట్స్ నుంచి అర్ధరాత్రి 12:45 సమయంలో విపరీతమైన డిజె సౌండ్ పొల్యూషన్ రావడంతో అక్కడికి చేరుకున్న రాజేంద్రనగర్ ఎస్ఓటి రాజేంద్రనగర్ పోలీసులు రిజల్ట్స్ లో పర్మిషన్ తీసుకోలేదని అలాగే మద్యం లైసెన్సుల పర్మిషన్ లేకపోవడంతో పోలీసులు డ్రగ్స్ పరీక్షలు నిర్వహించారు. ఈ పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్న మంగ్లీ డీజే నిర్వహిస్తూ మద్యం పర్మిషన్ లేకుండా నిర్వహించినందుకు ఆమెపై కేసు నమోదు చేశామని, ఈ డ్రగ్స్ పరీక్షల్లో దామోదర్ రెడ్డికి పాజిటివ్ రావడంతో నిందితుడిగా కేసు నమోదు చేశామని, అలాగే డీజే పర్మిషన్ లేకుండా నిర్వహించినందుకు మేఘరాజ్ అనే నిందితుడు పాటు త్రిపుర రిజల్ట్స్ జిఎం రామకృష్ణ పోలీసుల అనుమతి లేకుండా డీజే సిస్టం, మద్యం లైసెన్స్ పర్మిషన్ నిర్వహించినందుకు నిందితుడిగా నలుగురిపై కేసు నమోదు చేశామని ఎన్డీపిఎస్ యాక్టు సౌండ్ పొల్యూషన్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశామని, విచారణ దర్యాప్తు చేస్తున్నామని డిసిపి వెల్లడించారు.

## భూభారతితో భూ సమస్యలు పరిష్కారం

- జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు



**రేవల్లి, జూన్ 11 (జనంసాక్షి) :** భూభారతి కొత్త రెవెన్యూ చట్టంలో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని వనపర్తి జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారము ఏదుల మండలం రేకులపల్లిలో తహసిల్దార్ మల్లికార్జున్ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ సర్వే నెంబర్ 01 లో ఉన్న పాత రిజిస్ట్రేషన్ లో రైతులను స్వయంగా ఒక్కొక్కరిని పరిస్థితుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ రైతులు ఎక్కువ శాతం సర్వేనెంబర్ 1, 2, 3 ,4 ,169,180, 227, 228 నెంబర్లలో అసలైన రైతులకు పట్టాలు లేవని వేరే రైతుల పేరిట ఎక్కువ శాతం ఉన్నాయని వివరించారు. ఇట్టి విషయంపై తహసిల్దార్ కు ఇట్టి లిస్టును పరిశీలించి, సర్వేయర్ తో కలిసి మోకాపై లేని వారికి నోటీసులు ఇచ్చి వారిని తొలగించి, పట్టా లేని వారికి భూమి నమోదు చేయుటకు ప్రపోజల్ పంపమని ఆదేశించారు. అలాగే ఇట్టి ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని రైతులు ఆందోళన చెందవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిర్దావరి భాస్కర్ రెడ్డి, జేఏలు యాదగిరి, భరత్, రికార్డు అసిస్టెంట్లు రమేష్, ఆపరేటర్ వినయ్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

- చారకొండ ఏవో తనుజరాజు

**చారకొండ, జూన్ 11 (జనంసాక్షి) :** మండలంలో ఫర్టిలైజర్ డీలర్లు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో తనుజరాజు హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంతో పాటు జూపల్లి వివిధ ఫర్టిలైజర్ దుకాణాలను ఏవో తనుజరాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏవో తనుజరాజు మాట్లాడుతూ.. వానకాలం ప్రారంభం కావడంతో రైతులకు నాణ్యతమైన విత్తనాలు విక్రయించాలని నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు వారికి రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని అన్నారు. దుకాణాల్లో ఉన్న విత్తనాలు, ఎరువులు స్టాక్ రిజిస్టర్ లోని నోటీస్ బోర్డులో నమోదు చేయాలని అన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలలో ఉపాధ్యాయులను కేటాయించాలి

- ఎంవిఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష

**గద్వాల్ రూరల్, జూన్ 11 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని గట్టు కేటీ దొడ్డి మండలాల ప్రభుత్వ పాఠశాలలో విద్యా సంవత్సరం ప్రారంభం నుండే అవసరమైన ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేస్తూ బాలల హక్కుల పరిరక్షణ తల్లుల సంఘం ఆధ్వర్యంలో గద్వాల రాజీవ్ గాంధీ చౌక్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ వీరన్న మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా విద్యార్థుల నమోదు కు తగ్గట్టుగా ఉపాధ్యాయులను నియమించని కారణంగా విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరం అవుతున్నారని తల్లిదండ్రులు ఆందోళనకు గురి అవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ బడిని వదిలి ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గుచూపుతుండగా గట్టు,కేటీ దొడ్డి మండల పిల్లల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై ఇంకా విశ్వాసం ఉంచి రెండు మండలాలలో దాదాపు 15 వేల మంది పిల్లలను పాఠశాలలో చేర్పించారు. ఇందుకు గాను దాదాపు ఈ రెండు మండలాలలో ప్రభుత్వ నియమాలకు అనుగుణంగా అదనంగా 202 మంది ఉపాధ్యాయులు అవసరం ఉన్నదని ఒక అంచనా రాష్ట్రంలో ఉపాధ్యాయుల నియామకాలు జరిగినప్పుడల్లా విద్యార్థుల నమోదుకు తగ్గట్టుగా ఉపాధ్యాయులను నియమించకుండా విద్యార్థుల విద్యా హక్కు చట్టాన్ని ప్రభుత్వమే ఉల్లంఘిస్తున్నది. ఈ పరిస్థితిని ముఖ్యమంత్రి నుండి మొదలుకొని ప్రతి అధికారికి విన్నపాలు సమర్పించినా ఫలితం దక్కలేదు అన్ని జిల్లా బాలల హక్కుల పరిరక్షణ వేదిక తల్లుల సంఘం ఉపాధ్యాయులను వెంటనే నియమించాలని డిమాండ్ చేస్తూ గద్వాల రాజీవ్ గాంధీ చౌక్ వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాగర్ దొడ్డి వెంకట రాములు, ఆతుకూరి రెహమాన్, పిటి.ప్రభాకర్, నూర్ పాషా,డి.శేఖర్



నాయుడు,గంజిపేట రాజు,కురవ పల్లయ్య,రాజు నాయుడు,ఆంజనేయులు,మద్దిలేటి, శ్రీ రాములు, ఎండి.మాజ్, సామెలు,వెంకటేష్,కామేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంజేపీ డిగ్రీ సీట్ల కేటాయింపు రెండో జాబితా విడుదల

- ఇంటర్ మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు
- సీటు వచ్చిన విద్యార్థులు జూన్ 17లోగా రిపోర్ట్ చేయాలి
- ఎంజేపి సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు

**హైదరాబాద్, జూన్ 11 (జనంసాక్షి) :** బీసీ గురుకుల డిగ్రీ కాలేజీలో 2025%-%26 విద్యా సంవత్సరానికి అర్హత సాధించిన విద్యార్థుల రెండవ జాబితా వెబ్ సైట్ లో అందుబాటులో ఉందని సోసైటీ కార్యదర్శి బడుగు సైదులు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ జాబితా అభ్యర్థుల మెరిట్, సీటు లభ్యత (సీటు మ్యాట్రిక్స్), వారు ఇచ్చిన ప్రాధాన్యతల ఆధారంగా తయారు చేయబడిందని ఆయన తెలిపారు.

విద్యార్థులు తమ సీటు కేటాయింపు స్థితిని అధికారిక వెబ్‌సైట్ https://tgrdccet.cgg.gov.in/TGRDCWEB/ or https://mjptbcwreis.telangana.gov.in ద్వారా తెలుసుకోవచ్చు అని ఆయన పేర్కొన్నారు. సీటు కేటాయింపు పొందిన విద్యార్థులు 12.06.2025 నుండి 17.06.2025లోగా తమకు కేటాయించిన కళాశాలకు వెళ్లి అవసరమైన డాక్యుమెంట్లు ఇచ్చి అడ్మిషన్‌లో తీసుకోవాలని ఆయన తెలిపారు. నిర్ణీత గడువు లోగా తమకు కేటాయించిన కాలేజీలో రిపోర్ట్ చేయకపోతే సీటు రద్దు అవుతుందన్నారు. ఇంకా సమాచారం కోసం 040-23328266 నంబర్‌కి కాల్, లేదా mjptbcwreis14@gmail.comకు మెయిల్ పంపించాలని ఆయన కోరారు.

# టీమ్ లీడర్‌గా ఉండడం ఇష్టం

• శ్రేయస్ అయ్యర్



న్యూఢిల్లీ (జనంసాక్షి) : ఏ జట్టుకైనా నాయకత్వం వహించడం తనకెంతో ఇష్టమని పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అన్నాడు. టీమ్‌ను లీడ్ చేయడం వల్ల తనలోని అత్యుత్తమ ప్రతిభ బయటకు వస్తుందని శ్రేయస్ తెలిపాడు. అతడి కెప్టెన్సీలో సోబో ముంబయి ఫాల్కన్స్ టీమ్ టీ20 ముంబయి లీగ్ ఫైనల్‌కు చేరుకుంది. గత సంవత్సరం శ్రేయస్ కెప్టెన్సీ వహించిన అన్ని టీమ్స్ ఫైనల్‌కు చేరుకోవడం విశేషం. రంజీ ట్రోఫీ, ఐపీఎల్, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ అన్ని లీగ్స్‌లోనూ శ్రేయస్ నాయకత్వం వహించిన జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఐపీఎల్ గత సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు కెప్టెన్‌గా ట్రోఫీ అందించాడు. ఈ ఏడాది సీజన్ పంజాబ్ కింగ్స్‌ను రన్నరప్‌గా నిలిపాడు. 22 ఏళ్ల వయసులో ఉన్నప్పటి నుంచి సారథిగా వ్యవహరిస్తున్నందున తనకు మంచి అనుభవం ఉందని భావిస్తున్నట్లు తెలిపాడు. ఆ అనుభూతిని ఆస్వాదిస్తానని చెప్పాడు. శ్రేయస్ అయ్యర్ తన జట్లను ఫైనల్స్‌కు తీసుకెళ్లిన తీరు చూస్తుంటే అతడిలో దాగి ఉన్న ప్రతిభ కనిపిస్తుంది. గత ఐపీఎల్ 2024లో కోల్‌కతా నైట్ రైడర్స్ విజయంతో ఆయన హిట్ ట్రాక్ మొదలైంది. శ్రేయాస్ తన నాయకత్వంతో ముంబయి టీమ్‌ను సయ్యద్ ముష్తాక్ అలీ ట్రోఫీ, పంజాబ్ కింగ్స్‌ను ఐపీఎల్ ఫైనల్‌కు తీసుకెళ్లాడు.

# శ్రేయాస్ అయ్యర్ ఇంగ్లాండ్ టూర్‌కు ఎంపిక

• మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అసంతృప్తి..!



న్యూఢిల్లీ, జూన్ 11 (జనంసాక్షి) : ఇంగ్లాండ్ పర్యటనకు శ్రేయాస్ అయ్యర్‌ను జట్టులోకి తీసుకోకపోవడంపై మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఆగ్రహం వ్యక్తం చేశాడు. అయ్యర్ ఇటీవల మెరుగ్గా రాణిస్తున్నాడని.. తనికి అవకాశం ఇవ్వాల్సిందన్నారు. ఈ నెల 20 నుంచి ఇంగ్లాండ్-భారత్ మధ్య ఐదు మ్యాచుల టెస్ట్ సిరీస్ జరుగనున్న విషయం తెలిసిందే. ఈ సిరీస్ కోసం ఇప్పటికే భారత జట్టు ఇంగ్లాండ్‌కు చేరుకుంది. ప్రాక్టీస్ సైతం షురూ చేసింది. అయితే, టెస్టు జట్టులోకి అయ్యర్‌ను గంగూలీ అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఓ స్పోర్ట్స్ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఏడాది కాలంగా అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తున్నాడని.. అతను జట్టులో ఉండి ఉండాల్సిందని పేర్కొన్నారు చాలాకాలం జట్టుకు దూరంగా ఉన్న ఆటగాడని.. ఇప్పుడు ఒత్తిడిలోనూ పరుగులు సాధిస్తున్నాడని, బాధ్యత తీసుకుంటున్నాడని గుర్తు చేశాడు. షార్ట్ బాల్స్ బాగా ఆడుతున్నాడని.. టెస్ట్ క్రికెట్ భిన్నంగా ఉన్నప్పటికీ సిరీస్‌లో అతన్ని జట్టులో చేర్చాల్సిందని అభిప్రాయం వ్యక్తం చేశాడు మాజీ కెప్టెన్.

ఇంగ్లాండ్ పర్యటన కోసం 18 మంది సభ్యులతో జట్టును బీసీసీఐ ప్రకటించింది. ఇందులో అయ్యర్‌కు చోటు దక్కలేదు. ఇప్పటి వరకు అయ్యర్ భారత్ తరఫున 14 టెస్టులు ఆడాడు. ఇందులో ఒక సెంచరీ, ఐదు హాఫ్ సెంచరీల సహాయంతో 811 పరుగులు చేశాడు. గత సంవత్సరం ఇంగ్లాండ్‌తో జరిగిన ఇంగ్లాండ్ జట్టు భారత పర్యటనకు వచ్చిన సమయంలో చివరి టెస్ట్ ఆడాడు. కుడిచేతి వాటం బ్యాట్స్‌మెన్ 2024-25 రంజీ సీజన్‌లో అద్భుతంగా రాణించాడు. ముంబయి తరఫున ఏడు ఇన్నింగ్స్‌లలో 68.57 సగటుతో 480 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలున్నాయి. ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ తరఫున ఈ సీజన్‌లో బరిలోకి దిగిన శ్రేయాస్ అయ్యర్.. ఆ జట్టును ఫైనల్‌కు తీసుకెళ్లగలిగాడు. ఆర్‌సీబీతో జరిగిన ఫైనల్‌లో ఆరు పరుగుల తేడాతో ఓడి రన్నర్‌గా నిలిచింది. ఐపీఎల్‌లో అయ్యర్ బ్యాట్‌తోనూ రాణించాడు. 17 మ్యాచుల్లో 604 పరుగులు చేశాడు. ఇందులో ఆరు హాఫ్ సెంచరీలున్నాయి.

ఈ సందర్భంగా ఫాస్ట్ బౌలర్ బుమ్రా ఫామ్‌పై మాట్లాడుతూ.. ఇంగ్లాండ్‌పై బుమ్రా బౌలింగ్ కీలకం కానుందని చెప్పాడు. ఇంగ్లాండ్‌పై రెండు విషయాలు కీలకమని.. మంచి బ్యాటింగ్‌తో పాటు జస్ప్రీత్ బుమ్రా ఫిట్‌గా ఉండడమేనని చెప్పాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ లేని యువ బ్యాటింగ్ లైనప్‌తో మెల్బోర్న్‌లో (2020-21) ఆస్ట్రేలియాలో గెలిచామని.. కాబట్టి ఈ సారి ఎందుకు గెలవలేదో తనకు అర్థం కావడం లేదన్నారు. ఐదు మ్యాచుల టెస్ట్ సిరీస్‌లో భాగంగా భారత జట్టు ఇంగ్లాండ్‌లో పర్యటిస్తున్నది. ఈ సిరీస్‌లో భాగంగా తొలి టెస్ట్ జూన్ 20 నుంచి లీడ్స్‌లో మొదలు కానున్నది. రెండవ టెస్ట్ జూలై 2 నుంచి బర్మింగ్ హామ్‌లో జరుగుతుంది. మూడవ టెస్ట్ జూలై 10 నుండి లార్డ్స్.. నాల్గవ టెస్ట్ జూలై 23 నుంచి మాంచెస్టర్‌లో జరుగనున్నాయి. ఐదవ టెస్ట్ జూలై 31 నుంచి లండన్ లోని ఓవల్ మైదానంలో జరుగనున్నది. భారత జట్టు కొత్త ప్రపంచ టెస్ట్ చాంపియన్ షిప్ సైకిల్ (2025-27)లో శుభారంభం చేయాలని భావిస్తున్నది.

## ధోనీ స్టంపింగ్ 'పిక్ పాకెట్‌లాంటిది': రవిశాస్త్రి!

టీమ్‌ఇండియా లెజెండరీ మహేంద్రసింగ్ ధోనీ 2025 హాల్ ఆఫ్ ది ఫేమ్‌లో చోటు దక్కించుకున్నాడు. ఈ అరుదైవ గౌరవం అందుకోవడంతో ప్రముఖ క్రికెటర్లు ధోనీపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ క్రమంలో టీమ్‌ఇండియా మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి కీలక వ్యాఖ్యలు చేశాడు. ధోనీ స్టంపింగ్, పిక్ పాకెటర్ పనితనం కంటే వేగంగా ఉంటుందని రవిశాస్త్రి అన్నాడు. ధోనీ స్టంపింగ్ పిక్ పాకెటర్ కంటే వేగంగా ఉంటుదని రవిశాస్త్రి హాస్యాస్పదంగా పోల్చాడు. 'ఎవరైనా ఇండియాలో, ముఖ్యంగా అహ్మదాబాద్ (వరల్డ్‌కప్ ఫైనల్ లాంటి పెద్ద మ్యాచ్)లో మ్యాచ్ ఆడుతుంటే వికెట్ల వెనుక ధోని, ఉండకూడదని మీరు కోరుకుంటారు. ఒకవేళ వికెట్ల వెనక ధోనీ ఉంటే మీ పర్స్ మాయమవడం పక్కా! ధోనీ ఎంతో కూల్‌గా ఉంటాడు. అతడు సున్నాకు ఔటైనా, వరల్డ్‌కప్ నెగ్గినా లేదా సెంచరీ, డబుల్ సెంచరీ చేసినప్పుడు కూడా సింపుల్‌గా ఉంటాడు' అని రవిశాస్త్రి ఐసీసీ సెర్మనీ ఈవెంట్‌లో పేర్కొన్నాడు.



## ఎలావెనిల్‌కు కాంస్యం.. ఐఎస్‌ఎస్‌ఎఫ్ ప్రపంచకప్



మ్యూనిచ్ (జనంసాక్షి) : జర్మనీ వేదికగా జరుగుతున్న ఐఎస్‌ఎస్‌ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత్ బోణీ కొట్టింది. పోటీల తొలిరోజైన మంగళవారం భారత యువ షూటర్ ఎలావెనిల్ వాలరివన్ కాంస్య పతకంతో మెరిసింది. మహిళల 10మీటర్ల ఎయిర్‌రైఫిల్ విభాగం ఫైనల్లో ఎలావెనిల్ 231.2 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం ఒడిసిపట్టుకుంది. ఇదే కేటగిరీలో జీఫీ వాంగ్ (252.7, చైనా), ఎన్జీ క్వోన్ (252.6, కొరియా) వరుసగా స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నారు. అంతకుముందు జరిగిన క్వాలిఫయింగ్ పోరులో ఎలావెనిల్ 635.9 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో 2023లో నాన్సి (634.7)పేరిట ఉన్న జాతీయ రికార్డును తాజాగా ఎలావెనిల్ అధిగమించింది. మరోవైపు మహిళల 25మీటర్ల పిస్టల్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో తెలంగాణ యువ షూటర్ ఇషాసింగ్ (294)నాలుగో స్థానంలో నిలిచింది. ఇదే కేటగిరీలో పోటీపడ్డ దివ్య (11), మనుభాకర్ (15), సిమ్రన్‌ప్రీత్‌కౌర్(24), రాహి సర్నోబత్ (47) తీవ్రంగా నిరాశపరిచారు.

## అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ పలికిన పూరన్



పోర్ట్ ఆఫ్ స్పెయిన్: ఈ ఏడాది స్టార్ క్రికెటర్ల రిటైర్మెంట్ల పరంపరను కొనసాగిస్తూ మరో ఆటగాడు క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఆధునిక క్రికెట్‌లో బంతిని బలంగా బాదగల సమర్థుడు, టీ20 క్రికెట్‌లో సంచలన బ్యాటింగ్‌తో దుమ్మురేపుతున్న వెస్టిండీస్ వికెట్ కీపర్ బ్యాటర్ నికోలస్ పూరన్ అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌కు రిటైర్మెంట్ ఇచ్చి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాడు. అతడి వయసు 29 ఏండ్లు మాత్రమే కావడం గమనార్హం. 2016లో కరేబియన్ జట్టు తరఫున అరంగేట్రం చేసిన ఈ హార్డ్ హిట్టర్.. ఇప్పటిదాకా 106 టీ20లు, 61 వన్డేలు ఆడాడు. వెస్టిండీస్ తరఫున టీ20లలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో పూరన్ (2,275 రన్స్) అగ్రస్థానంలో ఉన్నాడు.

50 ఓవర్ల ఫార్మాట్‌లో అతడు.. 39.66 సగటుతో 1,983 రన్స్ సాధించాడు. ప్రస్తుతం ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న వెస్టిండీస్ టీ20 జట్టులో పూరన్‌కు చోటు దక్కలేదు. ఈ నేపథ్యంలోనే పూరన్.. ఇంటర్నేషనల్ క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు పలికినట్టు వార్తలు వస్తున్నాయి. రిటైర్మెంట్‌పై పూరన్ స్పందిస్తూ.. 'సుదీర్ఘ ఆలోచనల తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నా. ఈ ఆట నాకు చాలా ఇచ్చింది. మెరూన్ రంగు జెర్సీ ధరించడం, జాతీయ గీతం కోసం నిలబడటం నాకు ఎంతో ప్రత్యేకం' అని రాసుకొచ్చాడు. పూరన్ చివరిసారిగా 2024 డిసెంబర్‌లో వెస్టిండీస్ తరఫున టీ20 మ్యాచ్ ఆడాడు. 2022లో విండీస్ పరిమిత ఓవర్ల జట్టుకు సారథిగా నియమితుడైన పూరన్.. ఆ ఏడాది టీ20 వరల్డ్ కప్ పరాభవం తర్వాత ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. జాతీయ జట్టు నుంచి వైదొలిగినా ఫ్రాంచైజీ క్రికెట్‌లో అతడు కొనసాగనున్నాడు. ఐపీఎల్‌లో పూరన్ లక్నో సూపర్ జెయింట్స్ తరఫున ఆడుతున్న విషయం విదితమే. ఇటీవలే ముగిసిన 18వ సీజన్‌లో అతడు.. ఏకంగా 196 సగటుతో 524 రన్స్ చేశాడు.




## టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా.. ఆస్ట్రేలియా ఫస్ట్ బ్యాటింగ్

• వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్..

లండన్ (జనంసాక్షి) : డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో జరుగుతున్న వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్లో ఇవాళ టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా జట్టు మొదట బౌలింగ్ ఎంచుకున్నది. ఆస్ట్రేలియా తరపున ఓపెనర్‌గా లబుషేన్ ఆడనున్నాడు. సఫారీ జట్టులోకి లుంగి ఎంగిడి వచ్చాడు. వరల్డ్ టెస్టు ర్యాంకింగ్స్‌లో ప్రస్తుతం ఆస్ట్రేలియా టాప్‌లో ఉన్నది. దక్షిణాఫ్రికా మూడవ స్థానంలో ఉంది. ఆసీస్ బ్యాటర్ లబుషేన్ టెస్టుల్లో తొలిసారి ఓపెనింగ్ చేయనున్నాడు. కెమరూన్ గ్రీన్ మూడవ స్థానంలో బ్యాటింగ్ రానున్నాడు. ఆసీస్ జట్టులోకి హేజిల్‌వుడ్‌ను తీసుకున్నారు. స్కాట్ బోలాండ్‌కు అవకాశం దక్కలేదు.

## స్థానిక ఎన్నికల కోసం ఎదురుచూపు



కరీంనగర్, జూన్11 (జనంసాక్షి) : స్థానిక ఎన్నికల కోసం బిఆర్‌ఎస్ క్యాడర్ ఎదురు చూస్తోంది. ఎన్నికల్లో సత్తా చాటాలని చూస్తున్నారు. ఇప్పటికైతే పెద్దగా ప్రభావం చూపలేకపోతున్నా, స్థానిక ఎన్నికల్లో మాత్రం ప్రభావం చూపుతామని స్థానిక నేతలు ధీమాగా ఉన్నారు. ఉత్తర తెలంగాణ ఎప్పుడూ బిఆర్‌ఎస్‌కు కంచుకోటగా ఉండేది. మెదక్ ఇక చెప్పాల్సిన పనిలేదు. అయితే బిఆర్‌ఎస్ స్వయంకృతం కారణంగా ఆ పార్టీ ఎక్కడా ఉనికి లేకుండా పోతోంది. గత పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తరవాత ఇప్పుడుమరింత ప్రాభవాన్ని కోల్పోయింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టక పోవడంతో పార్టీ కేడర్‌లో నిస్తేజం ఆవరించింది. ప్రజాందోళనల మాట ఎలా ఉన్నా కనీస కార్యక్రమాలు కూడా సాగడం లేదు. మరో మూడున్నరేళ్ల వరకు దానికి భవిష్యత్ లేనట్లుగానే భావించాలి. కరీంనగర్ మేయర్, జగిత్యాల ఎమ్మెల్యే ఇలా ఒక్కొక్కరుగా బిఆర్‌ఎస్‌ను వీడారు. నిజానికి కరీంనగర్ బీఆర్‌ఎస్‌కి కంచుకోట. టీఆర్‌ఎస్ ఆవిర్భావం నుంచి ప్రతి ఎన్నికలో సత్తా చాటింది. అంతే కాకుండా కరీంనగర్‌ని, బీఆర్‌ఎస్‌ను విడదీయలేని పరిస్థితి. ఇక్కడ నెగ్గితే తెలంగాణ అంతా పాజిటివ్ ఫలితాలు వస్తాయనే సెంటిమెట్ ఉండేది. 2019 ఎన్నికల నుంచి బీఆర్‌ఎస్ కంచుకోటకి బీటలు వారుతున్నాయి. పార్లమెంటు ఎన్నికలలొ కనీసం పోటీ కూడా ఇవ్వకుండా మూడవ స్థానానికే పరిమితం కావడం గమనార్హం. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా గులాబీ పార్టీ అనుకూల ఫలితాలు సాధించింది. తెలంగాణ ఉద్యమ సమయంలొ జరిగిన ఉప ఎన్నికలలో గులాబిజెండా రెపరెపలాడింది. తెలంగాణ ఆవిర్భావం తరువాత జరిగిన రెండు అసెంబ్లీ ఎన్నికలలో క్లీన్‌స్వీప్ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలలో తొంభై ఐదు శాతానికి పైగా ఫలితాలు సాధించింది. ఈజిల్లాలొ బీఆర్‌ఎస్‌కు ఇక తిరుగులేదన్న సమయంలో 2019 ఎన్నికలలో బిఅర్‌ఎస్‌కి మొదటిషాక్ తగిలింది. తరువాత 2023 అసెంబ్లీ ఎన్నికలలో అనుకూలమైనా ఫలితాలు సాధించలేక పోయింది. కనీసం ఎంపి ఎన్నికలలొ గట్టి పోటి ఇస్తామని నేతలు భావించారు, ఈ ఎన్నికలతొ పార్టీ బలోపేతం అవుతుందని అంచనాలు వేసుకున్నారు. పోటి మాట ఏమో గాని మూడవస్థానానికే పరిమితమై బిఅర్‌ఎస్ శ్రేణులను తీవ్ర నిరాశకి గురి చేసింది. రాష్ట్రంలో ఒకటో రెండో సీట్లు బిఅర్‌ఎస్ గెలిస్తే అది కరీంనగర్‌లోనే గెలుస్తుందని నేతలు భావించారు. కానీ వ్యతిరేక ఫలితాలు వచ్చాయి? ఇక్కడ పార్టీ గట్టిగా ఉన్న కనీసం రెండవ స్థానంలో కూడా నిలబడలేదు. కరీంనగర్ పార్లమెంటు ఫరిధిలో ఏడు అసెంబ్లీలలో ఎక్కడ కూడా పోటీ ఇవ్వలేక పోయింది?. బిఅర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఅర్ ప్రాతినిథ్యం వహిస్తున్న సిరిసిల్లలో కూడా అదే పరిస్థితి కనిపించింది. మాజీ మంత్రి గంగుల కమలాకర్ ప్రాతినిథ్యం వహిస్తున్న కరీంనగర్ అసెంబ్లీలొ కనీస ఓట్లు కూడా సాధించలేక పోయింది. మూడవస్థానానికే పరిమితం అయ్యింది. బిఅర్‌ఎస్ ఎమ్మెల్యే ఉన్న హుజురాబాద్ లోకూడా మూడవస్థానానికే పరిమితం అయ్యింది. ఒకప్పుడు క్యాడర్,లీడర్ లతో బలంగా ఉన్న బిఅర్‌ఎస్ ఇప్పుడు మూడవస్థానానికే పరిమితం కావడంతో క్యాడర్ అంతా అయోమయానికి గురి అవుతుంది. అయితే ఇది తాత్కలిక అపజయమేనని,స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా ఏమిటో చూపిస్తామని బిఅర్‌ఎస్ నేతలు అంటున్నారు. ఇప్పటి నుంచే స్థానిక ఎన్నికల కోసం నేతలు ఎదురు చూస్తున్నారు. దేశంలో 75 ఏళ్లలో ఏ రాష్ట్రం సాధించని విజయాలను తెలంగాణలో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం సాధించిందని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేర్కొన్నారు. అస్తిత్వం కోసం 60ఏళ్లు పోరాడిన తెలంగాణ నేల.. బిఆర్‌ఎస్ హయాంలో అభివృద్ధిలో శిఖరాగ్రానికి చేరిందన్నారు. తొమ్మిదిన్నరేదేళ్ల స్వల్ప కాలంలోనే ఆర్థిక వృద్ధి, తలసరి ఆదాయం పెరుగుదల, విద్యుత్ సరఫరా, తాగు, సాగునీటి సదుపాయం కల్పన, ప్రజా సంక్షేమం, పారిశ్రామిక, ఐటీ రంగాల ప్రగతిలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. కఠినమైన, పటిష్ట మైన ఆర్థిక క్రమశిక్షణతో ఆదాయ వనరులను పెంచుకుంటూ 2014 నుంచి 2023 వరకు దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో జలవిప్లవం, హరిత విప్లవం, క్షీర విప్లవం, నీలి విప్లవం, గులాబీ విప్లవాలతో దేశానికి ఆదర్శంగా నిలిచామని చెప్పారు. ల్లె ప్రగతికి నేరుగా

# బాల్యంపై బరువు!

• నేలను చూస్తున్న పసి నడుములు
• బ్యాక్‌గ్ పెయిన్ తో చిన్నారుల అవస్థలు
• వ్యాపారంగామారిన నోట్ పుస్తకాలు
• అవసరానికి మించిన పుస్తకాలు అంటగడుతున్న విద్యా సంస్థలు
• మోయలేక పిల్లల అవస్థలు
• అయోమయంలో తల్లిదండ్రులు
• పిల్లల భవిష్యత్తు పణంగా పెడుతున్నారంటూ మేధావుల ఆవేదన
• నేటి నుండి బడులు పునః ప్రారంభం



సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 11 (జనం సాక్షి) : నాలుగైదు దశాబ్దాల కిందట చదివిన వారు కలెక్టర్లు, డాక్టర్లు, ఇంజినీర్లు అయినారు... ఆ రోజుల్లో ఒకటో తరగతికి ఒక పలక, బలపం, పుస్తకం, గుడ్డ సంచి ఉండేవి... ఇప్పుడు కూడా ఇంటర్మీడియట్, డిగ్రీ చదివే విద్యార్థులు నాలుగు నోటు పుస్తకాలు చేత పట్టుకుని స్టైల్గా కాలేజీకి వెళ్తున్నారు... కానీ చిన్న పిల్లలకు మూడేళ్ల వయసు రాక ముందే తల్లిదండ్రులు బలవంతంగా బడి బాట పట్టిస్తున్నారు... పిల్లోడి బరువు ఏడెనిమిది కేజీలు ఉండగా.. వాడు మోసే పుస్తకాల సంచి బరువు అంతే ఉంటోంది... ఆడుకుంటూ కింద పడితే హైరానా పడే తల్లిదండ్రులు.. అదే పిల్లవాడు మోయలేని బరువుతో పుస్తకాలు మోసుకుపోతున్నా చదువు ముసుగులో సర్దుకుపోతున్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో చదువు విద్యార్థులకు రోజురోజుకు భారంగా మారుతోంది. కొన్ని పాఠశాలల్లో తరగతి గదులు మూడు, అంతస్తుల్లో భుజానికి ఒక పెద్ద బ్యాగు, ఒక చేతిలో లంచ్ బ్యాగ్, మరో చేతిలో వాటర్ బాటిల్. వాటిని మోసుకుంటూ మెట్లను ఎక్కుతూ అంతస్తు ల్లోకి వెళ్లాలంటే వారికి ఎవరెస్టు ఎక్కినంత పనవుతోంది. ఏదో ఒక రోజు, రెండు రోజులు కాదు.. ఇదో దిన చర్య... ఇలా వయసుకు మించిన భారంతో విద్యార్థులు తీవ్ర ప్రయాసకు గురవుతున్నారు. ఇది వారి ఆరోగ్యంపై ప్రభావం చూపే ప్రమాదం ఉంది. నిబంధనలు ఎన్ని ఉన్నా పుస్తకాల భారం మాత్రం తప్పడం లేదని విద్యావేత్తలు పెదవి విరుస్తున్నాడు.

### అనవసరమైనవే అధికం

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆరు సబ్జెక్టులకు ఆరు. పాఠ్య పుస్తకాలు, ఆరు నోట్ బుక్స్ ఉంటాయి. కానీ కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఒకటవ తరగతి చదువుతున్న విద్యార్థికి 15 పుస్తకాల వరకు ఉంటున్నాయి. ఒక్కో సబ్జెక్టుకు తరగతి వర్క్ హెూం వర్క్ ప్రాజెక్టు పని ఇలా మూడేసి పుస్తకాల వంతున తీసుకోవాల్సి వస్తోంది. కేజీలకు కేజీల కొద్దీ పుస్తకాలతో ఉన్న బ్యాగు మోయలేక బడి పిల్లలు వెన్ను వంగిపో తోంది. ఇంతకాలం ఆటపాటలతో అల్లరి చేసిన చిన్నారులు వేసవి సెలవులకు టాటా చెప్పి బడిబాట పట్టనున్నారు. కొంతమంది విద్యార్థుల బరువుకు మించి పుస్తకాల సంచి బరువు ఉందంటే ఆశ్చర్యం కాదు. ఆరోగ్య రీత్యా ఈ విధానం మంచిది కాదని వైద్యులు హెచ్చరి స్తున్నా పిల్లల తల్లిదండ్రులు, విద్యార్థులు, సంస్థల యాజమాన్యాలు పట్టించుకో వడంలేదు.

### ఎలిమెంటరీ పిల్లలకు ప్రాజెక్టు వర్కు

అవసరానికి మించిన పుస్తకాలను అంటగడుతున్న విద్యా సంస్థలు ఎలిమెంటరీ స్థాయి పిల్లలతో ప్రాజెక్టు వర్కులు చేయిస్తున్నారు. నిజానికి ఆ వయసు పిల్లలు స్వయంగా ప్రాజెక్టు వర్కులను పూర్తి చేయలేరు. వారి బదులుగా తల్లిదండ్రులే ఆ వర్క్ ను పూర్తి చేసి దానిని పిల్లల ఖాతాలో వేస్తారు. ఈ విషయం సదరు విద్యాసం స్థలకు కూడా తెలుసు. అయితే దీని ద్వారా ఎవరు ఎవరికి చదువు నేర్పుతున్నారో అన్నదే అసలు ప్రశ్నగా మారింది. ఈ తరహా చదువులు పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దలేవన్నది మేధావుల వాదన.

### స్కూళ్లలోనే విక్రయాలు

స్కూళ్లకు సంబంధించిన పుస్తకాలను కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి మరీ విక్రయిస్తున్నాయి. స్కూల్ ఫీజులకు సంబంధం లేని వీటి ధరలు చుక్కలనంటుతున్నాయి. ఒక్కో సబ్జెక్టుకు క్లాస్ వర్క్, హెూం వర్క్, ప్రాజెక్ట్ వర్క్ అంటూ రకరకాల పేర్లతో సబ్జెక్టుకు 3-4 పుస్తకాలను విక్రయిస్తున్నారు. ఆ పాఠశాలల్లో చదువుకోవడాన్నే గౌరవంగా భావించే పలువురు తల్లిదండ్రులు నానా కష్టాలు పడుతూ ఆ పుస్తకాలను కొనుగోలు చేసుకుంటున్నారు. ఇటీవలే పలు స్కూళ్లలో విక్రయాలు చేపడుతున్న పలు ప్రైవేటు పాఠశాలలపై విజిలెన్స్ అధికారులు తనిఖీలను చేపట్టినప్పటికీ నియంత్రణ మాత్రం చేయలేకపోయారు. ఇదంతా ప్రైవేటు పాఠశాల యాజమాన్యాల దందా అంటూ పలు విమర్శలు వినవస్తున్నాయి.


### ఆర్థిక భారంతో తల్లిదండ్రులు

ఫీజులనే భారంగా భావిస్తున్న తరుణంలో ఈ పుస్తకాల ఖర్చులు మరింత భయపెడుతున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. అమెరికా వంటి అగ్రరాజ్యాలలో కూడా ప్రైవేటు విద్యా సంస్థలు బలీయంగా లేవని, మరి మనకి మాత్రం ఎందుకీ దుస్థితి అంటూ వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని పుస్తకాలయినా పిల్లల కోసమే అని చెప్పే విద్యాసంస్థలు కనీసం వాటిని తరగతి గదుల్లో నే దాచుకునే విధంగా లాకర్లను ఏర్పాటు చేయాలి. ఫలితంగా వారంలో అన్ని రోజులు పుస్తకాలు మోసే ఆవస్థ నుంచి పిల్లలకు ఉపశమనం లభిస్తుంది.

### ప్రకటనలకే పరిమితం

'బాలకార్మికులను బడికి పంపండి. పసివారికి పసిడి భవిష్యత్తు అందించండి..' అనే ప్రకటనలు నిత్యం మనకు కనిపిస్తూనే ఉంటాయి. కానీ విద్యార్థులు అనుభవిస్తున్న కష్టాలు మాత్రం ఎవరికీ పట్టడం లేదు. భుజాలపై పుస్తకాల బరువు రోజురో జుకూ పెరుగుతూనే ఉంది. ఏ ఏటికాఏడు పెరుగుతున్న బరువుకు పిల్లల నడుములు వంగి పోతున్నాయి. బాలల దినోత్సవం మొదలు కొని బాలకార్మికుల దినోత్సవం వరకు పిల్లల గురించి మాట్లాడే మన నాయకులు, విద్యావేత్తలు ఈ సమస్యను పెద్దగా పట్టించుకోనట్టే కనపడుతుంది. గట్టిగా అడిగితే.. ఆ పుస్తకాలు మా కోసమా? అంటూ విద్యా సంస్థలు ఎదురు ప్రశ్నిస్తున్నాయి. మరి ఎవరి కోసం ఇన్ని పుస్తకాలు? అని అడిగితే సమాధానం మా త్రం దొరకదు. ఒకపుడు ఇన్ని పుస్తకాలు మోయకుండానే రాష్ట్రంలో, దేశంలో ఎందరో మేదావులు దేశ ఖ్యాతిని ప్రపంచ నలుమూలలా చాటి చెప్పారు.

### అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం : హెూప్ న్యూరో కార్డియాక్ డాక్టర్ కృష్ణమూర్తి



అతి చిన్న వయసు లో విద్యార్థులకు పుస్తకాల భారం మోపితే భవిష్య త్తులో అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి. వెన్నుపూన వ్యాధులు తలెత్తే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా ఎదుగుదల తగ్గిపోయే ప్రమాదం ఉంది. రోజూ శక్తి మించి బరువు మోయడంతో మానసిక సమస్యలు తలెత్తి వారిని ఆందోళనకు గురి చేసి అవకాశం ఉంది.

# కాళేశ్వరంపై ఎందుకీ దోబూచులాట?

### ఓపెన్ కోర్టును ఎందుకు వద్దన్నారో చెప్పాలి

**చైనాలో అయితే వెంటనే ఉరితీసేవారు**

**30వేల కోట్ల ప్రాజెక్టుకు లక్ష ఖర్చుచేస్తారా?**

**ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శలు**



**న్యూఢిల్లీ, జూన్11 (జనంసాక్షి) :** మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం కమిషన్ విచారణపై కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందించారు. ఇప్పటి వరకు విచారణకు వచ్చిన అందరూ కమిషన్ ముందు ఓపెన్ కోర్టులో సమాధానాలు చెప్పారని... కేసీఆర్ కమిషన్ ముందు ఎందుకు వన్ టు- వన్ అడిగారో చెప్పాలని డిమాండ్ చేశారు. కమిషన్ ముందు కేసీఆర్ హాజరు కావడాన్ని కేటీఆర్ జీర్ణించుకోలేక ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. అసలు ప్రభుత్వానికి కుట్ర చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఇచ్చిందే కాంగ్రెస్ అని అన్నారు. తెలంగాణను అప్పుల పాలు చేశారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి 48 లక్షలు ఎకరాలకు నీళ్లు అందించినట్టు వారు చేబితే సమర్థించే వాళ్ళమన్నారు. కమిషన్ ముందు వన్ టూ వన్ మాత్రమే సమాధానం చెప్తానని కేసీఆర్ ఎందుకు అన్నారని.. వన్ టూ వన్ మాట్లాడాల్సిన అవసరం ఎందుకొచ్చిందో కేటీఆర్ చెప్పాలన్నారు. కేసీఆర్ కట్టిన ప్రాజెక్టు చైనాలో కట్టి ఉంటే ఉన్నతమైన అవార్డు వచ్చేదని కేటీఆర్ అంటున్నారని.. చైనాలో ఇలాంటి ప్రాజెక్టు కేసీఆర్ కట్టి ఉంటే ఈరోజు ఆయన్ను ఉరి తీసేవారని వ్యాఖ్యలు చేశారు. రూ. 30 వేల కోట్లు అయ్యే ప్రాజెక్టుకు లక్ష కోట్లు ఖర్చు చేశారన్నారు. చైనాలో ఇలాంటి కమిటీ వేస్తే రెండు రోజుల్లో కేసీఆర్‌ను ఉరి వేసేవారన్నారు. కేసీఆర్‌కు ఏ దేశంలో అత్యున్నత అవార్డు ఇస్తారో చెప్పాలన్నారు. ఇకపోతే ఐకేపీ సెంటర్లో గతంలో కంటే ఈసారి వడ్లు ఎక్కువగా కొనుగోలు చేశామన్నారు. కేసీఆర్ హయాంలో ఎప్పుడు సన్న బియ్యం తినిపించలేదన్నారు. అధికారం కోల్పోయిన బాధ బీఆర్ఎస్ నేతల్లో ఉందన్నారు. రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు 'మీ ఇంట్లో మీ మీరు పంచాయతీలు పెట్టుకున్నట్టు డ్రామా' చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇల్లులు, రాష్ట్రంలో సన్న బియ్యం, భూ భారతి వంటి బ్రహ్మాండమైన పథకాలు వచ్చాయన్నారు. ప్రజలను డైవర్షన్ చేసే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ పదేళ్లు పరిపాలించి కట్టిన ప్రాజెక్టు కూలిపోయిందని అన్నారు. నిజాం సాగర్, కడియం ప్రాజెక్ట్, లోయర్ మానేరు, సింగూర్ డ్యాం కాంగ్రెస్ హయాంలో కట్టాం ఎక్కడ కూలిపోలేదని తెలిపారు. పదేళ్లలో కేసీఆర్ కట్టిన కాళేశ్వరం కూలిపోయిందన్నారు. కక్షయ సాధింపుల కోసం ఈ కమిషన్‌ను తీసుకురాలేదన్నారు. కేసీఆర్‌కు అత్యున్నత పదవి కావాలని అనుకుంటే కమిషన్లకు కక్కుర్తి పడకుండా ఉండాల్సిందని హితవుపలికారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తిట్టడం తప్ప కేటీఆర్ చేసింది ఏమీ లేదని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు.

# అక్రమ మైనింగ్ కేసులో గాలి జనార్ధన్‌రెడ్డికి ఊరట

### నాంపల్లికోర్టు తీర్పును సస్పెండ్ చేసిన హైకోర్టు

**గాలి సహా నలుగురికి బెయిల్ మంజూరు**



**హైదరాబాద్, జూన్11 (జనంసాక్షి) :** ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో నలుగురు దోషులకు తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. గాలి జనార్ధనరెడ్డితో పాటు,ఆయన పీఏ అలీఖాన్, బీవీ శ్రీనివాస్‌రెడ్డి, రాజగోపాల్‌కు బెయిల్ ఇచ్చింది. ఈ నలుగురికి నాంపల్లి సీబీఐ కోర్టు విధించిన ఏడేళ్ల జైలు శిక్షను సస్పెండ్ చేసింది. దేశం విడిచి వెళ్లరాదని, రూ.10 లక్షలు సొంత పూచీకత్తు సమర్పించాలని షరతు విధించింది. పదిహేనేళ్ల పాటు సుదీర్ఘంగా సాగిన ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో మే 6న నాంపల్లి సీబీఐ కోర్టు తీర్పు వెలువరించింది. ప్రధాన నిందితులైన బి.వి.శ్రీనివాసరెడ్డి, గాలి జనార్ధనరెడ్డి, వి.డి.రాజగోపాల్, మెఫజ్ అలీఖాన్‌లకు ఒక్కొక్కరికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల చొప్పున జరిమానా విధించింది. ప్రభుత్వ ఉద్యోగి అయిన రాజగోపాల్‌కు అదనంగా 4 ఏళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించారు. ఈ తీర్పును వీరు హైకోర్టులో సవాల్ చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణ హైకోర్టు తాజా తీర్పుతో వీరికి ఊరట లభించింది. ఓఎంసీ కేసులో నిందితురాలైన ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి పిటిషన్‌పై విచారణను హైకోర్టు 19వ తేదీకి వాయిదా వేసింది. కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐకి నోటీసులు జారీ చేసింది.

# ట్యాపింగ్ కేసులో ముగిసిన ప్రభాకర్ రావు విచారణ

### దాదాపు 9 గంటల పాటు అధికారుల ప్రశ్నలు

**తెలియదు...జ్ఞాపకం లేదంటూ సమాధానం**

**14న మరోమారు విచారణకు రావాలని ఆదేశం**

**హైదరాబాద్, జూన్11 (జనంసాక్షి) :** తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు విచారణ ముగిసింది. ప్రభాకర్ రావును 9 గంటల పాటు సిట్ అధికారులు విచారించారు. జూన్ 14న మరోసారి విచారణకు రావాలని సిట్ అధికారులు ఆదేశించారు. నేడు సుదీర్ఘంగా ప్రభాకర్ రావుని సిట్ ప్రశ్నించింది. చాలా ప్రశ్నలకు ఎస్ఐబీ మాజీ చీఫ్ సమాధానాలను దాటవేశారు. కొన్ని ప్రశ్నలకు అధికారికం, వ్యక్తిగతం అంటూ సమాధానాలు ఇచ్చారు. ఇంకొన్ని వాటికి అయితే తెలీదు, గుర్తులేదు అంటూ ప్రభాకర్ రావు సమాధానం ఇచ్చారు. కొంత సమాచారాన్ని ధ్రువీకరించలేను అంటూ సిట్ అధికారులతో చెప్పారు. తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో జూన్ 14న ప్రభాకర్ రావు, ప్రణీత్ రావులను కలిపి సిట్ విచారించనునట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ప్రభాకర్ రావు నుంచి సిట్ స్వాధీనం చేసుకోలేదు. అయితే కొన్నింటికి రాత పూర్వకంగా సమాధానాలు తీసుకుంది. జూన్ 9న ప్రభాకర్ రావు సిట్ ముందు హాజరైన విషయం తెలిసిందే. సిట్ అధికారులు ఆయనను దాదాపు 8 గంటల పాటు- విచారించారు. ఈ కేసులో ఇప్పటివరకు సేకరించిన ఆధారాలను ముందు ఉంచి ప్రశ్నించారు. 2023 అసెంబ్లీ ఎన్నికలు, అంతకు ముందు జరిగిన ఉప ఎన్నికల సమయంలో ఆయన వాడిన అధికారిక, అనధికారిక సెల్‌ఫోన్లను తమకు అప్పగించాలని సిట్ అధికారులు మొదటిరోజు ఆదేశించారు. సెల్‌ఫోన్లతో పాటు ల్యాప్‌టాప్, మ్యాక్ నోట్‌బుక్‌లను సైతం తీసుకురావాలని సూచించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావుపై పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో ఏ1గా ఉన్నారు. కేసు నమోదైన సమయంలోనే ప్రభాకర్ రావు అమెరికా వెళ్లిపోయారు. ఆయన తిరిగి రాకపోవడంతో పోలీసులు పాస్‌పోర్టు రద్దు చేయించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు విచారణకు సహకరించేందుకు ఎమర్జెన్సీ ట్రావెల్ డాక్యుమెంట్‌తో జూన్ 8న రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు. ఇప్పటికే ప్రణీత్ రావు, రాధాకిషన్ రావు, భుజంగ రావు, తిరుపతన్నను సిట్ అధికారులు అరెస్టు చేశారు. వారు ఇచ్చిన సమాచారం ఆధారంగా ప్రభాకర్ రావును ప్రశ్నించినట్లు తెలుస్తోంది.

# సమిష్టి పోరాటంతోనే తెలంగాణ ఏర్పాటు

### ఏ ఒక్కరి వల్లనో రాష్ట్రం ఏర్పడలేదు

**మహబూబాబాద్ ఎంపి బలరాం నాయక్**




**ములుగు, జూన్11 (జనంసాక్షి) :** కేసీఆర్ ఒక్కడితో తెలంగాణ రాలేదని, తామంతా పోరాడితేనే సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారని మహబూబాబాద్ ఎంపి బలరాం నాయక్ అన్నారు. మేమందరం పార్లమెంటులో కొట్లాడితే తెలంగాణ వచ్చిందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రాష్ట్రంలో మరో 25 ఏళ్ల పాటు కాంగ్రెస్‌ను నిలబెట్టాలన్న సంకల్పంతో ముందుకు వెళ్తోందని అన్నారు. ములుగు జిల్లాలో జరిగిన ఇందిరమ్మ మహిళ పట్టాల పంపిణీ కార్యక్రమం సభ రాజకీయ వ్యాఖ్యలతో హాట్ టాపిక్‌గా మారింది. ఈ కార్యక్రమంలో రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు, ఎంపీ బలరాం నాయక్, ఇతర నాయకులు పాల్గొన్నారు.అయితే, ఈ సభలో ఎంపీ బలరాం నాయక్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గిరిజన యూనివర్సిటీకి ప్రహరీ గోడ నిర్మాణం కోసం నిధులు వస్తున్నాయి. మొత్తం 800 కోట్ల నిధులు తీసుకువస్తున్నాం అని అన్నారు. మారుమూల గ్రామాలకు బ్రిడ్జిలు నిర్మించేందుకు నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అలాగే ఆయన హరితహారం పథకంపై సంచలన వ్యాఖ్యలు చేస్తూ.. హరితహారం పేరుతో హరీష్ రావు 35 వేల కోట్ల రూపాయలు తినేశారు. నేను దీనిని నిరూపించగలను, హరీష్ రావు సిద్ధమా..? అంటూ సవాల్ విసిరారు. పైసలు తిన్నందువల్లే కేసుల్లో తిరుగుతున్నారు అంటూ విమర్శలు గుప్పించారు. అకాగే తెలంగాణ ఏర్పాటుపై కూడా ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ.. అందరం కలసి కొట్లాడితేనే తెలంగాణ వచ్చిందన్నారు. ఇదేదో కెసిఆర్ కొట్లాడితేనే రాలేదన్నారు. ఈ సందర్భంగా భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ.. ములుగు జిల్లాలోని నా పరిధిలో ఉన్న రెండు మండలాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత సీతక్కదే అని స్పష్టం చేశారు. అలాగే ప్రజలకు ప్రస్తుతం మార్కెట్ ధర రూ.60 ఉన్న సన్నబియ్యం ఉచితంగా అందించడం కాంగ్రెస్ ప్రభుత్వ సామాజిక సంకల్పానికి నిదర్శనమని అన్నారు.

# కాళేశ్వరం నిర్మాణమే బ్లండర్

**దాంతో వరి దిగుబడులు పెరగడం అబద్దం**

**కాళేశ్వరం గొప్పలు చెప్పిన కెసిఆర్ అందుకు బాధ్యులు**

**చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి విమర్శలు**



**హైదరాబాద్, జూన్ 11 (జనంసాక్షి) :** కాళేశ్వరం పేరుతో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని బీజేపీ ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం మంచి అయినా, చెడు అయిన బాధ్యుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. ఒకప్పుడు మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుపై గొప్పలు చెప్పుకుని.. ఇప్పుడు తప్పించుకుంటున్నారని విశ్వేశ్వర్ రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణలో వరి దాన్యం దిగుబడి పెరగలేదని, ప్రపంచంలో అతి పెద్ద ఇంజనీరింగ్ బ్లండర్ కాళేశ్వరం అని, కాళేశ్వరంలో అవినీతి జరిగినా ప్రాజెక్ట్ కూడా మిగలలేదని ఎద్దేవా చేశారు. తాను బీఆర్ఎస్ పార్టీని వీడేందుకు కాళేశ్వరం కూడా ఓ కారణం అని కొండ విశ్వేశ్వర్ రెడ్డి చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణలో వరి దాన్యం దిగుబడి పెరగలేదు. కాళేశ్వరం పేరుతో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ డిజైన్ అన్ని విధాలుగా తప్పు. మేడిగడ్డను బ్యారేజ్‌గా కాకుండా.. డ్యాంగా వాడుకోవడం వల్లనే దెబ్బతింది. అప్పుడు కాళేశ్వరంపై గొప్పలు చెప్పుకుని.. ఇప్పుడు కేసీఆర్ తప్పించుకుంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ స్వయం ప్రత్యక్షం అయిందా?. గవర్నర్ కేసీఆర్ గారిని కాళేశ్వర్ రావు అని పిలిచారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రతి రైతు ప్రతి ఏడాది 91 వేలు రూపాయలు లబ్ది పొందుతున్నారు. బీజేపీ ఎంపీలు వేస్ట్ అని ఆరోపిస్తున్నారు. తెలంగాణను ఆదుకుంటుంది కేంద్రం. నవోదయ స్కూల్స్, టూరిజం నిధులు, పీఎం శ్రీ, పీఎం కుసుమ్ పథకం కింద మిగతా రాష్ట్రాలతో పోల్చుకుంటే.. తెలంగాణకు ఎక్కువ నిధులు వచ్చాయని బీజేపీ ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి చెప్పారు. కేబినెట్ అంటే కేసీఆర్.. కేసీఆర్ అంటే కేబినెట్. కమిషన్ అడిగిన దానికి ఈటల రాజేందర్ సమాధానం చెప్పారు. కేసీఆర్ గురించి అడిగి ఉంటే ఈటల చెప్పే వారని అన్నారు. కేసీఆర్ ఆహ్వానం మేరకు కొండ విశ్వేశ్వర్ రెడ్డి 2013లో రాజకీయాల్లోకి వచ్చారు . 2014 సార్వత్రిక ఎన్నికల్లో చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం నుండి గెలిచారు. 2018లో భారత రాష్ట్ర సమితికి రాజీనామా చేసి.. కాంగ్రెస్‌లో చేరారు. 2019లో చేవెళ్ల నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ- చేసి ఓడిపోయారు. మార్చి 2021లో కాంగ్రెస్ పార్టీకి కూడా రాజీనామా చేసి భారతీయ జనతా పార్టీలో చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల నుండి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు.

# ఇంజనీర్ నూనె శ్రీధర్ ఆస్తులు వందకోట్ల మాటే

**విల్లాలు, ప్లాట్లు, ఓపెన్ ప్లాట్లు, 16 ఎకరాల వ్యవసాయ భూమి**

**ఎసిబి సోదాల్లో భారీగా బయటపడ్డ ఆస్తులు**




**హైదరాబాద్, జూన్11 (జనంసాక్షి) :** నీటిపారుదల శాఖ ఈఈ నూనె శ్రీధర్ నివాసం, కార్యాలయం, అతని బంధువుల ఇళ్లలో ఏసీబీ అధికారులు జరిపిన సోదాల్లో భారీగా ఆస్తులు గుర్తించారు. కళ్లు చెదిరిపోయేలా ఆస్తులు ఉన్నట్లు తేలింది. శ్రీధర్ తన పదవిని అడ్డం పెట్టుకొని భారీగా అక్రమ ఆస్తులు కూడబెట్టినట్టు ఏసీబీ నిర్ధరించింది. దీంతో నూనె శ్రీధర్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసిన అధికారులు అతన్ని అరెస్టు చేసి నాంపల్లి కోర్టులో హాజరు పర్చారు.వీటి విలువ కోట్లల్లో ఉంటుంది. తెల్లాపూర్‌లో విల్లా, షేక్‌పేటలో ప్లాట్, కరీంనగర్‌లో 3 ఓపెన్ ప్లాట్లు-, అమీర్‌పేటలో వాణిజ్య భవనం, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్‌లో 3 ఇండిపెండెంట్ హౌస్‌లు, అతనికి సంబంధించి 16 ఎకరాల వ్యవసాయ భూమి గుర్తించారు. హైదరాబాద్, కరీంనగర్, వరంగల్‌లో 19 ఓపెన్ ప్లాట్‌లు ఉన్నట్టు తేలింది. బహిరంగ మార్కెట్‌లో ఈ ఆస్తుల విలువ రూ.వందల కోట్లు- ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు. రెండు కార్లు, బంగారు ఆభరణాలు, బ్యాంకులో భారీగా నగదు నిల్వలు తనిఖీల్లో బయటపడ్డాయి. మరికొన్ని ప్రాంతాల్లో సోదాలు నిర్వహించాల్సి ఉందని ఏసీబీ అధికారులు తెలిపారు. శ్రీధర్ ఎస్ఆర్ఎస్పీ డివిజన్-8లో ఈఈగా పని చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో 6, 7, 8 ప్యాకేజీల పనులను పర్యవేక్షించారు. ప్రస్తుతం ఇరిగేషన్ ఇంజినీర్ల సంఘం అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.

# సూపర్ సిక్స్ హామీల్లో మరో పథకం

**నేటినుంచి తల్లికి వందనం అమలుకు శ్రీకారం**

**67 లక్షల మందికి తల్లికి వందనం కింద నగదు జమ**

**సిఎం చంద్రబాబు ఆదేశం**



**అమరావతి, జూన్11 (జనంసాక్షి) :** తల్లులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మరో ముఖ్యమైన పథకం అమలుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తల్లికి వందనం పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంగా గురువారం తల్లులకు కానుకగా తల్లికి వందనం నిధులు ఇవ్వాలని నిర్ణయించింది. జూన్ 12న తల్లికి వందనం నిధులు విడుదల కానున్నాయి. రాష్ట్రంలో మొత్తం 67 లక్షల మందికి తల్లికి వందనం పథకం కింద వారివారి ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేయనుంది. ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ తల్లికి వందనం ఇస్తామన్న మేనిఫెస్టో హామీ మేరకు పథకం అమలుకు నిర్ణయం తీసుకుంది. తల్లికి వందనం కింద ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున ప్రభుత్వం చెల్లించనుంది. ఈ మేరకు 67,27,164 మంది విద్యార్థులకు ఈ పథకం వర్తించనుంది. తల్లికి వందనం పథకం కింద తల్లుల ఖాతాల్లో రూ.8,745 కోట్లను కూటమి ప్రభుత్వం జమ చేయనుంది. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే తల్లికి వందనం నిధులు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం బుధవారం అర్ధరాత్రి నుంచే నిధులు విడుదల కానున్నాయి. 1వ తరగతిలో అడ్మిషన్ పొందే పిల్లలు, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో చేరే విద్యార్థులకూ తల్లికి వందనం పథకం అమలు కానుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంగా తల్లులకు కానుకగా తల్లికి వందనం ఇవ్వనుంది ప్రభుత్వం.. ఈ మేరకు సీఎం చంద్రబాబు.. తల్లికి వందనంపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని 67 లక్షల మందికి తల్లికి వందనం పథకం నిధులు వారి ఖాతాల్లో జమ చేయనుంది. అడ్మిషన్లు పూర్తయ్యి డేటా అందుబాటులోకి రాగానే ఆ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేయనున్నారు.. విధి విధానాలను ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది ప్రభుత్వం.. కాగా, సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే పింఛన్ల పెంపు, అన్నా క్యాంటీన్, మెగా డీఎస్సీ, దీపం-2 పథకాలు అమలు చేసిన ప్రభుత్వం.. ఇప్పుడు తల్లికి వందనం అమలుపై నిర్ణయం తీసుకుంది.

# పంజాబ్ నేషనల్ బ్యాంకుతో సింగరేణి ఒప్పందం

**కోటి 25 లక్షల రూపాయల ప్రమాద బీమా ఒప్పందం**

**సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్**

**తొలిసారిగా సింగరేణి ఉద్యోగులకు అతి పెద్ద శాలరీ, బీమా ప్యాకేజ్ అమలు :**

**నేటి నుంచి అమలులోకి రానున్న ప్రమాద బీమా పథకం**

**పంజాబ్ నేషనల్ బ్యాంక్ సీఈఓ అండ్ ఎండీ అశోక్ చంద్ర**



**మంచిర్యాల ప్రతినిధి జూన్ 11 (జనంసాక్షి) :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు కార్మిక సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ఇప్పటికే కోటి రూపాయలు ప్రమాద బీమా పథకం అమలు చేస్తుండగా.. సంక్షేమ ప్రయోజనాన్ని మరింత పెంచుతూ పంజాబ్ నేషనల్ బ్యాంక్ ద్వారా సింగరేణి సంస్థ బుధవారం కుదుర్చుకున్న కోటి 25 లక్షల రూపాయల ప్రమాద బీమా పథకం ఒక చారిత్రక ఘట్టమని సింగరేణి సంస్థ ఛైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్ లో జరిగిన సమావేశంలో పంజాబ్ నేషనల్ బ్యాంకుతో ఈ ఒప్పందం కుదిరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రమాదవశాత్తు కార్మికులు మృతి చెందినప్పుడు కంపెనీ ఇస్తున్న సహాయం కొంత ఉన్నప్పటికీ వారి కుటుంబాలకు మరింత ఆర్థిక భరోసా కల్పించాలన్న ఉద్దేశంతో బ్యాంకులతో మాట్లాడి ఈ తరహా ప్రమాద బీమా పథకాన్ని అమలు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే అమలవుతున్న పథకాల వల్ల కార్మికుల కుటుంబాలకు గట్టి ఆర్థిక భరోసా లభించిందని అన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ వారు కూడా మిగిలిన బ్యాంకుల అన్నిటికన్నా ఎక్కువగా కోటి 25 లక్షల రూపాయల బీమా పథకాన్ని అమలు చేయడానికి ముందుకు రావడం, అలాగే సాధారణ మరణం సంభవించిన వారికి 10 లక్షల రూపాయల టర్మ్ ఇన్సూరెన్స్ ను కూడా పంజాబ్ నేషనల్ బ్యాంక్ అమలు చేయడం ఎంతో సంతోషకరమన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ ద్వారా సింగరేణి పొరుగు సేవల ఉద్యోగుల కోసం 40 లక్షల రూపాయల ప్రమాద బీమా ఒప్పందాన్ని కూడా అమలు చేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యలను పెద్ద ఎత్తున చేపడుతోందని సోలార్ విద్యుత్తు, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ ఎలక్ట్రిసిటీ తదితర రంగాలలోకి ప్రవేశిస్తుందనీ, ఈ నేపథ్యంలో బ్యాంకులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ ముందుకు పోతుందని పేర్కొన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ సీఈవో అండ్ ఎండీ శ్రీ అశోక్ చంద్ర మాట్లాడుతూ... సింగరేణి సంస్థతో తాము కుదుర్చుకున్న ఈ ఒప్పందం ఇతరులకు కూడా ఆదర్శప్రాయమని అన్నారు. ఈ పథకం నేటి నుండి సింగరేణి ఉద్యోగులకు అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ తరహా ఒప్పందాలను ఇతర శాఖలకు కూడా విస్తరించనున్నమని తెలియజేశారు. సింగరేణి వ్యాపార విస్తరణ ప్రాజెక్ట్ లకు తమ తరఫున పూర్తి సహకారం అందిస్తామని, సింగరేణితో కలిసి ముందడుగు వేయడం ఎంతో సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగరేణి సంస్థ తరఫున ఇంకా డైరెక్టర్ ఆపరేషన్ ఎల్.వి సూర్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్.డి.ఎం.సుభాని, జనరల్ మేనేజర్ మార్కెటింగ్ ఎన్.వి.రాజశేఖర్ రావు, పంజాబ్ నేషనల్ బ్యాంక్ హైదరాబాద్ రీజినల్ చీఫ్ జనరల్ మేనేజర్ సునీల్ కుమార్ చుగ్ ఇంకా ఇతర అధికారులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370